www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66
సంచిక : 271
శనివారం 24-03-2018
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+ టాబ్లాయిడ్
విజయవాడ ప్రచురణ

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- లాభదాయక పదవుల అంశాన్ని పున: పరిశీలించండి - ఈసీని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు
- కేంద్ర నోటిఫికేషన్ చట్టవిరుద్ధం
- ఇది నిజాయతీ సాధించిన విజయం : కేజ్రీవాల్



ఆప్ ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించింది. లాభదాయక పదవుల కేసులో ఆ పార్టీ 20 మంది ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత వేటును తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది.

9లో

లోక్‌పాల్, వ్యవసాయ దుస్థితిపై
హజారే నిరవధిక దీక్ష




43 లేఖలు రాసినా మోడీ స్పందించ లేదని వెల్లడి

సామాజిక కార్యకర్త అన్నా హజారే కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. అవినీతికి వ్యతిరేకంగా ఆయన శుక్రవారం నుంచి తన తాజా పోరాటాన్ని ప్రారంభించారు. కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ హజారే శుక్రవారం నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు.

9లో

అక్టోబరులో చంద్రయాన్-2

ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి



భారత్‌కు చెందిన రెండో చంద్ర మిషన్ 'చంద్రయాన్-2' ప్రయోగం అక్టోబరుకు వాయిదాపడింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం ఏప్రిల్ నెలలో ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. అయితే, కొన్ని పరీక్షలు నిర్వహించాలన్న నిపుణుల సూచన మేరకు ఈ ప్రయోగాన్ని అక్టోబరు నెలకు వాయిదావేసినట్టు ఇస్రో శుక్రవారం తెలిపింది.

2లో

పార్లమెంటును నిరవధికంగా వాయిదావేస్తే..
అదేరోజు బ్లాక్‌డే..!



ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ మచిలీపట్నంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కోనేరు సెంటర్ వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న రామకృష్ణ, మధు, చలసాని, జల్లి విల్సన్, వైవీరావు, అక్కినేని వనజ, నిర్మల, పేర్ని వెంకట్రామయ్య తదితరులు

11లో

- 27న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు
- 28న విద్యార్థి, యువజన జేఏసీల ఏర్పాటు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- అందరూ కలిసి రావాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు
- ఒకే వేదికగా హోదా ఉద్యమం: చలసాని

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి :
రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై చర్చించకుండా పార్లమెంటు సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తే సహించేది లేదని, అదే రోజు రాష్ట్రంలో బ్లాక్‌డే నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర నేత కె.రామకృష్ణ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్ష, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ, విభజన హామీలు, హోదా అంశాన్ని తేల్చకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. హోదా కోసం ఈ నెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ రహదారుల దిగ్బంధనం పూర్తిగా విజయవంతమైందని చెప్పారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై కన్నెర్రజేశారని, 13 జిల్లాల్లో జాతీయ రహదారులను ప్రజలు స్వచ్ఛందంగా దిగ్బంధించారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో 16 రాజకీయ పార్టీలు, 45 ప్రజాసంఘాల నేతలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని వివరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఉప రాష్ట్రపతి

- మిగతా 2 లో

కాంగ్రెస్ అవిశ్వాస అస్త్రం

స్పీకర్‌కు మల్లిఖార్జున ఖర్గే నోటీసు

ఎంపీలకు విప్ జారీ



న్యూఢిల్లీ :
ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ప్రతిపక్ష పార్టీలు ఏకమవుతున్నాయి. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్...ఇక తానే స్వయంగా రంగంలోకి దిగింది. నరేంద్రమోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ కార్యాలయానికి పంపారు. మంగళవారం సభా కార్యకలాపాలకు సంబంధించిన జాబితాలో తమ అవిశ్వాస నోటీసును చేర్చాలని కోరారు. శుక్రవారం ఉదయం కాంగ్రెస్‌కు సంబంధించిన ముఖ్య నేతలంతా కలిసి చర్చించిన తర్వాత ఖర్గే కార్యాలయం నుంచి అవిశ్వాస నోటీసును సుమిత్రా మహాజన్ కార్యాలయానికి పంపారు. మంగళవారం అంతా సభకు హాజరు కావాలని కోరుతూ కాంగ్రెస్ తన ఎంపీలకు విప్ జారీ చేసింది. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయని, రోజుకో బ్యాంకు కుంభకోణం వెలుగుచూస్తోందని, రాఫెల్ విమానాల కొనుగోళ్లలో అక్రమాలు తదితర అంశాలు చర్చకు రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటున్నదని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇప్పటివరకు పెట్టిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ తిరస్కరిస్తున్న నేపథ్యంలో తాము పెట్టిన తీర్మానాన్ని మంగళవారం సభా కార్యకలాపాల జాబితాలో ఉంచాలని ఆయన కోరారు. దీనికనుగుణంగానే మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందే స్పీకర్‌తో భేటీ కావాలని కాంగ్రెస్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. సభ ఆర్డర్‌లో ఉంచి అవిశ్వాస తీర్మానాలపై చర్చ, పూర్తిస్థాయిలో నిర్ణయం జరిగే విధంగా, సభ సజావుగా సాగేలా చూడాలని స్పీకర్‌ను కోరనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

సులభతర వాణిజ్యంలో
ఏపీ నంబరు వన్



- ముఖ్యమంత్రి చంద్రబాబు
- హీరో మోటార్స్ పరిశ్రమకు భూమి పూజ
- 600 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

విశాలాంధ్ర – సత్యవేడు/వరదయ్యపాళెం :
చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెం వద్ద 600 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో నూతనంగా నిర్మించనున్న హీరో మోటార్స్ పరిశ్రమకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథ్ రెడ్డి, కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, శ్రీ సిటీ ఎండీ రవి సన్న రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ మొదటిసారిగా దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెంలో హీరో మోటార్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషమని, ఈ రోజు చరిత్రాత్మక రోజు అని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ హీరో మోటార్స్ ఏపీకి రావడం హ్యాపీ, హీరో మోటార్స్ కుటుంబంతో నాకు ముందు నుంచి మంచి సంబంధాలు ఉండడం వల్ల హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్‌ను ఒప్పించి కంపెనీ 8వ తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకువచ్చామన్నారు. లాజిస్టిక్స్‌లో, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ అని అన్నారు. పరిశ్రమల

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ప్రత్యక్ష ప్రసారంలో
మోకీలు మార్పిడి

- గుజరాత్ వేదికగా 23 దేశాల ప్రతినిధుల వీక్షణ
- అంతర్జాతీయస్థాయికి గుంటూరు జీజీహెచ్ ఖ్యాతి



విశాలాంధ్ర–గుంటూరు వైద్యశాఖ :
గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రిలో మోకీలు ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్‌ను గుజరాత్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న 23 దేశాల వైద్యులు ప్రత్యక్షంగా వీక్షించారు. వివిధ దేశాల వైద్యులు తమ సందేహాలను గుంటూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దీంతో గుంటూరు జీజీహెచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు గుంటూరు ప్రభుత్వాసుపత్రి అంటే నమ్మకమన్నారు. మోకీలు ఆపరేషన్ చేసిన డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయమన్నారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన మోకీలు

- మిగతా 2 లో

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 05
సంచిక : 124
శనివారం 24-03-2018
Simultaneously published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Karimnagar, Khammam
వెల: రూ.3.00
పేజీలు : 12+8
విశాఖపట్నం/ కర్నూలు/ తిరుపతి ప్రచురణ

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- లాభదాయక పదవుల అంశాన్ని పున: పరిశీలించండి - ఈసీని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు
- కేంద్ర నోటిఫికేషన్ చట్టవిరుద్ధం
- ఇది నిజాయతీ సాధించిన విజయం : కేజ్రీవాల్



ఆప్ ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించింది. లాభదాయక పదవుల కేసులో ఆ పార్టీ 20 మంది ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత వేటును తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది.

9లో

లోక్‌పాల్, వ్యవసాయ దుస్థితిపై హజారే నిరవధిక దీక్ష



43 లేఖలు రాసినా మోడీ స్పందించ లేదని వెల్లడి

సామాజిక కార్యకర్త అన్నా హజారే కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. అవినీతికి వ్యతిరేకంగా ఆయన శుక్రవారం నుంచి తన తాజా పోరాటాన్ని ప్రారంభించారు. కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ హజారే శుక్రవారం నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభించారు.

9లో

అక్టోబరులో చంద్రయాన్-2

ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడి



భారత్‌కు చెందిన రెండో చంద్ర మిషన్ 'చంద్రయాన్-2' ప్రయోగం అక్టోబరుకు వాయిదాపడింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం ఏప్రిల్ నెలలో ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. అయితే, కొన్ని పరీక్షలు నిర్వహించాలన్న నిపుణుల సూచన మేరకు ఈ ప్రయోగాన్ని అక్టోబరు నెలకు వాయిదావేసినట్టు ఇస్రో శుక్రవారం తెలిపింది.

2లో

పార్లమెంటును నిరవధికంగా వాయిదావేస్తే..

అదేరోజు బ్లాక్‌డే..!



ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోరుతూ మచిలీపట్నంలో అంబేద్కర్ విగ్రహం నుంచి కోనేరు సెంటర్ వరకు భారీ కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న రామకృష్ణ, మధు, చలసాని, జల్లి విల్సన్, వైవీరావు, అక్కినేని వనజ, నిర్మల, పేర్ని వెంకట్రామయ్య తదితరులు

11లో

- 27న అంబేద్కర్ విగ్రహానికి పూలదండలు
- 28న విద్యార్థి, యువజన జేఏసీల ఏర్పాటు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- అందరూ కలిసి రావాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు
- ఒకే వేదికగా హోదా ఉద్యమం: చలసాని

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : రాష్ట్రానికి ప్రత్యేక హోదాపై చర్చించకుండా పార్లమెంటు సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తే సహించేది లేదని, అదే రోజు రాష్ట్రంలో బ్లాక్‌డే నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర నేత కె.రామకృష్ణ హెచ్చరించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్ష, ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ, విభజన హామీలు, హోదా అంశాన్ని తేల్చకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. హోదా కోసం ఈ నెల 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ రహదారుల దిగ్బంధనం పూర్తిగా విజయవంతమైందని చెప్పారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై కన్నెర్రజేశారని, 13 జిల్లాల్లో జాతీయ రహదారులను ప్రజలు స్వచ్ఛందంగా దిగ్బంధించారని పేర్కొన్నారు. ఈ ఆందోళనలో 16 రాజకీయ పార్టీలు, 45 ప్రజాసంఘాల నేతలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని వివరించారు. ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కృషి చేయాల్సిన బాధ్యత ఉప రాష్ట్రపతి

- మిగతా 2 లో

కాంగ్రెస్ అవిశ్వాస అస్త్రం

స్పీకర్‌కు మల్లిఖార్జున ఖర్గే నోటీసు

ఎంపీలకు విప్ జారీ



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ప్రతిపక్ష పార్టీలు ఏకమవుతున్నాయి. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ, టీడీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్...ఇక తానే స్వయంగా రంగంలోకి దిగింది. నరేంద్రమోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే అవిశ్వాస తీర్మానాన్ని స్పీకర్ సుమిత్రా మహాజన్ కార్యాలయానికి పంపారు. మంగళవారం సభా కార్యకలాపాలకు సంబంధించిన జాబితాలో తమ అవిశ్వాస నోటీసును చేర్చాలని కోరారు. శుక్రవారం ఉదయం కాంగ్రెస్‌కు సంబంధించిన ముఖ్య నేతలంతా కలిసి చర్చించిన తర్వాత ఖర్గే కార్యాలయం నుంచి అవిశ్వాస నోటీసును సుమిత్రా మహాజన్ కార్యాలయానికి పంపారు. మంగళవారం అంతా సభకు హాజరు కావాలని కోరుతూ కాంగ్రెస్ తన ఎంపీలకు విప్ జారీ చేసింది. దేశంలో అనేక సమస్యలు ఉన్నాయని, రోజుకో బ్యాంకు కుంభకోణం వెలుగుచూస్తోందని, రాఫెల్ విమానాల కొనుగోళ్లలో అక్రమాలు తదితర అంశాలు చర్చకు రాకుండా ప్రభుత్వం అడ్డుకుంటున్నదని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఇప్పటివరకు పెట్టిన అవిశ్వాస తీర్మానాలను స్పీకర్ తిరస్కరిస్తున్న నేపథ్యంలో తాము పెట్టిన తీర్మానాన్ని మంగళవారం సభా కార్యకలాపాల జాబితాలో ఉంచాలని ఆయన కోరారు. దీనికనుగుణంగానే మంగళవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభానికి ముందే స్పీకర్‌తో భేటీ కావాలని కాంగ్రెస్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. సభ ఆర్డర్‌లో ఉంచి అవిశ్వాస తీర్మానాలపై చర్చ, పూర్తిస్థాయిలో నిర్ణయం జరిగే విధంగా, సభ సజావుగా సాగేలా చూడాలని స్పీకర్‌ను కోరనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు పేర్కొన్నాయి.

సులభతర వాణిజ్యంలో ఏపీ నంబరు వన్



- ముఖ్యమంత్రి చంద్రబాబు
- హీరో మోటార్స్ పరిశ్రమకు భూమి పూజ
- 600 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు

విశాలాంధ్ర - సత్యవేడు/వరదయ్యపాళెం : చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెం వద్ద 600 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడితో నూతనంగా నిర్మించనున్న హీరో మోటార్స్ పరిశ్రమకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి ఎన్.అమరనాథ్ రెడ్డి, కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, శ్రీ సిటీ ఎండీ రవి సన్న రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ మొదటిసారిగా దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెంలో హీరో మోటార్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషమని, ఈ రోజు చరిత్రాత్మక రోజు అని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ హీరో మోటార్స్ ఏపీకి రావడం హ్యాపీ, హీరో మోటార్స్ కుటుంబంతో నాకు ముందు నుంచి మంచి సంబంధాలు ఉండడం వల్ల హీరో మోటార్స్ సీఎండీ పవన్ ముంజల్‌ను ఒప్పించి కంపెనీ 8వ తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకువచ్చామన్నారు. లాజిస్టిక్స్‌లో, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ అని అన్నారు. పరిశ్రమల

- మిగతా 2 లో

26న పదో తరగతి పరీక్ష యథాతథం

2లో

ఆరో రోజూ అదే రచ్చ

అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల లొల్లి

9లో

దక్షిణాది సత్తా చాటుదాం

సిద్దరామయ్య

9లో

ఆర్‌అండ్‌బీకి అన్యాయం

- 4,760 కి.మీ రహదారుల నిర్మాణానికి నిధుల లేమి
- పంచాయతీరాజ్ నుంచి 6 వేల కి.మీ. రోడ్ల బదలాయింపు
- మంత్రి అయ్యన్నపాత్రుడు నిష్ఠూరం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రహదారులు, భవనాల శాఖకు 2018-19 బడ్జెట్‌లో ఆర్థిక శాఖ అన్యాయం చేసిందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 16 శాతం అధికంగా నిధులను ఇచ్చామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారని, అయితే వాస్తవానికి 16 శాతం తక్కువ కేటాయింపుల జరిగాయని సభాపూర్వకంగా మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో శుక్రవారం అత్యవసర ప్రజాప్రాముఖ్యం కలిగిన విషయంగా 'రాష్ట్రంలో పంచాయితీ రోడ్లకు నిధులు' అనే అంశంపై ఎమ్మెల్యే జి.శ్యాంసుందర్ శివాజీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయితీరాజ్‌కు చెందిన 6,036 కిలోమీటర్ల రహదారులను రహదారులు, భవనాల శాఖకు బదలాయించినట్లు చెప్పారు. కేంద్రం అందచేసే సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్)తోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వీటిని అభివృద్ధి చేయాలని భావించామన్నారు. అయితే కేంద్రం నుంచి అంతంత మాత్రంగానే సాయం వస్తుండడంతో రాష్ట్రంపై పూర్తి భారం పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బదలాయించిన రహదారుల్లో ఇప్పటి వరకూ రూ.737 కోట్ల

- మిగతా 2 లో

ఇదీ లోకం!



ప్రత్యక్ష ప్రసారంలో మోకీలు మార్పిడి

గుజరాత్ వేదికగా 23 దేశాల ప్రతినిధుల వీక్షణ

అంతర్జాతీయస్థాయికి గుంటూరు జీజీహెచ్ ఖ్యాతి



విశాలాంధ్ర-గుంటూరు వైద్యశాఖ : గుంటూరు సమగ్ర ప్రభుత్వాసుపత్రిలో మోకీలు ఆపరేషన్ విజయవంతంగా జరిగింది. ఈ ఆపరేషన్‌ను గుజరాత్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న 23 దేశాల వైద్యులు ప్రత్యక్షంగా వీక్షించారు. వివిధ దేశాల వైద్యులు తమ సందేహాలను గుంటూరు ప్రభుత్వాసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దీంతో గుంటూరు జీజీహెచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు గుంటూరు ప్రభుత్వాసుపత్రి అంటే నమ్మకమన్నారు. మోకీలు ఆపరేషన్ చేసిన డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయమన్నారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన మోకీలు

- మిగతా 2 లో

దళితుల హక్కులు కాపాడాలి

ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీం తీర్పునకు నిరసన

గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఎంపీల ధర్నా



న్యూఢిల్లీ : ఎస్‌సీ/ఎస్‌టీ (దాడుల నిరోధక) చట్టంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెచ్చుపెరిగిపోతున్నాయని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఎస్సీ, ఎస్టీ చట్టానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరింది. సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ/ఎస్టీ చట్టం క్రింద అరెస్టులకు సంబంధించిన నిబంధనలను నీరుగార్చే విధంగా ఉందని ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ తీర్పును సమీక్షించాలని లేదా చట్టాన్ని సవరించాలని డిమాండు చేసింది. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. "దళితుల హక్కుల రక్షణ కోసం రాహుల్ నిలబడ్డారు, ఎస్సీ/ఎస్టీలపై దాడులను నిలువరించాలి" అని కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాల నుంచి ఎస్సీ/ఎస్టీలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తూ, సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఇచ్చిన తీర్పుతో వారికున్న ఆ పాటి రక్షణ కూడా ఇప్పుడు కొరవడింది. సుప్రీంకోర్టు తీర్పు తరువాత దళితులు, ఇతర అట్టడుగు వర్గాలలో 'అభద్రతా భావం' నెలకొన్నదని వారు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ముందు ప్రభుత్వం సరిగా వాదించలేదని నిరసనకారులు పేర్కొన్నారు. ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వెయ్యాలని డిమాండు చేశారు. ఎస్‌సీ/ఎస్టీ చట్టం క్రింద తప్పుడు కేసులు పెడతామని బ్లాక్‌మెయిల్ చేయడం

- మిగతా 2 లో

వియత్నాంతో దక్షిణకొరియా వాణిజ్య బంధం



హనోయ్ : వియత్నాంతో దక్షిణకొరియా బలమైన వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకోనున్నట్లు దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ తెలిపారు. వియత్నాం అధ్యక్షుడు ట్రాన్‌దాయ్‌కుయాంగ్‌తో కలిసి ఇక్కడ అధ్యక్ష భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మూన్ పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కొరియా ద్వీపకల్పంలో నయోధ్యతోనే మార్పు సాధ్యమవుతుందని అన్నారు. వియత్నాంతో తమ స్నేహ సంబంధాలు అత్యంత బలోపేతమైనవని ఆయన చెప్పారు. వియత్నాంలో అత్యధికంగా దక్షిణకొరియా పెట్టుబడులు పెడుతున్నట్టు 1992 నుంచి స్నేహబంధం ఏర్పడిన తరువాత దక్షిణకొరియా పెట్టుబడులను క్రమంగా అధికం చేసింది. గత ఏడాది రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 61.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2020 నాటికి వాణిజ్యం 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

కోతలు, పన్నులు ప్రైవేటీకరణతో విధ్వంసం

లండన్ : బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ టోరీ ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రయోజనాలలో కోతలు విధించడం, పన్నులు పెంచడం, ప్రైవేటీకరణ, పొదుపు చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశాయని బ్రిటన్ లేబర్ పార్టీ నాయకుడు జెరిమి కార్బిన్ తీవ్రంగా విమర్శించారు. దేశంలోని ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు పేదరికంలో నివసిస్తున్నారని ఆయన ప్రభుత్వం ఇచ్చిన గణాంకాలను వెల్లడించారు. దేశంలో 40 లక్షలమందికిపైగా పిల్లలు పేదరికంలో మగ్గుతున్నారు. బ్రిటన్ యువతలో పేదరికంలో ఉన్న పిల్లలు 30 శాతం ఉన్నారు. గత ఏడాదే కనీసం లక్ష మంది పేదరికంలోకి జారిపోయారు. కార్బిన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ దేశంలో 2010 నుంచి 400కు పైగా లైబ్రరీలు, 600 యువజన కేంద్రాలు, మహిళా శరణార్థుల శిబిరాలలో 5వ వంతు శిబిరాలు మూసివేశారు. కోటీ 20 లక్షల మంది వయోవృద్ధులకు చట్టప్రకారం అందవలసిన ప్రయోజనాలు అందడంలేదని అన్ని రంగాలలోను టోరీ ప్రభుత్వం విఫలమయ్యిందని విమర్శించారు. ఈ గణాంకాలన్నీ విభ్రాంతి కలిగిస్తున్నాయని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు విఫలమయ్యాయని లేబర్ పార్టీ మరోనేత మార్గరెట్ గ్రీన్‌ఉడ్ విమర్శించారు.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల సంబంధాలు, స్థాయి

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

2018 సంవత్సరం కారల్ మార్క్స్ ద్విశతజయంతి, మార్క్స్, ఏంగెల్స్ రచన 'కమ్యూనిస్టు మేనిఫెస్టో" 170 వ వార్షికోత్సవ సందర్భంగా మార్క్సిజం సిద్ధాంతం - ఆచరణ గురించి, నేటి రాజకీయ, సామాజిక జీవితంలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల పాత్ర గురించి అనేక వ్యాసాలు వెలువడుతున్నాయి.

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ శాఖ ఉప అధిపతి ట్రాన్ దాక్ లోయి నేటి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంపై రాసిన వ్యాసంలో విలువైన సమాచారం వుంది.

కమ్యూనిస్టు పార్టీల మధ్య వివిధ స్థాయిలలో సంబంధ బాంధవ్యాలు పెరుగుతున్నాయి. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు సంఖ్యా బలం రీత్యా పెద్దవి. ప్రబలమైన రాజకీయ శక్తిగా నాయకత్వ స్థానాలలో వున్నాయి. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు నిర్బంధాల మధ్య పని చేస్తున్నాయి. పార్టీల మధ్య విస్తృతమైన సంబంధాలు ఒకేరకంగా లేవు. 150 పార్టీలతో రష్యన్ కమ్యూనిస్టు పార్టీకి ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయి. చైనా, వియత్నం, లావోస్, క్యూబా, కొరియా పార్టీలు ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు కల్గి యుండడమే కాకుండా, సిద్ధాంత సమస్యలపైన, సోషలిజం పరివర్తనపైన అనేక పార్టీలతో అనుభవాలను, భావాలను మార్పిడి చేసుకునేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాయి.

పైన పేర్కొన్న కమ్యూనిస్టు పార్టీలతో జపాను, ఫ్రెంచి, కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంత రంగంలో విశేష కృషి చేస్తున్నాయి.

1998 నుండి కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశాలు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి. దీని నిర్వహణ బాధ్యత ఒక వర్కింగ్ గ్రూపు చూస్తున్నది. సహకారం, సంఘీభావం, సఖ్యత, ఉమ్మడి పోరాటాలు, తలెత్తిన విభేదాలపై చర్చలు, ఈ సమావేశాలలో ప్రధానాంశాలుగా వున్నాయి. సమాచార యంత్రాంగం సోలిడ్‌నెట్ ఒకటి ఏర్పాటయింది. పార్టీల నివేదికలతో కూడిన ఒక బులిటెన్ ప్రతి సంవత్సరం వెలువడుతున్నది.

ఇటీవల జరిగిన అంతర్జాతీయ సమావేశంలో 85 దేశాల నుండి 118 కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. వారి దేశాలలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏమిటి? కమ్యూనిస్టు పార్టీ వ్యూహం ఏమిటి? రాజకీయ పంథాలపై ప్రతినిధులు ఆ సమావేశాలలో వివరణ యిస్తారు. ప్రస్తుత స్థితిలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, సంఘీభావం, అవశ్యకతపై సూచనలు, ప్రతిపాదనలు చేస్తారు.

బెల్జియం లేబరు పార్టీ, క్యూబా కమూనిస్టు పార్టీ ట్యునిసియా డెమాక్రటిక్ కాన్‌స్టిట్యూషనల్ పార్టీ ప్రత్యేకంగా వివిధ అంశాలపై అంతర్జాతీయ సెమినార్లు నిర్వహిస్తున్నాయి. **ఉదా: "గ్లోబలైజేషన్ - అభివృద్ధి".**



ఇవిగాక, ఇటీవల కాలంలో ప్రాంతీయ సమావేశాలు ఎక్కువగా జరగటం విశేషం. యూరప్ కమ్యూనిస్టు పార్టీలు, బాల్కన్ ప్రాంత కమ్యూనిస్టు పార్టీలు సంవత్సరంలో పలు మార్లు సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. కొత్తగా ప్రాంతీయ వేదికలు ఏర్పడుతున్నాయి. లాటిన్ అమెరికాలో బ్రెజిల్ లేబరు పార్టీ, మెక్సికన్ లేబర్‌పార్టీలు నిర్వహించే ఫోరమ్స్‌కు అన్ని ఖండాలకు చెందిన మేధావులు హాజరవుతున్నారు.

మాజీ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలు, తూర్పు యూరప్ పార్టీలు రౌండ్‌టేబుల్ సమావేశాలలో, నాటి సోషలిజం అనుభవాలు, నేడు నెలకొన్న పెట్టుబడిదారీ సంక్షుభిత వ్యవస్థ లక్షణాలను చర్చించి సోషలిజం పునరుజ్జీవనకై కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు బహుముఖంగా వున్నాయి. అంతర్గతంగా బలహీనతలు వెంటాడుతున్నాయి. అనేక దేశాలలో కమ్యూనిస్టు ఉద్యమం చీలికలకు లోనయింది. ఆలోచనలో, ఆచరణలో, కార్యాచరణలో ఐక్యత కొరవడింది. లక్ష్యాలు, వ్యూహాలలో విబేధాలు, పోరాట రూపాలలో భిన్నాభిప్రాయాలు, సోషలిజం పంథాపై విరుద్ధ వైఖరులు కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీన పరుస్తున్నాయి.

అయినప్పటికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం క్రమంగా నిలదొక్కుకోపటమే గాకుండా పునః సమీకరణ దిశగా, శక్తిని కూడగట్టుకుంటున్నది.

మోల్డోవాలో కమ్యూనిస్టుపార్టీ రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి వచ్చింది. రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టుపార్టీ ఎన్నికలలో రెండవ పెద్ద పార్టీగా అవతరించింది. జెక్ కమ్యూనిస్టుపార్టీ రాజకీయ పలుకుబడి గణనీయంగా పెరిగింది.

జపాను కమ్యూనిస్టు రెండవ పెద్ద పార్టీగా ఎన్నికలలో విజయం సాధించింది. నేపాల్ కమ్యూనిస్టుపార్టీ ఆ దేశ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దక్షిణాఫ్రికాలో కమ్యూనిస్టు పార్టీ శక్తివంతంగా పనిచేస్తున్నది.

బెలారస్ కమ్యూనిస్టు పార్టీ, ఆ దేశ పార్లమెంటు ఎన్నికలలో గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాలను గెలుచుకుంది. పోర్చుగీసు కమ్యూనిస్టు పార్టీ ఆదేశ పార్లమెంటులో 4వ స్థానంలో వుంది. యూరప్ పార్లమెంటులో లెఫ్ట్ పార్టీల సంఖ్యాబలం 52 వరకు వున్నది.

ఇటలీ, భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీలు మాత్రం ఇటీవల ఎన్నికలలో బలహీనపడినాయి. ఆర్మీనియా, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్, తజికస్తాన్, కజికిస్తాన్, తదితర మధ్య ఆసియా దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు పునరుద్ధరించబడినాయి.

సోషలిస్టు దేశాలలో పాలక కమ్యూనిస్టు పార్టీలు పాలనా సామర్థ్యాన్ని పెంచుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం నిరంతరం ప్రక్రియగా కొనసాగుతున్నది. అంతర్జాతీయ రంగంలో పాలక కమ్యూనిస్టు పార్టీల ప్రతిష్ట ఈ కాలంలో ఇనుమడించింది. ఆ దేశాల జాతీయ నిర్మాణంలో అవి సాధించిన విజయాలు దానికి తార్కాణం.

అక్టోబరులో చంద్రయాన్-2

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన రెండో చంద్ర మిషన్ 'చంద్రయాన్-2' ప్రయోగం అక్టోబరుకు వాయిదాపడింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం ఏప్రిల్ నెలలో ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. అయితే, కొన్ని పరీక్షలు నిర్వహించాలన్న నిపుణుల సూచన మేరకు ఈ ప్రయోగాన్ని అక్టోబరు నెలకు వాయిదావేసినట్టు ఇస్రో శుక్రవారం తెలిపింది. నిపుణులు ఇటీవల సమావేశమయ్యారు, కొన్ని పరీక్షలు నిర్వహించాలని సూచించారు ఈ నేపథ్యంలో ఈ ప్రయోగం ఇప్పుడే జరపడంలేదు. అక్టోబరులో జరుపుతాం అని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కే శివన్ తెలిపారు. "చంద్రయాన్2ని ఏప్రిల్‌లో ప్రయోగించడంలేదు. అక్టోబరుకు మారింది" అని ఇక్కడి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ శివన్ చెప్పారు. పీఎంఓ సహాయ మంత్రి, అంతరిక్ష విభాగం ఇన్‌ఛార్జి జితేంద్ర సింగ్ ఫిబ్రవరి 16వ తేదీన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రయోగం ఏప్రిల్‌లో జరుగుతుందని తెలిపారు. రూ. 800 కోట్ల విలువైన ఈ ప్రయోగం 2018 ఏప్రిల్ నుంచి నవంబరు మధ్యలో జరుగుతుందని ఇంతకుముందు శివన్ ప్రకటించారు. లక్షిత తేదీ ఏప్రిల్ అయినప్పటికీ, అక్టోబరు లేదా నవంబరులో ఈ ప్రయోగం జరుగుతుందని శివన్ తెలిపారు.

చంద్రయాన్-2 పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైందని ఇస్రో వర్గాలు తెలిపాయి. ఆర్బిటర్, లాండర్, రోవర్‌ను కలిగి వుంటుందని ఆ వర్గాలు వెల్లడించాయి. చంద్రయాన్-2అంతరిక్ష వాహకం బరువు దాదాపు 3,290 కిలోలు వుంటుందని పేర్కొన్నాయి. ఇస్రో మొట్టమొదటి చంద్రమిషన్ చంద్రయాన్-1ను 2008లో ప్రయోగించింది.

ఏపీ నంబరు వన్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు ఏపీ చాలా అనుకూలమన్నారు. కృష్ణపట్నం పోర్ట్, చెన్నై ఎయిర్‌పోర్టు, శ్రీసిటీ హీరో మోటార్స్‌కు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలోపు హీరో మోటార్స్ మొదటి దశ వాహనాల ఉత్పత్తి తయారు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల శాఖ, కలెక్టర్ నుండి సంపూర్ణ సహకారం అందిస్తామని పవన్ ముంజల్‌కు హామీ ఇచ్చారు. హీరో మోటార్స్ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రికల్ బైక్స్‌ను తయారు చేయాలని కోరారు. రాష్ట్రంలో 3 సార్లు ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించి రూ.18.55 లక్షల కోట్ల విలువ చేసే ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు సీఎం వివరించారు. ఇవన్నీ వస్తే దాదాపు 40 లక్షల మందికి ఉద్యోగాలు రావచ్చని చెప్పారు. రానున్న రోజుల్లో కృష్ణపట్నం నుండి కియా మోటార్స్ వరకు చిత్తూరు మీదుగా 4 లేన్ల జాతీయ రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమలకు నీరు, విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్యక్రమంలో ముఖ్యమంత్రి కూడా పవన్ ముంజల్‌ను సన్మానించారు. అనంతరం సీఎం రేణిగుంట ఎయిర్ పోర్ట్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు.

ఈ కార్యక్రమంలో వరదయ్యపాళెం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు మహేష్ బాబు, పార్టీ నాయకులు కరుణాకర్ నాయుడు, నిర్మల్, నవాబ్ వేణు, దసరదన్, అయ్యప్ప రెడ్డి, సత్యవేడు నాయకులు ఎంపీపీ మస్తాన్, సుందర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అదేరోజు బ్లాక్‌డే..!

(మొదటిపేజీ తరువాయి)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో చలసాని, మధు, వైవీరావు, దోనేపూడి, రామారావు తదితరులు

ఎం. వెంకయ్యనాయుడుపై వుందన్నారు. కేంద్ర పాలకులు రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీలు చేస్తున్న హడావుడితో బీజేపీ నేతలు సమావేశాల్ని వాయిదా వేయడం బాధాకరమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని, ఇందుకు నిరసనగా భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరుతూ 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల దగ్గర కార్యక్రమాల్ని చేపడతామన్నారు. హోదా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల 28వ తేదీన అన్ని యువజన,విద్యార్థి సంఘాలతో జేఏసీలను ఏర్పాటు చేస్తామన్నారు. అదే రోజు హోదా ఉద్యమ కార్యాచరణని ప్రకటిస్తామని చెప్పారు. కేంద్రంపై రాష్ట్ర ఎంపీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించకుండా, హోదా అంశంపై తేల్చకుండా పార్లమెంటు సమావేశాల్ని నిరవధికంగా వాయిదావేస్తే...అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 7.30గంటల మధ్య బ్లాక్‌డేగా ప్రకటిస్తామని రామకృష్ణ తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా మలిదశ ఉద్యమ ఆరంభంలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనానికి అనూహ్య ప్రజాస్పందన లభించిందని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి..రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కేవలం రెండు రాజకీయ పార్టీల సభ్యుల నిరసనల్ని సాకుగా చూపి పార్లమెంటు ఉభయసభలను వాయిదా వేయడం సముచితం కాదని అన్నారు. ఏప్రిల్ 5వరకూ కొనసాగాల్సిన పార్లమెంటు సమావేశాల్ని ముందస్తుగా వాయిదా వేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. ఈ విధానాల్ని తిప్పికొట్టాలని మధు పిలుపునిచ్చారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ ఉద్యమంలోకి టీడీపీ నేతలు సైతం అనివార్యంగా రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హోదా ఉద్యమాన్ని చీల్చివేసే దిశగా కొందరు నేతలు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారందరిని రాష్ట్ర ద్రోహులుగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు ఫణి మాట్లాడుతూ, ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలోనే టీఆర్ఎస్ ఎంపీలూ నిరసనకు దిగడం బాధాకరమని అన్నారు. టీఆర్ఎస్ ఎంపీల చుట్టూ రాష్ట్ర ఎంపీలంతా వలయంగా ఏర్పడి.. పార్లమెంటులో అవిశ్వాసం తీర్మానం చర్చకు వచ్చేలా చూడాలని కోరారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే వెంటనే అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించాలని డిమాండు చేశారు.

ఆర్‌అండ్‌బీకి అన్యాయం

- 4,760 కి.మీ రహదారుల నిర్మాణానికి నిధుల లేమి
- పంచాయతీరాజ్ నుంచి 6 వేల కి.మీ. రోడ్ల బదలాయింపు
- మంత్రి అయ్యన్నపాత్రుడు నిష్ఠూరం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రహదారులు, భవనాల శాఖకు 2018-19 బడ్జెట్‌లో ఆర్థిక శాఖ అన్యాయం చేసిందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే 16 శాతం అధికంగా నిధులను ఇచ్చామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారని, అయితే వాస్తవానికి 16 శాతం తక్కువ కేటాయింపుల జరిగాయని సభాపూర్వకంగా మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో శుక్రవారం అత్యవసర ప్రజాప్రాముఖ్యం కలిగిన విషయంగా 'రాష్ట్రంలో పంచాయితీ రోడ్లకు నిధులు' అనే అంశంపై ఎమ్మెల్యే జి.శ్యాంసుందర్ శివాజీ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయితీరాజ్‌కు చెందిన 6,036 కిలోమీటర్ల రహదారులను రహదారులు, భవనాల శాఖకు బదలాయించినట్లు చెప్పారు. కేంద్రం అందచేసే సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్)తోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వీటిని అభివృద్ధి చేయాలని భావించామన్నారు. అయితే కేంద్రం నుంచి అంతంత మాత్రంగానే సాయం వస్తుండడంతో రాష్ట్రంపై పూర్తి భారం పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. బదలాయించిన రహదారుల్లో ఇప్పటి వరకూ రూ.737 కోట్ల వ్యయంతో 1,376 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన 4,760 కి.మీ. రహదారుల నిర్మాణానికి ఇంకా 4,600 కోట్లు అవసరం అవుతాయని, అంత మొత్తం తమ శాఖ వద్ద లేదని ఆయన నిర్మొహమాటంగా సభలో వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపులపై జరిగే సమావేశంలో అయినా ఆర్థిక శాఖ తమ శాఖకు న్యాయం చేస్తోందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. నిధుల కొరత కారణంగా ప్రాధాన్యత క్రమంలో రహదారుల పనులు చేపడతామన్నారు. ముందుగా బస్సులు తిరిగే రహదారులను 'ఏ' కేటగిరిలో, గ్రామపంచాయితీల నుంచి మండలాలకు వెళ్లే రహదారులను 'బి' కేటగిరి విభజించి పనులు పూర్తి చేస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగే ప్రమాదాల నేపథ్యంలో కొన్ని బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, ప్రత్యేక నిధుల ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా రాష్ట్రంలో 4 వేల వంతెనలున్నాయని, వీటిలో 349 వంతెనలను వెంటనే నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిలో మరీ ముఖ్యంగా 50 వంతెనలు రోజుల్లోనే కూలిపోయే విధంగా ఉన్నందున యుద్ధప్రాతిపదికన వీటి పునర్నిర్మాణం, మరమ్మతులను చేపడతామని మంత్రి తెలిపారు. కాగా ఆత్మకూరు-శ్రీశైలం రోడ్డు విస్తరణపై కర్నూలు ఎమ్మెల్యే ఎస్‌వీ మోహనరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఈ రహదారిలో 66 కి.మీ. మార్గం జాతీయ రహదారి 340సిలోనూ, 55 కి.మీ మార్గం జాతీయ రహదారి 765లో ఉందన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు-దోర్నాల మార్గం ఒకే లేనుతో ఉన్నందున దానిని ఇరువైపులా కాలిబాటతో రెండు లేన్ల రహదారిగా విస్తరించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అటవీ శాఖ, పులుల సంరక్షణ జోన్‌లో ఈ మార్గం ఉన్నందున ఆయా శాఖల అనుమతుల కోసం ఇప్పటికే దరఖాస్తులు చేసినట్లు కూడా ఆయన సభకు వివరించారు. అలాగే వేరొక ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. పశ్చిమగోదావరి జిల్లా తేతలి, ఉండ్రాజవరంలో ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని ఎన్‌హెచ్ఏఐ చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 71 ఫ్లైఓవర్ బ్రిడ్జిలలో ఒకటి పూర్తయిందని, మిగిలిన వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు.

దళితుల హక్కులు కాపాడాలి

ఎస్సీ, ఎస్టీ చట్టంపై సుప్రీం తీర్పునకు నిరసన
గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఎంపీల ధర్నా



న్యూఢిల్లీ : ఎస్‌సీ/ఎస్‌టీ (దాడుల నిరోధక) చట్టంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని డిమాండు చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు శుక్రవారం పార్లమెంట్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ హయాంలో దళితులపై దాడులు పెచ్చుపెరిగిపోతున్నాయని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. ఎస్సీ, ఎస్టీ చట్టానికి సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరింది. సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీ/ఎస్టీ చట్టం క్రింద అరెస్టులకు సంబంధించిన నిబంధనలను నీరుగార్చే విధంగా ఉందని ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ తీర్పును సమీక్షించాలని లేదా చట్టాన్ని సవరించాలని డిమాండు చేసింది. పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. "దళితుల హక్కుల రక్షణ కోసం రాహుల్ నిలబడ్డారు, ఎస్సీ/ఎస్టీలపై దాడులను నిలువరించాలి" అని కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేశారు. అగ్రవర్ణాల దాడులు, దౌర్జన్యాల నుంచి ఎస్సీ/ఎస్టీలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తూ, సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఇచ్చిన తీర్పుతో వారికున్న ఆ పాటి రక్షణ కూడా ఇప్పుడు కొరవడింది. సుప్రీంకోర్టు తీర్పు తరువాత దళితులు, ఇతర అట్టడుగు వర్గాలలో 'అభద్రతా భావం' నెలకొన్నదని వారు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి అత్యున్నత న్యాయస్థానం ముందు ప్రభుత్వం సరిగా వాదించలేదని నిరసనకారులు పేర్కొన్నారు. ప్రభుత్వం రివ్యూ పిటీషన్ వెయ్యాలని డిమాండు చేశారు. ఎస్‌సీ/ఎస్టీ చట్టం క్రింద తప్పుడు కేసులు పెడతామని బ్లాక్‌మెయిల్ చేయడం ద్వారా నిజాయితీపరులైన ప్రభుత్వోద్యోగులు తమ విధులను నిర్వర్తించకుండా చేసే ప్రయత్నాల నుంచి రక్షించేందుకు ఈ చట్టం క్రింద తక్షణం అరెస్టు చేసే నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ ఖర్గే పార్లమెంట్ వెలుపల న్యూస్‌ఛానల్‌తో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మంగళవారం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ తీర్పును కనుక సమీక్షించకపోతే, అది అత్యంత దురదృష్టకరం. ఎస్సీ/ఎస్టీలు ఇతర అట్టడుగు తరగతులలో అభద్రతాభావం నెలకొంటోంది. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయంపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని మేము అభిప్రాయపడుతున్నాం" అని చెప్పారు. "ఈ అంశంలో ప్రభుత్వం ఎందుకు నిశబ్దంగా ఉంది. ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి. అటార్నీ జనరల్ ద్వారా సుప్రీంకోర్టు ముందు తన వాదనను వినిపించాలి. ప్రభుత్వం కనుక నోరుమెదపకుండావుంటే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సమర్థిస్తోందని అనుకోవాల్సి ఉంటుంది" అని అన్నారు. అంతకుముందు ఎంపీలు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని ఈ అంశాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్లమెంట్ లోపల పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపైన కూడా సమావేశంలో రాహుల్ చర్చించారని వర్గాలు తెలిపాయి.

బీజేపీ ఓ అబద్దాల ఫ్యాక్టరీ

బీజేపీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ విమర్శించారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో ఇప్పుడది తీరికలేకుండా ఉన్నదని అన్నారు. ఫేస్‌బుక్ నుంచి డేటా దొంగిలించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వివాదాస్పద సంస్థతో కలిసి కాంగ్రెస్ పనిచేస్తోందని బీజేపీ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తోందని రాహుల్ పేర్కొన్నారు.

మోకీలు మార్పిడి

(మొదటిపేజీ తరువాయి)



ఆపరేషన్‌ను గుజరాత్‌లో ఉన్న వైద్యులు ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. శస్త్రచికిత్స ప్రత్యక్ష ప్రసారాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పుల్లారావు విలేకర్లతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే లైవ్ సర్జరీకి సాయిభాస్కర హాస్పిటల్ ఎంపికైనప్పటికీ ప్రభుత్వాసుపత్రిలో గల మౌలిక సదుపాయాల గురించి అంతర్జాతీయ వేదికకు తెలియజెప్పేందుకు డాక్టర్ నరేంద్రరెడ్డి తీసుకున్న నిర్ణయం అదర్శనీయమని కొనియాడారు. గుజరాత్‌లోని వాపి నగరంలో జరిగే అంతర్జాతీయ శిక్షణా సదస్సుకు 23 దేశాల నుండి సర్జన్లు హాజరుకావడం, వారికి మోకీలు మార్పిడి ఆపరేషన్‌పై ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వడం ద్వారా వైద్య విద్యలో జీజీహెచ్ ముందుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాలు మాట్లాడుతూ ఇలాంటి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా రోగుల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు స్థానికంగా ఉన్న మెడికల్ విద్యార్థుల శిక్షణకు ఆస్కారం ఉందన్నారు. డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ 2015 నుంచి మోకీళ్ల మార్పిడిలో గుంటూరుకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చిందన్నారు. డాక్టర్ జి.వరప్రసాద్ మాట్లాడుతూ నరేంద్రరెడ్డి ఇప్పటివరకు 20 ఇంప్లాంట్స్‌ను ఉచితంగా అందించడమే కాకుండా ప్రతి బుధ, శనివారాల్లో నయాపైసా తీసుకోకుండా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్ నరేంద్రరెడ్డిని మంత్రి ప్రత్తిపాటి, ఎమ్మెల్యేలు, ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు ఘనంగా సత్కరించారు. డాక్టర్ పి.అనిల్‌బాబు, డాక్టర్ ఎం.శివారెడ్డి, డాక్టర్ సంధ్య, డాక్టర్ సాంబశివారెడ్డి, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ రమణ ఎస్ఎస్‌వీ పాల్గొన్నారు.

26న పదో తరగతి పరీక్ష యథాతథం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా పాఠశాలలకు సెలవును ప్రకటించింది.ఇదే రోజు కొనసాగాల్సిన సోషల్ స్టడీస్ పేపర్-1 పరీక్షను యథాతథంగా నిర్వహిస్తామని మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి.ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేదీతో పరీక్షలు పూర్తవుతాయి.

జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ (సమాచార,పౌర సంబంధాలు) ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఏపీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, ఏపీ జర్నలిస్ట్స్ ఫోరం, ఏపీ మీడియా ఫెడరేషన్లలో ఒక్కో యూనియన్ నుంచి ఒకరు చొప్పున ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.

వియత్నాంతో దక్షిణకొరియా వాణిజ్య బంధం



హనోయ్ : వియత్నాంతో దక్షిణకొరియా బలమైన వాణిజ్య సంబంధాలను ఏర్పరచుకోనున్నట్టు దక్షిణకొరియా అధ్యక్షుడు మూన్‌జాయ్‌ఇన్ తెలిపారు. వియత్నాం అధ్యక్షుడు ట్రాన్‌దాయ్‌కుయాంగ్‌తో కలిసి ఇక్కడ అధ్యక్ష భవనంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో మూన్ పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ కొరియా ద్వీపకల్పంలో సయోధ్యతోనే మార్పు సాధ్యమవుతుందని అన్నారు. వియత్నాంతో తమ స్నేహ సంబంధాలు అత్యంత బలోపేతమైనవని ఆయన చెప్పారు. వియత్నాంలో అత్యధికంగా దక్షిణకొరియా పెట్టుబడులు పెడుతున్నట్టు 1992 నుంచి స్నేహబంధం ఏర్పడిన తరువాత దక్షిణకొరియా పెట్టుబడులను క్రమంగా అధికం చేసింది. గత ఏడాది రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 61.5 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. 2020 నాటికి వాణిజ్యం 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

కోతలు, పన్నులు ప్రైవేటీకరణతో విధ్వంసం

లండన్ : బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ టోరీ ప్రభుత్వం ప్రజలకు అందించే ప్రయోజనాలలో కోతలు విధించడం, పన్నులు పెంచడం, ప్రైవేటీకరణ, పొదుపు చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేశాయని బ్రిటన్ లేబర్ పార్టీ నాయకుడు జెరిమి కార్బిన్ తీవ్రంగా విమర్శించారు. దేశంలోని ప్రతి ముగ్గురు పిల్లల్లో ఒకరు పేదరికంలో నివసిస్తున్నారని ఆయన ప్రభుత్వం ఇచ్చిన గణాంకాలను వెల్లడించారు. దేశంలో 40 లక్షలమందికిపైగా పిల్లలు పేదరికంలో మగ్గుతున్నారు. బ్రిటన్ యువతలో పేదరికంలో ఉన్న పిల్లలు 30 శాతం ఉన్నారు. గత ఏడాదే కనీసం లక్ష మంది పేదరికంలోకి జారిపోయారు. కార్బిన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ దేశంలో 2010 నుంచి 400కు పైగా లైబ్రరీలు, 600 యువజన కేంద్రాలు, మహిళా శరణార్థుల శిబిరాలలో 5వ వంతు శిబిరాలు మూసివేశారు. కోటీ 20 లక్షల మంది వయోవృద్ధులకు చట్టప్రకారం అందవలసిన ప్రయోజనాలు అందడంలేదని అన్ని రంగాలలోను టోరీ ప్రభుత్వం విఫలమయ్యిందని విమర్శించారు. ఈ గణాంకాలన్నీ విభ్రాంతి కలిగిస్తున్నాయని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు విఫలమయ్యాయని లేబర్ పార్టీ మరోనేత మార్గరెట్ గ్రీన్‌ఉడ్ విమర్శించారు.

ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల సంబంధాలు, స్థాయి

ఈడ్పుగంటి నాగేశ్వరరావు

2018 సంవత్సరం కారల్ మార్క్స్ ద్విశతజయంతి, మార్క్స్, ఏంగెల్స్ రచన 'కమ్యూనిస్టు మేనిఫెస్టో" 170 వ వార్షికోత్సవ సందర్భంగా మార్క్సిజం సిద్ధాంతం - ఆచరణ గురించి, నేటి రాజకీయ, సామాజిక జీవితంలో ప్రపంచ కమ్యూనిస్టు పార్టీల పాత్ర గురించి అనేక వ్యాసాలు వెలువడుతున్నాయి.

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ శాఖ ఉప అధిపతి ట్రాన్ దాక్ లోయి నేటి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంపై రాసిన వ్యాసంలో విలువైన సమాచారం వుంది.


కమ్యూనిస్టు పార్టీల మధ్య వివిధ స్థాయిలలో సంబంధ బాంధవ్యాలు పెరుగుతున్నాయి. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు సంఖ్యా బలం రీత్యా పెద్దవి. ప్రబలమైన రాజకీయ శక్తిగా నాయకత్వ స్థానాలలో వున్నాయి. కొన్ని దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు నిర్బంధాల మధ్య పని చేస్తున్నాయి. పార్టీల మధ్య విస్తృతమైన సంబంధాలు ఒకేరకంగా లేవు. 150 పార్టీలతో రష్యన్ కమ్యూనిస్టు పార్టీకి ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయి. చైనా, వియత్నం, లావోస్, క్యూబా, కొరియా పార్టీలు ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలతో సంబంధాలు కల్గి యుండడమే కాకుండా, సిద్ధాంత సమస్యలపైన, సోషలిజం పరివర్తనపైన అనేక పార్టీలతో అనుభవాలను, భావాలను మార్పిడి చేసుకునేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాయి.

పైన పేర్కొన్న కమ్యూనిస్టు పార్టీలతో జపాను, ఫ్రెంచి, కమ్యూనిస్టు పార్టీలు సిద్ధాంత రంగంలో విశేష కృషి చేస్తున్నాయి.

1998 నుండి కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశాలు క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం జరుగుతున్నాయి. దీని నిర్వహణ బాధ్యత ఒక వర్కింగ్ గ్రూపు చూస్తున్నది. సహకారం, సంఘీభావం, సఖ్యత, ఉమ్మడి పోరాటాలు, తలెత్తిన విభేదాలపై చర్చలు, ఈ సమావేశాలలో ప్రధానాంశాలుగా వున్నాయి. సమాచార యంత్రాంగం సోలిడ్‌నెట్ ఒకటి ఏర్పాటయింది. పార్టీల నివేదికలతో కూడిన ఒక బులిటెన్ ప్రతి సంవత్సరం వెలువడుతున్నది.

ఇటీవల జరిగిన అంతర్జాతీయ సమావేశంలో 85 దేశాల నుండి 118 కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. వారి దేశాలలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఏమిటి? కమ్యూనిస్టు పార్టీ వ్యూహం ఏమిటి? రాజకీయ పంథాలపై ప్రతినిధులు ఆ సమావేశాలలో వివరణ యిస్తారు. ప్రస్తుత స్థితిలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ ఐక్యత, సంఘీభావం, అవశ్యకతపై సూచనలు, ప్రతిపాదనలు చేస్తారు.

బెల్జియం లేబరు పార్టీ, క్యూబా కమూనిస్టు పార్టీ ట్యునిసియా డెమాక్రటిక్ కాన్‌స్టిట్యూషనల్ పార్టీ ప్రత్యేకంగా వివిధ అంశాలపై అంతర్జాతీయ సెమినార్లు నిర్వహిస్తున్నాయి. ఉదా: "గ్లోబలైజేషన్ - అభివృద్ధి".



ఇవిగాక, ఇటీవల కాలంలో ప్రాంతీయ సమావేశాలు ఎక్కువగా జరగటం విశేషం. యూరప్ కమ్యూనిస్టు పార్టీలు, బాల్కన్ ప్రాంత కమ్యూనిస్టు పార్టీలు సంవత్సరంలో పలు మార్లు సమావేశమై వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉమ్మడి కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. కొత్తగా ప్రాంతీయ వేదికలు ఏర్పడుతున్నాయి. లాటిన్ అమెరికాలో బ్రెజిల్ లేబరు పార్టీ, మెక్సికన్ లేబర్‌పార్టీలు నిర్వహించే ఫోరమ్స్‌కు అన్ని ఖండాలకు చెందిన మేధావులు హాజరవుతున్నారు.

మాజీ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీలు, తూర్పు యూరప్ పార్టీలు రౌండ్‌టేబుల్ సమావేశాలలో, నాటి సోషలిజం అనుభవాలు, నేడు నెలకొన్న, పెట్టుబడిదారీ సంక్షుభిత వ్యవస్థ లక్షణాలను చర్చించి సోషలిజం పునరుజ్జీవనకై కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్లు బహుముఖంగా వున్నాయి. అంతర్గతంగా బలహీనతలు వెంటాడుతున్నాయి. అనేక దేశాలలో కమ్యూనిస్టు ఉద్యమం చీలికలకు లోనయింది. ఆలోచనలో, ఆచరణలో, కార్యాచరణలో ఐక్యత కొరవడింది. లక్ష్యాలు, వ్యూహాలలో విభేధాలు, పోరాట రూపాలలో భిన్నాభిప్రాయాలు, సోషలిజం పంథాపై విరుద్ధ వైఖరులు కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీన పరుస్తున్నాయి.

అయినప్పటికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం క్రమంగా నిలదొక్కుకోవటమే గాకుండా పునః సమీకరణ దిశగా, శక్తిని కూడగట్టుకుంటున్నది.

మోల్డోవాలో కమ్యూనిస్టుపార్టీ రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామ్యం ద్వారా అధికారంలోకి వచ్చింది. రష్యన్ ఫెడరేషన్ కమ్యూనిస్టుపార్టీ ఎన్నికలలో రెండవ పెద్ద పార్టీగా అవతరించింది. జెక్ కమ్యూనిస్టుపార్టీ రాజకీయ పలుకుబడి గణనీయంగా పెరిగింది.

జపాను కమ్యూనిస్టు రెండవ పెద్ద పార్టీగా ఎన్నికలలో విజయం సాధించింది. నేపాల్ కమ్యూనిస్టుపార్టీ ఆ దేశ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దక్షిణాఫ్రికాలో కమ్యూనిస్టు పార్టీ శక్తివంతంగా పనిచేస్తున్నది.

బెలారస్ కమ్యూనిస్టు పార్టీ, ఆ దేశ పార్లమెంటు ఎన్నికలలో గతంతో పోలిస్తే ఎక్కువ స్థానాలను గెలుచుకుంది. పోర్చుగీసు కమ్యూనిస్టు పార్టీ ఆదేశ పార్లమెంటులో 4వ స్థానంలో వుంది. యూరప్ పార్లమెంటులో లెఫ్ట్ పార్టీల సంఖ్యాబలం 52 వరకు వున్నది.

ఇటలీ, భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీలు మాత్రం ఇటీవల ఎన్నికలలో బలహీనపడినాయి. ఆర్మీనియా, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్, తజికస్తాన్, కజికిస్తాన్, తదితర మధ్య ఆసియా దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు పునరుద్ధరించబడినాయి.

సోషలిస్టు దేశాలలో పాలక కమ్యూనిస్టు పార్టీలు పాలనా సామర్థ్యాన్ని పెంచుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నాయి. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం నిరంతరం ప్రక్రియగా కొనసాగుతున్నది. అంతర్జాతీయ రంగంలో పాలక కమ్యూనిస్టు పార్టీల ప్రతిష్ఠ ఈ కాలంలో ఇనుమడించింది. ఆ దేశాల జాతీయ నిర్మాణంలో అవి సాధించిన విజయాలు దానికి తార్కాణం.

అక్టోబరులో చంద్రయాన్-2

న్యూఢిల్లీ : భారత్‌కు చెందిన రెండో చంద్ర మిషన్ 'చంద్రయాన్-2' ప్రయోగం అక్టోబరుకు వాయిదాపడింది. ముందుగా నిర్ణయించిన దాని ప్రకారం ఏప్రిల్ నెలలో ఈ ప్రయోగం జరగాల్సి ఉంది. అయితే, కొన్ని పరీక్షలు నిర్వహించాలన్న నిపుణుల సూచన మేరకు ఈ ప్రయోగాన్ని అక్టోబరు నెలకు వాయిదావేసినట్టు ఇస్రో శుక్రవారం తెలిపింది. నిపుణులు ఇటీవల సమావేశమయ్యారు, కొన్ని పరీక్షలు నిర్వహించాలని సూచించారు ఈ నేపథ్యంలో ఈ ప్రయోగం ఇప్పుడే జరపడంలేదు. అక్టోబరులో జరుపుతాం అని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఛైర్మన్ కే శివన్ తెలిపారు. "చంద్రయాన్2ని ఏప్రిల్‌లో ప్రయోగించడంలేదు. అక్టోబరుకు మారింది" అని ఇక్కడి విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ శివన్ చెప్పారు. పీఎంఓ సహాయ మంత్రి, అంతరిక్ష విభాగం ఇన్‌ఛార్జి జితేంద్ర సింగ్ ఫిబ్రవరి 16వ తేదీన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రయోగం ఏప్రిల్‌లో జరుగుతుందని తెలిపారు. రూ. 800 కోట్ల విలువైన ఈ ప్రయోగం 2018 ఏప్రిల్ నుంచి నవంబరు మధ్యలో జరుగుతుందని ఇంతకుముందు శివన్ ప్రకటించారు. లక్షిత తేదీ ఏప్రిల్ అయినప్పటికీ, అక్టోబరు లేదా నవంబరులో ఈ ప్రయోగం జరుగుతుందని శివన్ తెలిపారు.

చంద్రయాన్-2 పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైందని ఇస్రో వర్గాలు తెలిపాయి. ఆర్బిటర్, లాండర్, రోవర్‌ను కలిగి వుంటుందని ఆ వర్గాలు వెల్లడించాయి. చంద్రయాన్-2అంతరిక్ష వాహకం బరువు దాదాపు 3,290 కిలోలు వుంటుందని పేర్కొన్నాయి. ఇస్రో మొట్టమొదటి చంద్రమిషన్ చంద్రయాన్-1ను 2008లో ప్రయోగించింది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో చలసాని, మధు, వైవీరావు, దోనేపూడి, రామారావు తదితరులు



మోకీలు మార్పిడి

(మొదటిపేజీ తరువాయి)

ఆపరేషన్‌ను గుజరాత్‌లో ఉన్న వైద్యులు ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. శస్త్రచికిత్స ప్రత్యక్ష ప్రసారాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పుల్లారావు విలేకర్లతో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే లైవ్ సర్జరీకి సాయిభాస్కర హాస్పిటల్ ఎంపికైనప్పటికీ ప్రభుత్వాసుపత్రిలో గల మౌలిక సదుపాయాల గురించి అంతర్జాతీయ వేదికకు తెలియజెప్పేందుకు డాక్టర్ నరేంద్రరెడ్డి తీసుకున్న నిర్ణయం అదర్శనీయమని కొనియాడారు. గుజరాత్‌లోని వాపి నగరంలో జరిగే అంతర్జాతీయ శిక్షణా సదస్సుకు 23 దేశాల నుండి సర్జన్లు హాజరుకావడం, వారికి మోకీలు మార్పిడి ఆపరేషన్‌పై ప్రత్యక్షంగా శిక్షణ ఇవ్వడం ద్వారా వైద్య విద్యలో జీజీహెచ్ ముందుందని తెలిపారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాలు మాట్లాడుతూ ఇలాంటి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా రోగుల్లో మనోధైర్యం కల్పించడంతోపాటు స్థానికంగా ఉన్న మెడికల్ విద్యార్థుల శిక్షణకు ఆస్కారం ఉందన్నారు. డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ 2015 నుంచి మోకీళ్ల మార్పిడిలో గుంటూరుకు అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చిందన్నారు. డాక్టర్ జి.వరప్రసాద్ మాట్లాడుతూ నరేంద్రరెడ్డి ఇప్పటివరకు 20 ఇంప్లాంట్స్‌ను ఉచితంగా అందించడమే కాకుండా ప్రతి బుధ, శనివారాల్లో నయాపైసా తీసుకోకుండా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం డాక్టర్ నరేంద్రరెడ్డిని మంత్రి ప్రత్తిపాటి, ఎమ్మెల్యేలు, ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ రాజునాయుడు ఘనంగా సత్కరించారు. డాక్టర్ పి.అనిల్‌బాబు, డాక్టర్ ఎం.శివారెడ్డి, డాక్టర్ సంధ్య, డాక్టర్ సాంబశివారెడ్డి, జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగ ప్రొఫెసర్ రమణ ఎస్‌ఎవ్‌వీ పాల్గొన్నారు.

అదేరోజు బ్లాక్‌డే..!

(మొదటిపేజీ తరువాయి)

ఎం. వెంకయ్యనాయుడుపై వుందన్నారు. కేంద్ర పాలకులు రాష్ట్ర ప్రజల హక్కులను కాలరాస్తున్నారని చెప్పారు. పార్లమెంటులో టీఆర్‌ఎస్ ఎంపీలు చేస్తున్న హడావుడీతో బీజేపీ నేతలు సమావేశాల్ని వాయిదా వేయడం బాధాకరమని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతోందని, ఇందుకు నిరసనగా భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని కోరుతూ 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల దగ్గర కార్యక్రమాల్ని చేపడతామన్నారు. హోదా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఈ నెల 28వ తేదీన అన్ని యువజన,విద్యార్థి సంఘాలతో జేఏసీలను ఏర్పాటు చేస్తామన్నారు. అదే రోజు హోదా ఉద్యమ కార్యాచరణని ప్రకటిస్తామని చెప్పారు. కేంద్రంపై రాష్ట్ర ఎంపీలు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించకుండా, హోదా అంశంపై తేల్చకుండా పార్లమెంటు సమావేశాల్ని నిరవధికంగా వాయిదావేస్తే...అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 7.30గంటల మధ్య బ్లాక్‌డేగా ప్రకటిస్తామని రామకృష్ణ తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ, ప్రత్యేక హోదా మలిదశ ఉద్యమ ఆరంభంలో భాగంగా చేపట్టిన జాతీయ రహదారుల దిగ్బంధనానికి అనూహ్య ప్రజాస్పందన లభించిందని చెప్పారు. రాజకీయాలను పక్కనపెట్టి..రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ ఒకే తాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. కేవలం రెండు రాజకీయ పార్టీల సభ్యుల నిరసనల్ని సాకుగా చూపి పార్లమెంటు ఉభయసభలను వాయిదా వేయడం సముచితం కాదని అన్నారు. ఏప్రిల్ 5వరకూ కొనసాగాల్సిన పార్లమెంటు సమావేశాల్ని ముందస్తుగా వాయిదా వేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. ఈ విధానాల్ని తిప్పికొట్టాలని మధు పిలుపునిచ్చారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈ ఉద్యమంలోకి టీడీపీ నేతలు సైతం అనివార్యంగా రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. హోదా ఉద్యమాన్ని చీల్చివేసే దిశగా కొందరు నేతలు వ్యవహరిస్తున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారందరిని రాష్ట్ర ద్రోహులుగా ప్రకటిస్తామని స్పష్టం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు ఫణి మాట్లాడుతూ, ప్రత్యేక హోదా కోసం రాష్ట్ర ఎంపీలు ఆందోళన చేస్తున్న సమయంలోనే టీఆర్‌ఎస్ ఎంపీలూ నిరసనకు దిగడం బాధాకరమని అన్నారు. టీఆర్‌ఎస్ ఎంపీల చుట్టూ రాష్ట్ర ఎంపీలంతా వలయంగా ఏర్పడి.. పార్లమెంటులో అవిశ్వాసం తీర్మానం చర్చకు వచ్చేలా చూడాలని కోరారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే వెంటనే అవిశ్వాస తీర్మానాన్ని ఆమోదించాలని డిమాండు చేశారు.

ఏపీ నంబరు వన్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటుకు ఏపీ చాలా అనుకూలమన్నారు. కృష్ణపట్నం పోర్ట్, చెన్నై ఎయిర్‌పోర్టు, శ్రీసిటీ హీరో మోటార్స్‌కు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలోపు హీరో మోటార్స్ మొదటి దశ వాహనాల ఉత్పత్తి తయారు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల శాఖ, కలెక్టర్ నుండి సంపూర్ణ సహకారం అందిస్తామని పవన్ ముంజల్‌కు హామీ ఇచ్చారు. హీరో మోటార్స్ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రికల్ బైక్స్‌ను తయారు చేయాలని కోరారు. రాష్ట్రంలో 3 సార్లు ఇన్వెస్టర్స్ మీట్ నిర్వహించి రూ.18.55 లక్షల కోట్ల విలువ చేసే ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు సీఎం వివరించారు. ఇవన్నీ వస్తే దాదాపు 40 లక్షల మందికి ఉద్యోగాలు రావచ్చని చెప్పారు. రానున్న రోజుల్లో కృష్ణపట్నం నుండి కియా మోటార్స్ వరకు చిత్తూరు మీదుగా 4 లేన్ల జాతీయ రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమలకు నీరు, విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కార్యక్రమంలో ముఖ్యమంత్రి కూడా పవన్ ముంజల్‌ను సన్మానించారు. అనంతరం సీఎం రేణిగుంట ఎయిర్ పోర్ట్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాళెం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు మహేష్ బాబు, పార్టీ నాయకులు కరుణాకర్ నాయుడు, నిర్మల్, నవాబ్ వేణు, దసరదన్, అయ్యప్ప రెడ్డి, సత్యవేడు నాయకులు ఎంపీపీ మస్తాన్, సుందర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల హక్కులు కాపాడాలి

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా నిజాయితీపరులైన ప్రభుత్వోద్యోగులు తమ విధులను నిర్వర్తించకుండా చేసే ప్రయత్నాల నుంచి రక్షించేందుకు ఈ చట్టం క్రింద తక్షణం అరెస్టు చేసే నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ ఖార్గే పార్లమెంట్ వెలుపల న్యూస్‌ఛానల్‌తో మాట్లాడుతూ, సుప్రీంకోర్టు మంగళవారం తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ తీర్పును కనుక సమీక్షించకపోతే, అది అత్యంత దురదృష్టకరం. ఎస్సీ/ఎస్టీలు ఇతర అట్టడుగు తరగతులలో అభద్రతాభావం నెలకొంటోంది. దేశ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయంపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందని మేము అభిప్రాయపడుతున్నాం" అని చెప్పారు. "ఈ అంశంలో ప్రభుత్వం ఎందుకు నిశబ్దంగా ఉంది. ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలి. అటార్నీ జనరల్ ద్వారా సుప్రీంకోర్టు ముందు తన వాదనను వినిపించాలి. ప్రభుత్వం కనుక నోరుమెదపకుండావుంటే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సమర్థిస్తోందని అనుకోవాల్సి ఉంటుంది" అని అన్నారు. అంతకుముందు ఎంపీలు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్దకు చేరుకుని ఈ అంశాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్లమెంట్ లోపల పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపైన కూడా సమావేశంలో రాహుల్ చర్చించారని వర్గాలు తెలిపాయి.

బీజేపీ ఓ అబద్ధాల ఫ్యాక్టరీ

బీజేపీ ఒక అబద్ధాల ఫ్యాక్టరీ అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాహుల్ గాంధీ విమర్శించారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో ఇప్పుడది తీరికలేకుండా ఉన్నదని అన్నారు. ఫేస్‌బుక్ నుంచి డేటా దొంగిలించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వివాదాస్పద సంస్థతో కలిసి కాంగ్రెస్ పనిచేస్తోందని బీజేపీ తప్పుడు సమాచారం ప్రచారం చేస్తోందని రాహుల్ పేర్కొన్నారు.

ఆర్‌అండ్‌బీకి అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వ్యయంతో 1,376 కిలోమీటర్ల రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన 4,760 కి.మీ. రహదారుల నిర్మాణానికి ఇంకా 4,600 కోట్లు అవసరం అవుతాయని, అంత మొత్తం తమ శాఖ వద్ద లేదని ఆయన నిర్మొహమాటంగా సభలో వెల్లడించారు. బడ్జెట్ కేటాయింపులపై జరిగే సమావేశంలో అయినా ఆర్థిక శాఖ తమ శాఖకు న్యాయం చేస్తోందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. నిధుల కొరత కారణంగా ప్రాధాన్యత క్రమంలో రహదారుల పనులు చేపడతామన్నారు. ముందుగా బస్సులు తిరిగే రహదారులను 'ఏ' కేటగిరిలో, గ్రామపంచాయితీల నుంచి మండలాలకు వెళ్లే రహదారులను 'బి' కేటగిరి విభజించి పనులు పూర్తి చేస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై జరిగే ప్రమాదాల నేపథ్యంలో కొన్ని బ్లాక్‌స్పాట్‌లను గుర్తించామని, ప్రత్యేక నిధుల ద్వారా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా రాష్ట్రంలో 4 వేల వంతెనలున్నాయని, వీటిలో 349 వంతెనలను వెంటనే నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. వీటిలో మరీ ముఖ్యంగా 50 వంతెనలు రోజుల్లోనే కూలిపోయే విధంగా ఉన్నందున యుద్ధప్రాతిపదికన వీటి పునర్నిర్మాణం, మరమ్మతులను చేపడతామని మంత్రి తెలిపారు. కాగా ఆత్మకూరు-శ్రీశైలం రోడ్డు విస్తరణపై కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. ఈ రహదారిలో 66 కి.మీ. మార్గం జాతీయ రహదారి 340సిలోనూ, 55 కి.మీ మార్గం జాతీయ రహదారి 765లో ఉందన్నారు.

ముఖ్యంగా ఆత్మకూరు-దోర్నాల మార్గం ఒకే లేనుతో ఉన్నందున దానిని ఇరువైపులా కాలిబాటతో రెండు లేన్ల రహదారిగా విస్తరించేందుకు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన భూసేకరణ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. అటవీ శాఖ, పులుల సంరక్షణ జోన్‌లో ఈ మార్గం ఉన్నందున ఆయా శాఖల అనుమతుల కోసం ఇప్పటికే దరఖాస్తులు చేసినట్లు కూడా ఆయన సభకు వివరించారు. అలాగే వేరొక ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. పశ్చిమగోదావరి జిల్లా తేతలి, ఉండ్రాజవరంలో ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణాన్ని ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో మొత్తం 71 ఫ్లైఓవర్ బ్రిడ్జిలలో ఒకటి పూర్తయిందని, మిగిలిన వాటి పనులు వివిధ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు.

26న పదో తరగతి పరీక్ష యథాతథం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా పాఠశాలలకు సెలవును ప్రకటించింది. ఇదే రోజు కొనసాగాల్సిన సోషల్ స్టడీస్ పేపర్-1 పరీక్షను యథాతథంగా నిర్వహిస్తామని మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకూ నిర్వహిస్తున్నారు. ఈ నెల 29వ తేదీతో పరీక్షలు పూర్తవుతాయి.

రైతుకు కనీస మద్దతు ధరకు త్వరలో విధానం

ఫిక్కి సమావేశంలో రాధామోహన్ సింగ్

న్యూఢిల్లీ : రైతులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి సంబంధించి త్వరలో ఒక విధానాన్ని ప్రభుత్వం తీసుకురానున్నది. ఈ విధానం క్రింద రైతు ఉత్పత్తి వ్యయానికి 1.5 రెట్లు ఎక్కువ కనీస మద్దతు ధర పొందుతాడని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్ సింగ్ తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ ఫిక్కి సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలతో చర్చించిన తరువాత నీతి ఆయోగ్ ముసాయిదా విధానాన్ని తీసుకువస్తుందని, చర్చల అనంతరం దానికి ఆమోదం తెలుపుతామని మంత్రి చెప్పారు. కనీస మద్దతు ధర పంట ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కన్నా ఎక్కువగా ఉండేవిధంగా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్ నుంచే ఈ సవరణ జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఇప్పటికే కొన్ని పంటల కనీస మద్దతు ధర ఉత్పత్తి వ్యయం కన్నా 50 శాతం అధికంగా ఉందని ఆయన తెలిపారు. 2018-19 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఉత్పత్తి వ్యయం కన్నా 1.5 రెట్లు ఎక్కువగా ఉండేవిధంగా కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని ప్రకటించింది. 22 వ్యవసాయ పంటలకు ప్రభుత్వం ఎంఎస్‌పీని నిర్ణయిస్తుంది. ధరలు ఎంఎస్‌పీ కన్నా పడిపోయినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందని సింగ్ రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఖజానాకు భారమైనప్పటికీ వారి ప్రయోజనాలు కాపాడుతామని చెప్పారు.

జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ (సమాచార,పౌర సంబంధాలు) ఎక్స్ అఫీషియో కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్ శుక్రవారం జీవో జారీ చేశారు. ఏపీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ, ఏపీ జర్నలిస్ట్స్ ఫోరం, ఏపీ మీడియా ఫెడరేషన్లలో ఒక్కో యూనియన్ నుంచి ఒకరు చొప్పున ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు : ఈవో

విశాలాంధ్ర-తిరుపతి : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. ఒంటిమిట్టలో నూతనంగా నిర్మించిన యాత్రికుల వసతి సముదాయంలో శుక్రవారం సాయంత్రం కడప జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో ఈవో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ శ్రీకోదండరామస్వామి ఆలయంలో మార్చి 24 నుండి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తికావచ్చాయని తెలిపారు. మార్చి 30న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించినట్టు వెల్లడించారు. భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు టీటీడీ అధికారులకు విధులు కేటాయించినట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఉదయం, సాయంత్రం అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా అన్నప్రసాద వితరణ కౌంటర్లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నామని ఈవో వివరించారు. అన్నప్రసాద వితరణ కౌంటర్లు 100 నుండి 200లకు, తాత్కాలిక మరుగుదొడ్లను 100 నుండి 230కి, తాగునీటి ప్యాకెట్లు 4 లక్షల నుండి 6 లక్షలకు పెంచామని వెల్లడించారు. అలాగే 3 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని, కల్యాణ వేదికకు నాలుగువైపులా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు 2 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. 1200 మంది శ్రీవారి సేవకులు, 800 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ భక్తులకు సేవలందిస్తారని తెలిపారు. కల్యాణాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయడంతోపాటు భక్తులందరూ వీక్షించేందుకు వీలుగా 15 హెచ్‌డి డిస్‌ప్లే స్క్రీన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అంతకుముందు సమావేశంలో ఈవో మాట్లాడుతూ ఆలయం, పరిసర ప్రాంతాలు, కల్యాణవేదిక వద్ద శోభాయమానంగా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు 350 మంది పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

హోదా కోసం ఐక్య ఉద్యమం

పరీక్షల తరువాత ఉధృతం : ముప్పాళ్ల

విశాలాంధ్ర - డోన్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు నొక్కిచెప్పారు. అందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంకావాలని అన్నారు. విద్యార్థుల పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ఉద్యమాలు తగ్గించామని, పరీక్షల అనంతరం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. కర్నూలు జిల్లా డోన్‌లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ముప్పాళ్ల విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని నాడు రాజ్యసభలో తీర్మానించారన్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ నాయకులు వెంకయ్య నాయుడు, అరుణ్‌జైట్లీ ప్రత్యేక హోదా 15 ఏళ్లు కావాలని పట్టుపట్టారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, నరేంద్ర మోడీ తిరుపతి బహిరంగ సభలో మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఏపీకి 15 సంవత్సరాలపాటు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రగల్భాలు పలికారన్నారు. అధికారం చేపట్టి నాలుగు సంవత్సరాలు గడచిన తరువాత హోదా ఇవ్వలేమని పాలకులు చెప్పడం విడ్డూరమని ముప్పాళ్ల అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, డోన్ నియోజకవర్గ కార్యదర్శి రంగనాయుడు, పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుంకయ్య, ఏపీజీఎస్ జిల్లా కార్యదర్శి మోటా రాముడు, సీపీఐ సీనియర్ నాయకులు పెద్దయ్య, నక్కి బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల

నేటి నుంచి 'టెట్' అభ్యంతరాల స్వీకరణ

విత్‌హెల్డ్‌లో 95మంది అభ్యర్థుల ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) ప్రక్రియ పూర్తయినప్పటికీ అభ్యర్థుల్లో సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితాలపై అభ్యంతరాలు తెలుపుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం అధికారులకు దరఖాస్తు చేస్తున్నారు. ఫైనల్ కీలో మార్కులు ఒకరకంగాను, ఫలితాల్లో హెచ్చుతగ్గులుగా రావడంపై అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. దీంతోఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 31వరకూ అభ్యంతరాలను సీఎస్ఈ.ఏపీ.గౌవ్.ఇన్' వెబ్‌సైట్‌కు పంపుకోవాలని టెట్ కన్వీనర్ ఎ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కోరుకున్న అభ్యర్థులకు రెస్పాన్స్ షీటు అందజేస్తామని, దాని కోసం రూ.200 ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని పేర్కొన్నారు. ఏపీ టెట్ ఫలితాల్లో 95 మంది అభ్యర్థుల ఫలితాలను విత్‌హెల్డ్‌లో ఉంచారు. దీంతో వారి ఫలితాలపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్లో టెట్ పరీక్షలు నిర్వహించడంపై చాలామంది నష్టపోయారనే వాదనలున్నాయి. మొదట్నుంచి టెట్ పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించొద్దంటూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెలాఖరు వరకూ టెట్ ఫలితాలపై అభ్యంతరాల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈలోగా డీఎస్సీ ప్రకటన వెలువడుతుందా? లేదా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులంతా డీఎస్సీ కోచింగ్‌లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి డీఎస్సీని విడుదల చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

అన్‌ఎయిడెడ్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి డిమాండు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో ఎయిడెడ్ డిగ్రీ, జూనియర్ కళాశాలలో పని చేస్తున్న అన్‌ఎయిడెడ్ అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీనే అమలు చేయమని కోరుతున్నట్లు చెప్పారు. శాంతియువతంగా ఉద్యమిస్తున్న అధ్యాపకులను అరెస్టు చేయటం దుర్మార్గమని, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రాభివృద్ధికి, రాజధాని నిర్మాణం కోసం కష్టపడుతున్న ముఖ్యమంత్రికి 600 మంది అధ్యాపకుల సమస్యను తీర్చటం పెద్ద కష్టం కాదని నరసింహారెడ్డి అన్నారు. మరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రాము.సూర్యారరావు మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలలో పని చేస్తున్న అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. వారు కాంట్రాక్టు పద్ధతి, అవుట్ సోర్సింగ్ విధానం కాకుండా పార్ట్ టైమ్‌గా విధులు నిర్వహిస్తూ శ్రమదోపిడీకి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 35ను రద్దు చేసి అన్‌ఎయిడెడ్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరారు. అన్‌ఎయిడెడ్ అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం కోశాధికారి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి అనుకూలంగా నిబంధనలకు లోబడి పనిచేస్తున్న తమకు ముఖ్యమంత్రి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఉపాధ్యక్షులు డి.అంబేద్కర్, కె.పరమేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విభజన జరిగిన చోటే హక్కుల సాధన : రఘువీరారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : రాష్ట్ర విభజన జరిగిన చోటనే హక్కులను సాధించుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుందని కావున రాజకీయపక్షాలు దీనికి మద్దతు ఇవ్వాలని ఏపి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రఘువీరారెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 27వ తేదిన అవిశ్వాస తీర్మాణంకు కాంగ్రెస్ పార్టీ నోటిసు ఇచ్చిందని కావున అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో పార్లమెంట్‌లో కాంగ్రెస్ పక్షనేత మాల్లిఖార్జున్‌ఖార్గే విప్‌ను కూడా జారీ చేయడం జరిగిందన్నారు. అదే సమయంలో ఇప్పటికే ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున మిత్రపక్షాలతో పాటు ఇతర పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. అవిశ్వాసంకు మద్దతు ఇవాల్సిందిగా ఆయన ఆయా పార్టీల నేతలను కోరుతున్నారని ఆయన వివరించారు. ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధీ చొరవతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని మోడి కన్నుసనల్లో పార్లమెంట్ నడుస్తుందన్నారు. కేవలం నాలుగురు పార్లమెంట్‌ను అడ్డుకుంటే మొత్తం పార్లమెంట్‌ను వాయిదా వేస్తూ కేంద్ర ప్రభుత్వం తమపై పెట్టిన అవిశ్వాస తీర్మాణంను తప్పించుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితిలు నెలకుంటే అడ్డుకునే వారిని సస్పెండ్ చేసి పార్లమెంట్‌ను సజావుగా నడిపిన పరిస్థితులు వున్నాయని కాని నేడు ప్రభుత్వం అందుకు బిన్నంగా పార్లమెంట్‌ను నడిపిస్తుందన్నారు. గత 2014 ఎన్నికలు జరిగిన వెంటనే తాము సోనియాగాంధీని కలిసి విభజన హామీలపై చర్చిస్తే అమె మరుసటి రోజునే ప్రస్తుత ప్రధాని మోడికి లేఖ వ్రాస్తూ విభజన చట్టంలో వున్న హామీలను అమలు చేస్తూ ఏపికి ప్రత్యేక హొదా కల్పించాలని కోరడం జరిగిందన్నారు. అలాగే ఇటీవల జరిగిన 84వ పార్టీ ప్లీనరీలోకూడా దీని పై చర్చించామని 2019లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మొదటి సంతకం ఏపికి ప్రత్యేకహొదా కల్పించే ఫైల్‌పైనే పెట్టడం జరుగుతుందని ఇప్పటికే రాహుల్‌గాంధీ స్పష్టం చేశారన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రయోజనాల కోసం టీడిపి, వైసిపి వంటి పార్టీలు కూడా ఒక్కతాటిపైకి వచ్చి పోరాటాలు చేస్తునందుకు సంతోషమని ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. పార్టీలకు అతీతంగా అందరు కలిసి పోరాటాలు చేస్తే అధికార బిజెపి మెడలు వంచ్చువచ్చన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రజల హక్కులను పరిరక్షించేందుకు ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైన వుందన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు మాజి మంత్రి శైలజానాథ్, పార్టీ నాయకులు గౌతమ్, సూర్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విద్యాసంస్థల నిధులపై

టీడీపీ వర్సెస్ బీజేపీ

- మోడీ జేబు నుంచి ఇస్తున్నారా?
- ఇలాగైతే వందేళ్లైనా నిర్మాణాలు పూర్తికావు : టీడీపీ
- విద్యాసంస్థల భూములేమైనా చంద్రబాబువా...! : బీజేపీ
- రాజీనామా చేసి పోటీ చేయండి : విష్ణుకుమార్‌రాజు
- ఎన్నికల్లేనందునే వివక్ష : శ్రావణ్‌కుమార్



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్ర పునర్విభజన చట్టంలోని కేంద్ర విద్యాసంస్థల స్థితిపై అసెంబ్లీలో శుక్రవారం జరిగిన లఘు చర్చ టీడీపీ, బీజేపీ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దారి తీసింది. చట్ట సభలో ప్రధాని సాక్షిగా ఇచ్చిన హామీలను అమలు చేయటంలో రాష్ట్రంపై కేంద్రం వివక్ష చూపుతోందని అధికార టీడీపీ సభ్యులు మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ తన జేబులో నుంచి తీసి ఇచ్చినట్లుగా భావిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. ఇలాగైతే వందేళ్లైనా భవన నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితిలేదన్నారు.

కేంద్ర విద్యాసంస్థలకు నిధుల కేటాయింపుపై టీడీపీ, బీజేపీ సభ్యుల మధ్య జరిగిన వాగ్వివాదం రాజీనామాలు చేసి ఎన్నికలలో పోటీ చేయాలనేస్థాయికి వెళ్లింది. ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర విద్యాసంస్థలు, వాటికి కేంద్రం కేటాయించిన నిధులు, విడుదలను వివరించారు. దీనిపై రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రానికి మంజూరు చేసిన సంస్థలను పదేళ్లలో పూర్తి చేయాలని చట్టంలో పొందుపరిచినప్పటికీ, నాలుగేళ్లలో ఎంతో చేశామని పేర్కొన్నారు. అసలు విద్యాసంస్థలకు స్థలమే కేటాయించకపోతే ఎలా అని ప్రశ్నించారు. చాలా విద్యాసంస్థలలో తరగతులు ప్రారంభమయ్యాయని, కనీసం ఈ విషయాలు కూడా తెలియకపోవటం శోచనీయమన్నారు. తాడికొండ ఎమ్మెల్యే టీ శ్రావణ్‌కుమార్.. 'అంచనాలు కొండంత, ఇచ్చింది గోరంత' అని వ్యాఖ్యానించారు. నిధులేమైనా మోడీ జేబులో నుంచి ఇస్తున్నారా అని అనటంతో బీజేపీ శాసనసభా పక్ష నేత పి.విష్ణుకుమార్ తీవ్రంగా స్పందించారు. విద్యాసంస్థలకు సీఎం చంద్రబాబు సొంత భూములేమైనా ఇస్తున్నారా అంటూ కౌంటర్ వేశారు. దీంతో ఒక్కసారిగా సభలో టీడీపీ, బీజేపీ మధ్య వాదనలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో ఇప్పట్లో ఎన్నికలు లేకపోవటం వల్లే నిధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని శ్రావణ్‌కుమార్ అనగా, ఎపుడు ఎన్నికలు నిర్వహించినా పోటీ చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ సభ్యులు రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ విసిరారు. పది నిమిషాలపాటు టీడీపీ సభ్యులతో విష్ణుకుమార్ రాజు వాదించారు.

రెండు శాతంలోపే నిధులు : పల్లె

విభజన చట్టంలో పేర్కొన్న కేంద్ర విద్యాసంస్థలకు రెండు శాతం నిధులు కూడా రాలేదని పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. లఘు చర్చలో ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యాంసంస్థలకు రూ.9,130 కోట్లు రావాల్సి ఉండగా, నాలుగేళ్లలో 240 కోట్లు కేటాయించిన కేంద్రం రూ.119.34 కోట్లనే విడుదల చేసిందన్నారు. ఈశాన్య రాష్ట్రాలకు రాయితీలు ఇస్తూ, ఏపీకి బీజేపీ అన్యాయం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి న్యాయం చేయమని కోరుతుంటే, హేళనగా మాట్లాడటం శోచనీయమన్నారు. జనసేన, వైసీపీతో కలిసి బీజేపీ మహాకుట్రకు పాల్పడుతోందని విమర్శించారు. టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, ఎం సుగుణమ్మ మాట్లాడుతూ ఢిల్లీ ప్రయోజనాలకన్నా, రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమన్నారు. ప్రభుత్వ విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ కర్నూలుకు కేటాయించిన ట్రిపుల్ ఐటీ తరగతులను తమిళనాడులోని కాంచీపురంలో నిర్వహించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికి చెందిన 160 మంది విద్యార్థులు తమిళనాడులో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అసెంబ్లీలో రోజూ అవు కథే నడుస్తోందన్నారు. ఒకవైపు ఎయిమ్స్‌తోపాటు మరికొన్ని విద్యాసంస్థల భవనాలు శరవేగంగా జరుగుతుంటే, ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు.

రాష్ట్రం కోసం పార్టీలు పక్కనపెట్టాలి : మంత్రి గంటా

రాష్ట్రం కోసం పార్టీలను పక్కనపెట్టి ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. చట్ట ప్రకారం విద్యాసంస్థలను మంజూరు చేసిన కేంద్రం... అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని నియమించటం లేదన్నారు. మంచి ఫ్యాకల్టీ లేకపోవటంతో ఐఐఎంలలో మంచి విద్యార్థులు చేరని పరిస్థితి నెలకొన్నట్లు చెప్పారు. మొత్తం 17 కేంద్ర విద్యాసంస్థలకు రూ.3,507 కోట్లు అవసరం ఉందన్నారు. ఆయా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.610 కోట్ల విలువైన భూములను కేటాయించగా, ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.130 కోట్లు కేటాయించిందన్నారు.



సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు

విశాలాంధ్ర-కడప సెవెన్ రోడ్స్ : సీపీఐ 26వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేసు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆలంఖాన్ పల్లెలో గడప గడపకు వెళ్లి రాష్ట్ర మహాసభల గురించి వివరించి చేయూతనందించాలని ప్రజలను కోరారు. మొట్టమొదటిసారిగా కడపలో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని, మారుతున్న రాజకీయ సమీకరణలో మార్పులు, చేర్పులపై సుదీర్ఘంగా చర్చలు జరిపి భవిష్యత్ కార్యాచరణ చేపడతామన్నారు. సీపీఐ ప్రజాప్రతినిధులుగా గతంలో జిల్లా సమగ్రాభివృద్ధికి ఎద్దుల ఈశ్వర్ రెడ్డి పార్లమెంటు సభ్యుడిగా రేడియోస్టేషన్ సాధించడంలోనూ, జె.వెంకట రామిరెడ్డి, ఎన్.శివరామిరెడ్డి నేతృత్వంలో గండికోట ప్రాజెక్టు సాధించడం జరిగిందన్నారు. సిమెంటు కర్మాగారాలలో ఆర్‌టీసీ సంస్థలో యూనియన్లు స్థాపించి వారికి అండగా నిలబడినట్లు గుర్తు చేశారు. పేదల ఇళ్ల కోసం శోత్రీయ భూములు కాపాడటంలోనూ కీలక ఉద్యమాలు నిర్మించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, తాలూక జోన్ కార్యదర్శి కేసీ బాదుల్లా, ఆలంఖాన్ పల్లె కార్యదర్శి చెంచయ్య, నరసింహులు, నాగరాజు, మునెయ్య, భరత్, వలరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

- ఒక్క శాతం ధనికుల వద్ద 73 శాతం సంపద
- ఫ్యామిలీకి రూ.10 వేలు ఆదాయం
- యువతకు నైపుణ్య శిక్షణ
- సమ్మిళిత వృద్ధిపై చర్చలో ఆర్థికమంత్రి యనమల



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : పేదరికం నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. అందులో భాగంగానే ఆర్థిక వృద్ధి రేటుతోపాటు సమ్మిళిత వృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి కనీసం రూ.10 వేలు ఆదాయం వచ్చినపుడే..సామాన్యుడికి సైతం ఎంతో కొంత పెట్టుబడి పెట్టే స్తోమత వస్తుందని తెలిపారు. తాజా సర్వే ప్రకారం 73 శాతం సంపద ఒక్క శాతంగా ఉన్న ధనికుల చేతిలో ఉండటం శోచనీయమన్నారు. అసెంబ్లీలో సమ్మిళిత వృద్ధిపై చర్చకు స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు శుక్రవారం అనుమతించారు. దీనిపై ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, ఎం సుగుణమ్మ, తంగిరాల సౌమ్య తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి రామకృష్ణుడు మాట్లాడుతూ పేదరికం పెరుగుతున్నప్పటికీ, వృద్ధి రేటు తక్కువగా ఉన్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో పేదరికం ఏస్థాయిలో ఉందో తెలుసుకునేందుకే ప్రభుత్వం ఇంక్లూజివ్ గ్రోత్‌ను (సమ్మిళిత వృద్ధి) పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల రాష్ట్ర వృద్ధి రేటు 11.22 శాతంగా నమోదైందని, అదే సమయంలో జాతీయ వృద్ధి రేటు 6.6 శాతంగానే ఉందన్నారు.

ప్రాథమిక రంగంలో 25 శాతం వృద్ధి

ప్రాథమిక రంగంలో ఇప్పటికే 25 శాతం వృద్ధి సాధించామని, ప్రథమస్థానం కోసం మధ్యప్రదేశ్‌తో పోటీ పడుతున్నటు యనమల తెలిపారు. పారిశ్రామిక, సేవా రంగాల్లోనూ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండటంతో ఇది సాధ్యపడిందని తెలిపారు. నిరుద్యోగం పెరగుతున్న ఫలితంగానే పేదరికం పెరుగుతున్నట్లు తెలిపారు. 2011-12లో ప్రణాళిక సంఘం నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో 9.2 శాతం పేదరికం ఉందని తెలిపారు. విభజన తర్వాత పేదరికంపై ఎలాంటి సర్వే నిర్వహించలేదని, ఇపుడు నీతి ఆయోగ్ సర్వే చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదాయ వనరులు లేకపోవటంతో ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉంటుందని, దీని వల్ల వారంతా ప్రభుత్వంపైనే ఆధారడాల్సి వస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఐటీ, ఉత్పత్తి రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో సంక్షేమానికి రూ.67 వేల కోట్లు కేటాయించగా, యువజన సంక్షేమానికి రూ.వెయ్యి కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

పట్టణీకరణకు ప్రాధాన్యం

పట్టణీకరణ ఎక్కడ ఎక్కువగా ఉంటే అక్కడ అభివృద్ధి, వృద్ధి ఎక్కువగా ఉంటుందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 29 శాతం మందే పట్టణాలలో ఉంటుండగా, మిగిలిన వారంతా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు నగరాలలో పట్టణీకరణ 50 శాతంగా ఉందన్నారు. పట్టణీకరణ వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

టీడీపీ వినూత్న నిరసన

ప్రత్యేక హోదా కోసం ప్రాణాలను పణంగా పెడతాం


గుంటూరులో క్రేన్‌కు వేలాడుతూ నిరసన తెలిపిన శాప్ మాజీ చైర్మన్ మోహన్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ గుంటూరు నగరం లక్ష్మీపురం సెంటర్‌లోని మదర్ థెరిసా విగ్రహం ముందు శుక్రవారం టీడీపీ నాయకులు వినూత్న నిరసన తెలిపారు. ఈ మేరకు శాప్ మాజీ చైర్మన్ బీఆర్ మోహన్ క్రేన్‌కు వేలాడుతూ వినూత్న నిరసన శుక్రవారం చేపట్టారు. ఈ నిరసనలో భాగంగా తొలుత టీడీపీ నాయకులు మోడీ కేడీ నశించాలి, కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడిచి దిగిరావాలి, విభజన హామీలను అమలు చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు, శాప్ మాజీ చైర్మన్ బి.ఆర్ మోహన్ మాట్లాడుతూ నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కష్టపడుతుంటే బీజేపీ తెలుగువారి ఆత్మ గౌరవం దెబ్బతినేలా రాష్ట్ర ప్రజలను మోసగించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా కోసం తమ ప్రాణాలను పణంగా పెడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రచార కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు, నాయకులు లాల్‌వజీర్, మండవ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో కొంత భాగమే 'స్మార్ట్ సిటీ'

- విశాఖ, కాకినాడ, తిరుపతి పనుల అప్పగింత
- డీపీఆర్ తయారీలో రాజధాని అమరావతి
- ప్రశ్నోత్తరాల్లో మంత్రి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కేంద్రం ఎంపిక చేసిన స్మార్ట్ సిటీల్లో విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి పనులు ఆయా సంస్థలకు అప్పగించినట్లు పట్టణాభివృద్ధి, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన జరుగుతోందన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో రాష్ట్రంలో స్మార్ట్ సిటీ పనులపై ఎమ్మెల్యే వి.గణేష్‌కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏ నగరాలనైతే స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేశారో వాటిని పూర్తిగా కాకుండా నిర్దేశించిన ప్రాంతాన్ని మాత్రమే స్మార్ట్ సిటీలుగా నిర్మిస్తామన్నారు. ఈ పథకంలో కేంద్రం నుంచి ఒక్కో నగరానికి రూ. 500 కోట్ల సాయం అందుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని రాష్ట్రమే భరిస్తుందన్నారు. విశాఖపట్నంలో 47 ప్రాజెక్టులకు గాను రూ.1471 కోట్లు, కాకినాడలో 68 ప్రాజెక్టులకు రూ.1940 కోట్లు, తిరుపతిలో 42 ప్రాజెక్టులకు రూ.1610 కోట్లు వ్యయం అవుతుం దని అంచనాలు రూపొందించడం జరిగిందన్నారు. ఐదేళ్ల కాల వ్యవధిలో స్మార్ట్‌సిటీలను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులపై ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు లేవనెత్తిన ప్రశ్నకు సమాధానమిస్తూ టెండర్లను పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. దీంతో ఆయా నిబంధనల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల్లో రహదారులు, కమ్యూనిటీ హాళ్లు వంటి నిర్మాణాలకు గతంలో ఉన్న టీడ్ అండ్ లిఫ్ట్ విధానంలో 3 మీటర్ల నుంచి 50 మీటర్ల వరకూ నిబంధనను 3 మీటర్ల నుంచి 150 మీటర్లుగా మార్పు చేశామన్నారు. మిగిలిన 13 పనులకు రూ. 1.88 కోట్ల అంచనా వ్యయంతో మూడోసారి టెండర్లు పిలిచినట్లు మంత్రి వివరించారు.

నరేగాలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర అమోఘం : మంత్రి లోకేష్

మహాత్మాగాంధి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) అమలులో ఫీల్డ్ అసిస్టెంట్లు అమోఘమైన పాత్రను పోషిస్తున్నారని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి లోకేష్ కితాబునిచ్చారు. వీరు లేకుండా గ్రామాల్లో ఏ పనులు జరగవన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు అంశంపై ఎమ్మెల్యే పి.సునీల్‌కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక రూ.5 వేలుగా ఉన్న వీరి వేతనాలను పని తీరును బట్టి రూ.7,500 నుంచి గరిష్టంగా రూ.10 వేల వరకూ చెల్లిస్తున్నట్లు వివరించారు. వీరి విద్యార్హతలకు అనుగుణంగా కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నీషియన్లుగా పదోన్నతుల కల్పించి వీరి సేవలను వినియోగించుకున్నట్లు మంత్రి తెలిపారు.

సంపాదకీయం

వ్యక్తిగత గోప్యత సంతలో సరకే!

మనిషి దురాలోచన, ధనార్జన కోసం ఎంతకైనా తెగబడే దుర్మార్గం ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన జనిత సామాజిక మాధ్యమాలను విడిచిపెట్టని తీరు దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వ్యక్తుల సమస్త సమాచారాన్నీ కొల్లగొట్టి రాజకీయ పార్టీలకు సంతలో సరకులా తెగనమ్మి సొమ్ము చేసుకున్న నిర్వాకం ప్రపంచాన్ని నివ్వెరపర్చింది. బ్రిటన్ కేంద్రంగా పనిచేస్తున్న కేంబ్రిడ్జి అనలిటికా(సీఏ) సంస్థ.. సామాజిక మాధ్యమంలోని వినియోగ దారుల వివరాలను వాడుకొని, పలు దేశాల్లోని రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యూహాలు రూపొందించిందని తాజాగా వెలువడిన వార్తలు ప్రతి ఒక్కర్నీ విస్మయానికి గురిచేసింది. సీఏకు భారతీయ భాగస్వామిగా ఉన్న ఒవలెనొ బిజినెస్ ఇంటెలిజెన్స్(ఓబీఐ) తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. బీజేపీ, కాంగ్రెస్, జేడీ(యూ)లు తమ క్లయింట్‌లుగా ఉన్నాయని తెలిపింది. సీఏ కుట్రలను గమనించ లేనంత అంధత్వంతో ఫేస్‌బుక్ ఉన్నదని నమ్మలేం. ఫేస్‌బుక్ ఒక యాప్ ద్వారా తన వినియోగదారుల డేటాను వాడుకోవడానికి ఆ సంస్థకు వీలుకల్పించి నప్పుడు, అది ఏం చేస్తున్నదీ గమనించాల్సిన బాధ్యత ఫేస్‌బుక్‌కు ఉంది. సీఏ సాయంతో ఎన్నికల్లో నెగ్గడానికి కుట్రపన్నుతున్నది మీరంటే మీరంటూ బీజేపీ, కాంగ్రెస్‌లు వాదులాడు కోవడం, ఆ సంస్థ సీఈవో పదవిని కోల్పోవడం, ఆ కుట్రకు పరోక్ష కారకుడైన ఫేస్‌బుక్ అధినేత క్షమాపణలు కోరడం చకచకా జరిగిపోయాయి. 'కేంబ్రిడ్జి ఎనలిటికా' ఐదుకోట్లమంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారాన్ని చౌర్యంచేసి దాన్ని అంగడి సరకుగా విక్రయించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్‌ను గెలిపించడం దగ్గర నుంచి యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ బయటపడేందుకూ అది ప్రభావితం చేసింది. భారత్‌లో ఆయా పార్టీలకు అధికారాన్ని దక్కించే బాధ్యతను కూడా చేపట్టింది. ఎన్నికల్లో ప్రచార హామీలను రూపొందిం చేందుకూ, ఓటర్లను మానసికంగా ప్రభావితం గావించేందుకూ ఈ సమాచారాన్ని అడ్డంపెట్టుకోవడం ద్వారా రాజకీయ పార్టీలకు ఈ సంస్థ దోహదం చేస్తుంది. కేంబ్రిడ్జి ఎనలిటికా సంస్థలో పనిచేసి విజిల్ బ్లోయర్‌గా మారిన క్రిస్‌విలీ ఈ వ్యవహారాలను బయటపెట్టి సంచలనం సృష్టించారు. ఈ కంపెనీ అందించే సమాచారాన్ని ఆల్ట్-రైట్ మీడియా వీడియో అధినేత స్టీవ్ బేనన్ వినియోగించి ఓటర్లను మానసికంగా ప్రభావితం చేయడం ద్వారా ట్రంప్ గెలుపునకు దోహద పడ్డారు. ఒకరకమైన మానసిక యుద్ధాన్ని సృష్టించి దానిని ఒక పనిముట్టుగా వాడుకున్నారు. చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలెగ్జాండర్ నిక్స్‌ను కేంబ్రిడ్జి ఎనలిటికా కంపెనీ కొద్దిరోజుల క్రితం సస్పెండ్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ కంపెనీ అనుచిత పద్ధతులలో పలు ప్రాజెక్టులను చేపట్టిందని ఒక స్టింగ్ ఆపరేషన్‌లో నిక్స్ ఇచ్చిన సమాచారం ద్వారా బ్రిటన్ టీవీ బ్రాడ్‌కాస్టర్ ఒక నివేదికను ప్రసారం చేసింది. దీంతో నిక్స్‌పై కంపెనీ ఆ చర్య తీసుకుంది. ప్రత్యర్థులను అప్రతిష్ఠ పాల్జేసేందుకు హనీ ట్రాప్స్‌లాంటి సంస్థలకు ఈ కంపెనీ ఇచ్చిన సమాచారం ఉపయోగపడింది. ఫేస్‌బుక్ వినియోగదారుల వ్యక్తిగత సమాచారాన్ని వారికి తెలియకుండానే సేకరించి తప్పుడు ప్రచారాన్ని నిర్వహించడం, నకిలీ వార్తలను సృష్టించడం, జనం ప్రాధాన్యతను ప్రచారం చేయడంతో ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. తద్వారా ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు కుట్రపన్ను తున్నదని స్పష్టమైంది. 2014లో తాము వ్యక్తిగత సమాచారం యాప్‌ను నిర్వహి స్తున్నట్లుగా ఫేస్‌బుక్ ప్రకటించింది. అంతేకాదు...ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న వారి సమాచారాన్ని, ఫేస్‌బుక్‌లో వారి స్నేహితుల సమాచారాన్ని తొలగించేందుకు కూడా యాప్‌ను డెవలప్ చేసిన సంస్థకు అనుమతించినట్లుగా కూడా ఫేస్‌బుక్ తెలియజేసింది. అయితే ఈ యాప్‌ను డెవలప్ చేసిన అలెగ్జాండర్ కోగన్‌ను తొలగించినదీ లేనిదీ ఫేస్‌బుక్ ధ్రువీకరించుకోలేదు. కోగన్ కేంబ్రిడ్జి యూనివర్సిటీలో అకడమీషియన్‌గా పనిచేస్తున్నారు. కోగన్ ఈ సమాచారాన్ని ఎనలిటికా సంస్థకు విక్రయించినట్లుగా కూడా విజిల్ బ్లోయర్ వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా పెనుసంచలనం కలిగించిన ఈకుట్ర వెల్లడి కావడంతో ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పారు. దీనిపై విచారణ చేసేవారికి సహకరిస్తానని ఆయన తెలిపారు. అయితే ఫేస్‌బుక్ సంస్థకు ఏ సమాచారం తెలియకుండానే ఇంతపెద్ద కుట్ర జరిగి ఉంటుందా...అనే సందేహాలు బలంగాఉన్నాయి.

ఈ వ్యవహారం అనేక సమస్యలను ముందుకు తెచ్చింది. ఆయా కంపెనీలు సమాచారాన్ని సేకరించి దాన్ని మార్కెటింగ్ కంపెనీలకు విక్రయించు కుంటున్నాయి. అయితే ఈ సమాచారాన్ని రాజకీయ పార్టీలు తమకు అనుకూల ఫలితాలను రాబట్టుకు నేందుకు వినియోగించుకోవడమే పెద్ద నేరప్రక్రియగా భావించవచ్చు. ఫేస్‌బుక్ కానీ లేదా ఎనలిటికా సంస్థకానీ సమాచారాన్ని అందించిన కోగన్ వంటి వ్యక్తులుగానీ విధానపరమైన నిబంధనలను తుంగలో తొక్కారు. 2014లో భారతదేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీ అమెరికా ఏజెన్సీకి తమ ప్రచార బాధ్యతను అప్పగించి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లుగా ఆనాడు వార్తలు వచ్చాయి. తాజాగా ఎనలిటికా సంస్థ వ్యక్తిగత సమాచారాన్ని చౌర్యం చేయడం, దానివల్ల ట్రంప్ ప్రయోజనం పొందినట్లుగా సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ ఎన్నికల్లో బీజేపీ కూడా ప్రయోజనం పొందిందా అనే అనుమానం తలెత్తుతోంది. ఫేస్‌బుక్ సమాచారాన్ని వినియోగించుకుని ప్రయోజనం పొందారంటూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై మరొకటి పార్లమెంటులోనే విమర్శలు చేసుకున్నాయి. ఉభయ పక్షాలూ తాము అమాయకులమంటూ ఫోజులు పెడుతున్నాయి. అయితే ఆ సంస్థ మాత్రం ఈ దేశంలోని ప్రధాన పార్టీలకు సేవలందిస్తున్నట్లు చెప్పుకొంటోంది. సోషల్ మీడియా, మొబైల్ మీడియా ఇత్యాది వ్యూహాలతో రాజకీయ ప్రచారాన్ని నెరవేరుస్తానంటూ, పదిరాష్ట్రాల్లో కార్యాల యాలు తెరిచి, నాలుగువందల మంది ఉద్యోగులతో ఈ సంస్థ కార్యకలాపాలు జరుపుతున్నదంటేనే రాజకీయ పార్టీలు ఆ సంస్థను ఎంతగా నమ్ముకొన్నాయో అర్థమవుతోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికలతో సహా ఏయే రాష్ట్రాల ఎన్నికల్లో తాను చక్రం తిప్పిందీ ఈ వ్యాపార సంస్థ బాహాటంగానే చిట్టా విప్పుతున్నది. సామాజిక మాధ్యమాల వల్ల భావ వ్యక్తీకరణ విస్తృతి పెరిగింది. అయితే ఇటువంటి కుట్రల ద్వారా ఆ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ భ్రష్టు పట్టిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు రూపొందించే ఉపకరణాలు, అవి సేకరించే డేటా పౌరులపైనా, వారి ద్వారా మొత్తంగా ప్రజాస్వామ్యంపైనా ఎంతటి ప్రభావం చూపుతున్నాయో స్పష్టమ వుతోంది. కాబట్టి వ్యక్తిగత సమాచారం వెల్లడికాకుండా గోప్యత పాటించేందుకు వీలుగా కట్టుదిట్టమైన చట్టాన్ని రూపొందించవలసిన సమయం ఆసన్నమైంది. ఎనలి టకా సంస్థ చేసిన దుర్మార్గమైన పనికి మరోసంస్థ పాల్పడకుండా నిరోధించవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. మనదేశంలో ఇప్పటికే ఆధార్ సమాచారాన్ని కొల్లగొట్టినట్లుగా పలు సంఘటనలు వెల్లడిస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయగలిగిన తప్పుడు ప్రచార విధానాన్ని నిరోధించాల్సి ఉంది. ఈ దిశలో పాలకులు చర్యలు తీసుకోవాలి. ఈ దేశ చట్టాలను ధిక్కరిస్తూ సమాచారాన్ని చౌర్యం చేసి, దాన్ని దుర్వినియోగం చేసే ఓ సంస్థతో చేతులు కలిపేం దుకు సిద్ధపడిన పార్టీల చేతిలో అధికారం ఉన్నప్పుడు ఆ పని ఈ ప్రభుత్వాలు చేస్తాయని ఎలా అనుకోగలం? ఇటువంటి విషపూరిత వాతావరణంలో, ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఆధార్ డేటాకు మాత్రం భద్రత దక్కుతుందన్న నమ్మకం ఏమిటి? సామాజిక మాధ్యమాల మాయాజాలంలో పడకుండా పౌరులే జాగ్రత్త పడాల్సిన పరిస్థితులు దాపురించాయి.

చురక

ఫేస్ బుక్ గోప్యత
పేలినట్టి ప్రమాదం
రాజకీయ ఎన్నికల్లో
రచ్చకెక్కే వివాదం

సామాజిక మాధ్యమం
సమాచార మూలకం
చక్కగా సాగిస్తే జనం
చైతన్యపు ప్రేరకం

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

మోడీ పాలన నిజస్వరూపం


పి.జనార్ధనరావు

ప్రధానమంత్రి మోడీ అబద్దాలతో ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నాడు. పేదలకు ప్రయోజనాలు అందజేయటం తన ముఖ్య లక్ష్యమన్నాడు. ఎన్నికల్లో వ్యవసాయ దారులకు, యువతకు, స్త్రీలకు, షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు జాతులకు, ఇతర వెనుకబడ్డ కులాలకు పలు ప్రయోజనాలు అందిస్తానని వాగ్దానం చేయటం జరిగింది. గడచిన 42 నెలల పాలనలో ఏ ఒక్క వర్గానికి చేసిన వాగ్దానం నెరవేర్చే ప్రయత్నం చేయలేదు. సరిగదా పలు రకాలైన ఇబ్బందులు కల్పిస్తున్నాడు. పైన ప్రస్తావించిన వారిలో 77 శాతం అసంఘటితరంగంలో పనిచేసేవారు 480 మిలియన్లు. అత్యధికులు పేదలు. ఉపాధికి గానీ ఆదాయానికి గానీ భద్రతలేనివారు, సామాజికంగా రక్షణ కల్పించే చట్టాలు లేనివారు. భారతదేశం అపారంగా సహజవనరులు, మానవ వనరులు కలిగి ఉంది అవినీతి అనే జాడ్యం వల్ల పెద్దదిగానూ, వెనుకబడిందిగానూ కొనసాగుతున్నది. జనాభా 132 కోట్లు అధిగమనించింది. గ్రామీణ జనాభా 68 శాతం, పట్టణ జనాభా 32 శాతం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దేశ ఆర్థిక వ్యవస్థకు ఉత్పాదక కేంద్రం. గ్రామాల్లోనే పేదరికం, మాల్ న్యూట్రిషన్ బాధితులు అధికం. నిరక్షరాస్యులు స్థిరంగా, ఉపాధిలేనివారు గ్రామాల్లో అధికం. గ్రామీణ ఆర్థిక కార్యక్రమాల్లో రుతుపవనాలు వర్షించటం పైన ఆధారపడి ఉంది. భూమిగానీ, ఇతర విధాలుగా ఆస్తులు లేనివారు గ్రామీణుల్లో 54 శాతం వున్నారు. వ్యవసాయం ప్రధానమైన వ్యాపకం. ఒకటి లేక రెండు హెక్టార్ల భూమి కలవారు 82 శాతం వ్యవసాయదారులు. మిగిలిన అందరూ ఇతర వృత్తులవారు, వ్యవసాయ కూలీలు, వ్యవసాయ దారులకు తోడ్పాటు అందిస్తూ గ్రామాల్లో జీవిస్తున్నారు.

నగరాలు, వ్యాపార కేంద్రాలు, పారిశ్రామిక వ్యవస్థలు వున్నాయి.. విద్యా కేంద్రాలు, వైద్యం విస్తృతంగా అందుబాటులో ఉంది. పారిశ్రామిక సంస్థల్లో స్థిరమైన ఆదాయం, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉన్న ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తారు. వ్యాపార సంస్థల్లో తాత్కాలిక వేతనం పొందువారు అసంఘటిత రంగంలో పనిచేసేవారు అధికం. వ్యాపార సంస్థలు పరిసర పల్లెలన్నింటికి వివిధ వస్తువులను సేకరించి అమ్మకం చేస్తారు. రవాణా వ్యవస్థ విస్తరిస్తుంది. నగర ప్రజలు పూర్తిగా తమ నిత్య జీవిత అవసరాలకు పల్లెలపైన ఆధారపడి ఉన్నారు. ఈ మధ్యకాలంలో పల్లె ఆర్థిక వ్యవస్థ ఒడిదుడుకుల్లో పడటంవల్ల మార్జినల్ వ్యవసాయదారులు, ఇతర వృత్తులవారు, వ్యవసాయ కూలీలు ఏదో విధమైన కూలీ ద్వారా ఆదాయం సంపాదించ దానికి నగరాలకు వలసబాట పట్టారు. నగరాల్లో మురికివాడలు పెరిగాయి. వీరికి సౌకర్యాలు అందజేయదానికి పాలక సంస్థల ఇబ్బందులు పెరిగాయి.

స్వాతంత్ర్యానంతరం నాలుగు దాశాబ్దాలపాటు మిశ్రమ ఆర్థిక విధానం అమలు జరిగింది. ప్రభుత్వ రంగంతోపాటు, ప్రైవేటు రంగం దేశాభివృద్ధికి తోడ్పడింది. సాగునీరు, విద్యుదుత్పత్తి, పారిశ్రామిక వ్యవస్థలు, విద్యకు, ఆరోగ్య రక్షణకు సంస్థల ఏర్పాటు, మానవ వనరుల అభివృద్ధికి కృషి జరిగింది. ఉపాధి అవకాశాలు పెరిగాయి. ఆహార అవసరాల్లో స్వయం సమృద్ధి సాధించబడింది. 1990-91లో అకస్మాత్తుగా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడింది. ఎగుమతి, దిగుమతుల చెల్లింపుల లోటును అధిగమించటం, ఐ.యంయఫ్ దగ్గర వారు విధించిన షరతులకు లోబడి అప్పు తీసుకోవటం జరిగింది. అక్టోబరు 90 నుండి జూన్ 91 మధ్య విదేశీ మారక ద్రవ్య నిల్వలు నుండి 1330 మిలియన్ డాలర్లు వెనక్కి తీసుకున్నారు. అందువల్ల దిగుమతులకు చెల్లించుటకు 1.8 బిలియన్ డాలర్లు అప్పు తీసుకున్నారు. అట్లాంటి అవసరాలకు నేటివరకూ తీసుకున్న అప్పు జూన్ 2017 నాటికి 485.80 బిలియన్ డాలర్లు అయ్యింది. వడ్డీ చెల్లింపుల భారం పెరిగింది. ఇదీగాక దేశీయంగా చేసిన అప్పు అనేక లక్షలకోట్లు. విదేశీ ప్రభుత్వాలు గానీ, ఆర్థిక సంస్థలు అందించే తోడ్పాటు తగ్గి, వ్యాపార రీత్యా అప్పు తీసుకోవడం వల్ల విదేశీ అప్పు పెరిగింది. వడ్డీ చెల్లింపుల భారమేగాక, దిగుమతులు- ఇంధనం, బంగారం, ఎలక్ట్రానిక్ గూడ్స్, మెషినరీ పెరుగుట వల్ల వ్యాపార అంతరం పెరిగింది.

1991 తర్వాత పెట్టుబడిదారీ అభివృద్ధి విధానమైన నయా ఉదారవాదం చేపట్టారు. ప్రపంచ బ్యాంకు, ఐ.యం.యఫ్‌ల నిర్దేశంలో ఆర్థిక వ్యవస్థ నకడ ప్రారంభమైంది. వ్యాపారం, పెట్టుబడులు, పోటీ చేయటానికి విదేశీ సంస్థలను షరతులు లేకుండా అనుమతించటం జరిగింది. విదేశీ సంస్థాగత మదుప రులు. స్టాక్‌మార్కెట్‌లోకి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనేక రంగాల్లో ప్రవేశించాయి. మోడీ పాలన ప్రారంభమయ్యాక బ్యాంకుల్లోకి ఇన్సూరెన్స్‌లోకి, రైల్వేలు, రక్షణ రంగంలోకి రిటైలు వ్యాపారంలోకి అనుమతించారు. భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి సాధించటానికి తీసుకున్న ప్రధానమైన చర్య గ్లోబల్ ఫైనాన్స్ కేపిటల్‌కు భారత ఆర్థిక వ్యవస్థను అప్పగించటం. ఫలితంగా భారతదేశ మారుమూల ప్రాంతాల్లోకి విదేశీ బహుళజాతి సంస్థల ఉత్పత్తులు అమ్మకం జరుగుతున్నది. పానీయాలు, బిస్కెట్లు, కాఫీ, టీ పొడులు, నూడిల్స్, ఇతర దేశాల పండ్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లు, గృహ పరికరాలు, కార్లు, టూ, త్రీ వాలర్లు, ట్రాక్టర్లు వగైరాలు. మాన్‌శాంటో కార్గిల్ సంస్థల విత్తనాలు, అత్యాధునిక టెలివిజన్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ఏసీలు వగైరాలు విదేశీ ద్రవ్య పెట్టుబడిదారుల ఉత్పత్తులు. వాటిని కొనుగోలు చేసేవారికి ప్రభుత్వరంగ బ్యాంకులు ఫైనాన్స్ అందిస్తాయి. కానీ వ్యవసాయ దారులకు ఇవ్వవు. అలాగే దేశీయ వ్యాపార సంస్థలకు ఉదారంగా అప్పులు ఇస్తారు. వారు తిరిగి చెల్లించని నాడు అప్పు ను రద్దుచేస్తారు. గ్లోబల్ ద్రవ్యపెట్టుబడి భారతదేశంలోకి రావడం వల్ల భారత ఉత్పాదక రంగం- వ్యవసాయ రంగం, మాన్యు ఫ్యాక్చర్ రంగం, ఎం.ఎస్.ఎం.ఈ రంగం తీవ్రంగా నష్టపోయిం ది. నేటికీ ఆయా రంగాల్లో రివైవల్ (పునరుద్దరణ) జరగలేదు.

గ్లోబల్ ద్రవ్యపెట్టుబడి ఏయే రంగాల్లోకి వచ్చింది. ఎవరు లాభించారు. ఎఫ్‌ఐఐలవి గానీ, ఎఫ్‌డీఐలవి గానీ చట్టవ్యాపారంలోకి వచ్చాయి. అపారంగా లాభాలార్జించి తరలించుకొన్నాయి. ఉత్పాదక రంగాల్లోకి గానీ, పారిశ్రామిక వ్యవస్థల అభివృద్ధి చేయటానికి రాలేదు. ఉపాధులు కల్పిస్తాయని మన పాలకులు ప్రచారం చేశారు. కానీ ఉపాధులు కల్పించలేదు. అసమానతలు పెరుగుట పట్టించుకోలేదు. 2008లో అమెరికాలో ప్రారంభమైన ఆర్థిక మాంద్యం పెట్టుబడిదారీ ప్రపంచమంతా విస్తరించింది. ఆయా దేశాలు మాంద్యం నుండి బయటపడటానికి లక్షలకోట్లు విడుదల చేశాయి. అనుకొన్నమేర నేటికీ బయటపడలేదు కానీ తక్కువ వడ్డీ రేట్లవల్ల సంపన్న వర్గాలు ఆ సొమ్మును సొంతం చేసుకొన్నాయి. అలా గ్లోబల్ ద్రవ్యపెట్టుబడిదారులు ఏర్పడ్డారు. ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలో భాగమవటం వల్ల భారత్‌ను బలంగా మాంద్యం తాకింది. స్టాక్‌మార్కెట్ కుదేలైంది. మదుపరులు లక్షల కోట్లు నష్టపోయారు. స్టాక్, కరెన్సీ, మనీమార్కెట్లు కుప్పకూలాయి. కఠిన నియంత్రణలో బ్యాంకులు ఉండటం వల్ల దేశం స్వల్పకాలంలోనే మాంద్యం నుండి బయటపడింది. 2004-05 నుండి 2009-10 వరకు జీడీపీలో 8.7 శాతం వృద్ధి సాధించటం జరిగింది. కానీ 20 మిలియన్ల ఉపాధులు కోల్పోయారు. ఉపాధులు కల్పించని వృద్ధి అది. ఆ తర్వాత వృద్ధి పడిపోయింది. వృద్ధి సాధించటమే లక్ష్యంగా పెట్టుకొంది. పెట్టుబడులు కావాలి. కానీ ప్రభుత్వంగానీ, ప్రైవేటు రంగం గానీ పెట్టుబడులు పెట్టే స్థితిలేదు. అటువంటి స్థితిలో గ్లోబల్ ద్రవ్య పెట్టుబడిని ఆహ్వానించటం జరిగింది. భారత ఆర్థిక వ్యవస్థ కీలక రంగాలు అన్నింటిల్లోకి ద్రవ్యపెట్టుబడి ప్రవేశించింది. ఆర్థికంగా వృద్ధి సాధించటం జరిగింది. కానీ అట్లా పెరిగిన సంపద ద్రవ్యపెట్టుబడిదారులకు, వారితో సహకరించిన కొద్దిమంది సంపన్నుల వద్దకు చేరింది. అత్యధిక శాతం ప్రజలు భూమిని, సహజవనరులను నమ్ముకొని జీవనం సాగించేవారికి ఎటువంటి ఓదార్పు కలిగించలేదు. అందువల్ల తేలింది ఏమిటంటే ఏ ఆర్థిక వ్యవస్థపై గ్లోబల్ ద్రవ్యపెట్టుబడి అధిక్యత సాధిస్తుందో దానివల్ల లాభం పెట్టుబడిదారులకే లభ్యమవుతుంది. దేశాలకు ప్రయోజనం ఉండదు. ద్రవ్యపెట్టుబడిదారులు లాభాలు తరలించుకొంటారు. దేశంలో ఒక్క శాతం, పెరిగిన సంపదలో 73 శాతం పొందుతారు. నేడు దేశంలో 119 మంది డాలరు బిలియనీర్లు ఉన్నారు. ఎన్నికల్లో గెలవటానికి ఎవరికి మంచి రోజులు కల్పిస్తానని ప్రలోభ పెట్టాడో వారెవరికి మంచిరోజులు కల్పించలేదు. వ్యవసాయదారుల రుణగ్రస్థత పెరిగింది. గిట్టుబాటు ధరలు లేక, ఆత్మహత్యలు ఆగలేదు. యువత ఉపాధులు లేక ఆనాడు 6 కోట్లు నిరుద్యోగులు ఉంటే గడచిన సంవత్సరాల్లో ప్రతి సంవత్సరం మరో కోటి 20 లక్షల మంది చేరారు. ఉపాధి కల్పన ఊసేలేదు. స్త్రీలపై అత్యాచారాలు పెరుగుతున్నాయి. స్విస్ బ్యాంకులో దాచుకొన్న లక్షల కోట్లు తెచ్చి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానన్నది అబద్దంగా నిలిచింది. ఎఫ్‌డీఐ పెట్టుబడులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టే వాగ్దానం గడచిన సంవత్సరాల్లో అనుకొన్నమేర ఎఫ్‌డీలు రాలేదు. గ్రామాలు- నగరాల మధ్య అసమానతలు పెరుగుతుంటే జీడీపీలో వృద్ధి అవసరం గుర్తించినప్పుడు ఉపాధుల సృష్టికి ప్రయత్నించటంలేదు. అత్యధికంగా ఉపాధులు కల్పించే రంగాలు స్తబ్దతలో పడితే చర్యలు తీసుకోవటంలేదు. ప్రధానమంత్రి మోడీ ఇంకొక అంశాన్ని ప్రగల్భంగా చెపుతారు. అది- 'నేను తినను, ఇతరులను తిననివ్వను' ఇదెంత అసత్యమో పరిశీలించండి. 2017లో దేశ సంపదలో 58 శాతం అత్యంత సంపన్నులైన ఒక్క శాతం వద్ద పోగుపడింది. 2018లో సంపదలో 73 శాతం సంపన్నుల వద్దకు చేరింది. సామాన్యులకు మిగిలింది రోటీ, కపడా మకాన్, బిజిలీ, సడక్, పానీ నినాదాలు. పదేపదే పేదల ఉద్ధరణే తన లక్ష్యం అంటాడు. కానీ సంపన్నుల విలాస జీవనానికి, వారి వినియోగానికి పూర్తిగా తోడ్పాటు అందిస్తున్నాడు. గుజరాత్ ముఖ్యమంత్రిగా లేబర్ ఇంటెన్సివ్ రంగాలను ప్రోత్సహించలేదు. 2014-15, 2015-16లో 23806 ఫ్యాక్టరీలు మూతబడి వర్కర్లు 12.57 లక్షలు ఉపాధి కోల్పోయారు.

అంతేకాదు 7 లక్షల మంది విద్యావంతులు ఉపాధి కార్యాలయాల్లో నమోదు చేసుకున్నారు. గడచిన 5 సంవత్సరాల్లో లఘు పరిశ్రమల రంగంలో 11,873 ఫ్యాక్టరీలు మూతబడ్డాయి. 2014-15లో, 2015-16లో 11,923 మూతపడ్డాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు సాధారణ ప్రజల జీవనాన్ని మరింతగా దుర్భరం చేసింది. జీడీపీ పతనమైంది. ఉపాధులు కోల్పోయారు. లక్షలాది సంస్థలు మూతబడ్డాయి.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, విజయవాడ

క్షయ నివారణకు యుద్ధం చేద్దాం..

డా॥ కే. రజని

క్షయ అంటే ఏమిటి? అందరం వినే వుంటాము. ఈ మహమ్మారి జబ్బును ఎదుర్కొనడం సాధ్యమా? మన దేశంలో ఎందుకు నిర్మూలించలేకపోతున్నాము. ఇది ఒక బాక్టీరియా-మైకోబాక్టీరియమ్ ట్యూబర్క్యులోసిస్ అంటారు. ఇది మనుష్యులలో గాలి ద్వారా ఊపిరితిత్తులకు సంక్రమించుతుంది. అలానే ఇతర శరీరభాగాలకు వ్యాపిస్తుంది. రెండవది బోవిన్ టీబీ అని (మైకోబాక్టీరియమ్ బోవిన్) ముఖ్యంగా గేదెలలో వస్తుంది. మనుష్యులకి కూడా సంక్రమించవచ్చు. కాని చాలా అరుదైనది.

ఇది మనిషి నుండి మనిషికి గాలి ద్వారా వ్యాపిస్తుంది. దగ్గిన, తుమ్మిన, పబ్లిక్ ప్రదేశాలలో ఉయ్యడం వలన, క్షయ యాక్టివ్‌గా వున్నవారితో చాలా దగ్గరగా ఉంటూ పక్కనే పడుకోవడం వలన, ఇది ఎక్కువగా వున్న ఎపిడెమిక్ ప్లేసెస్‌లో, జనసాంద్రత ఎక్కువగా వున్న ప్రదేశాలలో గాలి పీల్చినప్పుడు రావచ్చు. యాక్టివ్ క్షయ వున్న వారు ముక్కు, నోరు కప్పుకొని దగ్గాలి లేక తుమ్మాలి. లేకుంటే ఆ బాక్టీరియా బయటికి వచ్చి కొన్ని వారాల దాకా వాతావరణంలో వుండవచ్చు. ప్రపంచంలోనే క్షయ అనేది ఒకే ఒక అంటువ్యాధి. అంటే హెచ్ఐవి/ఎయిడ్స్ కంటే కూడా చనిపోవడానికి ముఖ్య కారణం, అన్ని జబ్బులతో పోల్చితే ఇది 9వ కారణం జబ్బుగా వుంది. 2016లో 1.3 కోట్ల మంది హెచ్ఐవి లేకుండా క్షయ ద్వారా చనిపోయారు. క్షయ + హెచ్ఐవి ద్వారా 37,40,000 మంది చనిపోయారు. మొత్తం 1,67,40,000 మంది చనిపోయారు. అలానే 2,50,000 మంది పిల్లలు చనిపోయారు. క్షయ వలన 40% హెచ్ఐవి రోగులు చనిపోయారు. సేకరించబడిన ఈ లెక్కల్లో బహుశా చాలా కేసులు పేర్కొనబడక పోవచ్చు. క్షయ (టీబీ) ఇన్సిడెన్స్ అంటే ఒక సంవత్సరంలో ఎన్ని యాక్టివ్‌గా వున్న కొత్త కేసులు వచ్చాయి, టిబి ప్రివిలెన్స్ అంటే ఎంత మంది క్షయతో ప్రజలలో జీవించుతున్నారు. ఇది ఎంత శాతం అన్నది రాదు. క్షయ వ్యాధి సంక్రమించిన రోగులందరూ డాక్టర్లను సంప్రదించక పోవటం, వ్యాధి చికిత్స పూర్తి కాకుండా తాత్కాలిక ఉపశమనం కలుగగానే చికిత్సను ఆపు చేసేవారు, తదితరులందరూ ఈ లెక్కల్లో చేర్చబడి ఉండకపోవచ్చును. క్షయ 3 రకాలుగా చెప్పవచ్చు. గుప్త వ్యాధి లక్షణాలు బయటకు స్పష్టంగా కనిపించని క్షయ 3 దశలుగా రావచ్చు, ఇన్‌ఫెక్షన్ కూడా వృద్ధి తీవ్రమైన వ్యాప్తి చెందక ఉండవచ్చును లేదా శ్వాస ద్వారా ఊపిరితిత్తులలో ఉండి కూడా వేరే అవయవాలకి వ్యాపించే అవకాశం కలదు. ప్రోగ్రెవస్ అంటే వ్యాధి తీవ్రత పెరిగి శరీరంలో నుండి వాతావరణంలోకి బయటకి పంపబడతాయి. ఇక్కడ ఊపిరితిత్తులు మాత్రమే కాకుండా, మెదడు (మెనింగిటిస్), ఎముకలు, కీళ్ళు, పేగులు, లివర్, కిడ్నీ అలానే జననేంద్రియాలు అన్నింటికి వ్యాపించి చనిపోయే పరిస్థితి వస్తుంది. దీనిని క్షయ వ్యాప్తిలో ప్రధమ దశగా పేర్కొంటారు. దీనిని ట్యూబర్క్యులిన్ స్కిన్ టెస్ట్ మామూలుగా (మౌన్‌టెక్స్ టెస్ట్) కూడా అంటారు. దీని ద్వారా తెలుసుకోవచ్చు.



వ్యాధి లక్షణాలు : బలహీనత, అలసత్వం, ఆకలి లేకపోవడం, చలిజ్వరం, రాత్రి చెమటలు పట్టడం, జ్వరం, దగ్గు రెండు వారాల మించి ఉన్న, ముదురు రంగు మూత్రం, వాంతి లాగా వుండటం, పసికరులు, శ్లేషంలో రక్తం పడడం ఇవన్నీ వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి. ఎంత త్వరగా టిఎస్‌టి లేక శ్లేషం పరీక్షలు చేస్తే అంత మంచిది. దీనిని త్వరగా గుర్తించి ప్రారంభ దశలోనే చికిత్స మొదలుపెడితే మంచిగా నివారించవచ్చు, నిర్మూలించవచ్చు. ఇక ఇండియాలో క్షయ వ్యాధి తీవ్రత గురించి ఇటీవల ఢిల్లీలో నిర్వహించబడిన క్షయ సదస్సులో ప్రసంగిస్తూ ప్రధాని మోడీ మన ప్రభుత్వం 2025 సంవత్సరం నాటికి క్షయని నిర్మూలించాలి అంటున్నారు. ఇది ప్రస్తుత పరిస్థితులలో సాధ్యమా? కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రివర్యులు చెప్పినట్లు "కృతనిశ్చయంతో క్షయను తరమి కొడదాం అని పేర్కొన్నారు". అలా ప్రభుత్వం ఉన్నదా? మనకి ఒక సంపూర్ణమైన క్షయవ్యాధి నిర్మూలనా విధానం లేదు. అది ఉన్న దేశాలలో ఇంకా పూర్తిగా నివారింపచేయలేకున్నారు. ప్రస్తుతం ఒక లక్షకి 10 కేసులు రిపోర్టు చేయబడుతు న్నాయి. వ్యాధి పూర్తి నిర్మూలనకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) ప్రకారం 10 లక్షల జనాభాలో ఒకే ఒక్క క్షయరోగి ఉంటే దానిని పూర్తిగా నిర్మూలించడం అంటారు. అది 2025 నాటికి సాధ్యమా?

ప్రపంచంలో నాల్గోవవంతు వ్యాధిగ్రస్తులు మన దేశంలో ఉన్నారు. ప్రపంచంలో అతి ఎక్కువ వ్యాధి తీవ్రత టీబీ + ఎండిఆర్ - టీబీ ఉన్న దేశంగా గుర్తిస్తారు. ఇంచుమించుగా 79,000 మంది ఎండీఆర్ - టీబీ (మల్టీ డ్రగ్ రెసిస్టెంట్) ప్రతి సంవత్సరం దక్షిణాఫ్రికా ప్రథమ స్థానంలో ఉండగా భారతదేశం రెండవ స్థానంలో ఉన్నది. 2016వ సంవత్సరం లెక్కల ప్రకారం 28,00,000 కేసులు నమోదయ్యాయి. 4.5 లక్షల మంది క్షయ ద్వారా చనిపోయారు. అలానే నమోదు కాని 10 లక్షలు లెక్కలోకి రాని కేసులు కూడా వున్నాయి. అంటే వ్యాధి గుర్తింపబడక లేదా సరియైన వ్యాధి నిర్ధారణ చేయక సొంత చికిత్స వలన నమోదు కానివి వున్నాయి. ప్రభుత్వ పరంగా ఆర్ఎన్‌టీసీపీ (రివైజ్డ్ నేషనల్ టీబీ కంట్రోల్ ప్రోగ్రామ్) అలానే ప్రైవేట్ సెక్టర్ ద్వారా చాలా మంది చికిత్స తీసుకోవాలి. ఇండియాలో సరైన అవగాహన లేక జబ్బుని దాచాలని స్వతహాగా చికిత్స తీసుకోవడం, క్షయ అంటే ఏమిటో తెలియక అలానే డాట్ కేంద్రాలపై అవగాహన లేక పక్క వారు చెప్పే సలహాలు మేరకు ప్రభుత్వ మందులు మంచివి కావనే దురభిప్రాయంతో ప్రభుత్వ మందులు వాడనివారు ఉన్నారు. మందులు మంచివని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది అనే అవగాహన ప్రజలలో రావాలి. ప్రస్తుతం ఉన్న టీబీ మందులకు వ్యాధి నిరోధక శక్తి పెరగడం, ఎండీఆర్-టీబీ అలానే ఎక్స్‌డీఆర్-టీబీ (ఎక్స్‌టెన్సివ్ డ్రగ్ రెసిస్టెంట్) నిరోధక క్షయ చాలా అరుదు, కాని ఎండీఆర్-టీబీ కంటే కూడా అపాయమైనది, క్షయలాగా వ్యాపిస్తుంది. ఈ బాక్టీరియా కొన్ని గంటల వరకు వాతావరణంలో వుంటుంది. దీనికి టీబీ మందులు పనికిరావు. కొత్తగా మందులు చాలా తక్కువ ఉపయోగపడతాయి. అయినా వాటివలన ఇతర లక్షణాలు ఎక్కువ, అలానే ఖరీదు ఎక్కువ, కాని ఇవి హెచ్ఐవీ ఇన్ఫెక్షన్ వున్నవారికి తప్పక ఇవ్వాలి. అందుకే ప్రభుత్వం 2017-2025 జాతీయ క్షయ నిర్మూలన పథకం పిలుపునిచ్చింది. కానీ, క్షయని గుర్తించటానికి ఖచ్చితమైన నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా? నివారణ వుందా అనేది చాలా ముఖ్యం. బడ్జెట్ ఎంత ఇస్తున్నారు. ప్రస్తుత బడ్జెట్ కంటే 3 రెట్లు అధికంగా అవసరం వుంది. సీబీ నాట్ వ్యాధి గుర్తింపు పరికరాలు అన్నిచోట్ల లభ్యం కావాలి.

చాలామంది రోగులకు మందులు అందుబాటులో లేవు. మందులకి ఖరీదు చాలా ఎక్కువ, తదుపరి చికిత్స లేకపోవడం, రోగికి డాక్టరు సలహా అవసరం. అదేవిధంగా డాక్టర్లకు సైతం అవగాహన పెంపొందించాలి. చాలా జబ్బులతో వున్నవారు ప్రథమంగా మన దేశంలో ప్రాథమిక స్థాయిలో చేయవలసినవి చాలా వున్నవి. ప్రస్తుత పరిస్థితు లలో ఒక యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం ప్రజలు సమన్వ యంతో పనిచేయాలి. మన దేశంలో రక్షిత మంచినీరు పారిశుధ్యం, పరిశుభ్రతపట్ల అవగాహన, పోషక ఆహారం లేనప్పుడు టీబీపై యుద్ధం టీబీ నిర్మూలన సాధ్యమా? ఉమ్మివేసే దగ్గరే పేదవారు పడుకుంటున్నారు. సమగ్ర ఆరోగ్యపథకం రాకుండా ఒకశాతం బడ్జెట్‌తో ఈ యుద్ధాన్ని జయించగలమా? ఇది ఒక సామాజిక సమస్యగా తీసుకోవాలి. మన దేశంలో ప్రథమంగా సమగ్ర ఆరోగ్య పథకం ఉండాలి. విస్తృతంగా ప్రజల్లో చైతన్యం రావాలి. ఆరోగ్యసిబ్బంది వైద్య మంత్రిత్వశాఖ విధాన నిర్దేశకులు అందరూ కలసికట్టుగా టీబీపై యుద్ధం చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి, ఆరోగ్య సిబ్బందికి శిక్షణలో చైతన్యం, నాణ్యత తేవడం, అలానే ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వమే ప్రజలకి అందుబాటులోకి తెచ్చి, సరైన మందులు అందుబాటులో వుంచితేనే ఈ యుద్ధంలో జయించగలం.

(నేడు అంతర్జాతీయ క్షయ దినోత్సవం సందర్భంగా)

ఇ-మెయిల్

అత్యాచార నిరోధక చట్టం పై అవగాహన పెరగాలి

దళిత,ఆదివాసీ లపై అత్యాచారాల్ని నిరోధించడానికి ఉద్దేశించబడిన చట్టం ఎంతో ప్రాముఖ్యత కలది. అణగారిన వర్గాలకు భరోసా నిచ్చేది.ఆ చట్టం దుర్వినియోగం జరుగుతుందన్న అభిప్రాయంతో సుప్రీం కోర్టు ద్విసభ్య బెంచ్ వెలువరించిన తీర్పు చట్టం స్ఫూర్తిని నీరుగార్చేదిగా ఉంది.చట్టం తప్పుడు కేసులో అన్వయించబడుతుందన్న అనుమానం కలిగినపుడు,కేసు నమోదుకి ఉన్నతాధికారుల అంగీకారం పొందాలని, బెయిల్ పొందే అవకాశం నిందితునికి ఉండాలని,ప్రభుత్వ ఉద్యోగి నిందితుడైతే సంబంధిత పై అధికారుల అనుమతి తప్పనిసరి అని కోర్టు ఆదేశించింది.తప్పుడు కేసుల వల్ల ఎవ్వరూ అన్యాయానికి గురికాకూడదన్న ఉద్దేశం ఆహ్వానించదగినదే అయినా,ఈ ప్రత్యేక చట్టాన్ని విస్తృత అర్థంలో చూడాల్సి ఉంటుంది. చట్టం ముఖ్య ఉద్దేశ్యం జరుగుతున్న అన్యాయాల్ని నిలువరిం చడం.న్యాయం జరుగుతుందన్న భరోసా సమాజంలో అన్ని వర్గాల వారికీ కలుగజెయ్యడం. సమా జంలో అన్యాయం తీవ్రత,అవకాశం బట్టే చట్టం కఠినత్వం ఉంటుంది.జాతీయ నేర గణాంకాల నివేదిక మేరకు దళిత, గిరిజ నులపై అత్యాచారాలు రానురాను పెరుగుతున్నాయి తప్ప తగ్గుముఖం పట్టడం లేదు.అవి కూడా అధికారికంగా నమోదైనవి మాత్రమే.దృష్టికి రానివి ఇంకా ఎక్కువే.అత్యాచార నిరోధక చట్టం ద్వారా నమోదైన కేసుల్లో నూటికి రెండు మాత్రమే చివరివరకూ నిలుస్తున్నాయి.అంటే అర్థం అధికశాతం తప్పుడు వని కాదు.చాలా ఇతర విషయాలు కారణం.కేసు నమోదు దగ్గరనుండి, దర్యాప్తు,విచారణ వరకూ బాధితుడి వైపు కన్నా,నిందితుడికి అనుకూలంగానే యంత్రాంగం ఉండే అవకాశాలు ఎక్కువ.చట్టం బలహీనుడి వైపున్నా,చట్టాన్ని అమలుచేసే యంత్రాంగం బలమున్న వాడివైపే ఉంటుంది స్వాభావికంగా.ఇక కేసు నమోదుకే ప్రత్యేక అనుమతులు, కాలయాపనలూ, నిందితులకు బెయిల్లు అంటే సరేసరి. పైగా కేసులు తేలేటప్పటికి ఏళ్లూపూళ్లూ పడుతున్నాయి. చిన్నచిన్న కారణాలతో కేసుల కొట్టివేత కూడా సాధారణమే.డీఎస్పీ స్థాయి అధికారి కేసు నమోదు,దర్యాప్తు చేయడానికి బదులుగా క్రింది స్థాయి అధికారి చేశాడన్న కారణంతో,ప్రత్యేక కోర్టుకి నేరుగా విచారణకి వచ్చిందన్న కారణంతో, సాంకేతిక కారణాలతో కేసు కొట్టివేయబడడం జరుగుతూ వస్తుంది. ఇలాంటి లోటుపాట్లని సమీక్షించి సవరిం చాల్సి ఉంది.పైగా చట్టం అసలు ఉద్దేశమైన నేర నియంత్రణలో వెనుకంజలో ఉన్నట్టే.నష్ట పరిహారం, పునరావాస చర్యల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మేలు. ఆయుధం పదునైనదిగా ఉంటేనే మేలు.వేలు తెగే అవకాశం ఉందని బండబారిస్తే దాని అసలు లక్ష్యం దెబ్బతింటుంది.చట్టమూ అంతే.దుర్వినియోగం కాకుండా ఇతర చర్యలు చేపట్టాలి కానీ అసలు ఉపయోగానికి ఎసరుపెట్టే చర్యలుండరాదు. సుప్రీం ఈ విలువైన చట్టాన్ని అన్ని కోణాల్లో పరిశీలించి తీర్పుని పునస్సమీక్షించుకోవాలి.ప్రభుత్వం,పౌరసమాజం అందుకు మార్గం చూపాలి.

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం.

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
24 మార్చి 2018



ఎంతెంత దూరం !

వేసవి రాకతోనే నీటి కష్టాలూ మొదలవుతాయి. మనదేశంలోని చాలా ప్రాంతాల్లో ఏటా కనిపించే దుస్థితే ఇది. ఈ గురువారం ప్రపంచ జల దినోత్సవంగా పాటించిన రోజునే కనిపించిన దృశ్యమిది. ఎంతెంత దూరం అంటూ ఎన్నో మైళ్ళ దూరం వెళ్ళి నీళ్ళు మోసుకొస్తారు పడతులు. ఇదీ అలాంటి దృశ్యమే. ఉత్తర కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా పఠాన్ ప్రాంతంలో ఈ చిత్రం దర్శనమిచ్చింది.

డీహైడ్రేషన్ బారినపడవద్దు!



వేసవి ముదురుతోంది. ఎండల ధాటి పెరుగుతోంది. ఉష్ణోగ్రతలూ రోజురోజుకీ హెచ్చుతున్నాయి. ఇక ఈ నాలుగు నెలలూ డీహైడ్రేషన్ అనే పదం తరచూ వినిపిస్తుంది. దీని బారిన పడితే ప్రాణాలు పోయే ప్రమాదమూ ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ వేసవి నరకంగానే అనిపిస్తుంది. ఈ నేపథ్యంలో మరి అసలు డీ హైడ్రేషన్ అంటే ఏమిటి? దీని సంకేతాలేమిటో ఒక లుక్కేదామా!

మానవ శరీరం 70 శాతం నీటితోనే నిండి ఉంటుంది. నీళ్ళు తాగకుండా ఒక్క రోజు గడవడం కూడా కష్టమే. అది ఏ కాలమైనా సరే. వేసవి కాలమైతే ఇక చెప్పేదేముంది. ఈ సీజన్‌లో నీళ్ళు తాగకుండా ఒక్క గంట కూడా ఉండలేము, ఉండకూడదు కూడా. ఎండాకాలంలో దాదాపుగా నాలుగు లీటర్ల నీటిని తాగాలి. అప్పుడే శరీరం నీరసించిపోకుండా ఉంటుంది. రోజంతటికీ అవసరమైన శక్తీ అందుతుంది. కొంతమంది బద్ధకం కారణంగానో లేదా తగినంత నీరు అందుబాటులో లేని కారణంగానో నీళ్ళు తాగడం మానేస్తూ ఉంటారు. మీరు కూడా ఈ జాబితాలో ఉంటే కష్టాలు కోరి తెచ్చుకున్నట్టే. ప్రాణాంతకమైన డీహైడ్రేషన్ బారినా పడతారు. ముఖ్యంగా ఎండలో పనిచేసేవారు, ఎండ సమయంలో బయటకు వెళ్ళేవారు ఈ విషయంపై అవగాహన పెంచుకోవాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఒక్కోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా, ఇంట్లో నుంచి బయటకు వెళ్ళకున్నా డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదమూ ఉంది. ఈ పరిస్థితి ఎక్కువగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో కనిపిస్తుంది. ఇలాంటప్పుడు ముందుగా అది డీహైడ్రేషన్ అనే విషయాన్ని గుర్తించగలగాలి. అందుకు తగిన చికిత్స జరగాలి. లేదంటే ప్రాణాపాయం ముంచుకొస్తుంది. అలాకాకుండా ఉండాలంటే, డీహైడ్రేషన్‌ను గుర్తించాలంటే దాని లక్షణాలు, సంకేతాలు తెలుసుకుని ఉండాలి. డీహైడ్రేషన్ లక్షణాలు ఇవే....

అధిక దాహం



నీళ్ళు తాగమని మన మెదడు మనకు చెబుతూనే ఉంటుంది. అయినా తాగకపోతే తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ చేటుని గుర్తు చేస్తూ దాహం అంతకంతకూ ఎక్కువవుతూనే ఉంటుంది. డీహైడ్రేషన్ బారిన పడినట్లు మన శరీరం మనకు అందించే మొదటి సంకేతం ఇదే. దాహం వేసిన తర్వాత కూడా తాగకపోతే ఏదైనా తినాలనే కోరిక పెరుగుతుంది. దాంతో స్నాక్స్ రూపంలో ఏదో ఒకటి తీసుకుంటారు. ఈ ఆహారంలో ఉండే నీటిని శరీరం గ్రహించుకుంటుంది.

నోరు ఆరిపోవడం

పెదవులతో పాటు నోటి లోపల అంతా పొడిగా ఉన్నట్టుగా ఉందా, నాలుక కూడా పిడచకట్టుకు పోతున్నట్టుగా అనిపిస్తోందా? అయితే మీరు డీహైడ్రేషన్ బారిన పడబోతున్నట్టే. వెంటనే శక్తినిచ్చే ద్రావకాలు తీసుకోండి. ఎండలో నుంచి నీడ ఉన్న ప్రదేశానికి వెళ్ళిపోండి. గాలి బాగా తగిలేచోట ఉండండి

మత్తుగా అనిపించడం

ఆకస్మికంగా వచ్చే డీహైడ్రేషన్ ఎక్కువగా మెదడు మీదే ప్రభావం చూపిస్తుంది. ఈ కారణంగా తీవ్రమైన అలసటతో పాటు ఎప్పుడూ మత్తుగా అనిపిస్తుంది, మంచం మీద వాలిపోవాలని, నిద్రపోవాలని అనిపిస్తుంటుంది. ఏ పనీ సజావుగా పూర్తి చేయలేని పరిస్థితి ఉంటుంది. మత్తుగా ఉంది కదాని వెంటనే నిద్రకు ఉపక్రమించేయకండి. చక్కగా కుండ దగ్గరికి వెళ్ళి రెండు గ్లాసుల నీళ్ళు తాగండి. శరీరాన్ని వెంటనే నిస్సత్తువ నుంచి బయటపడేసే మార్గం ఆలోచించండి. అందుకు ఎలాంటి ద్రావకాలు తీసుకోవాలో తెలుసుకుని అరగంట తర్వాత వాటిని తీసుకోండి.

భ్రమలు, భ్రాంతులు

డీహైడ్రేషన్ బారిన పడితే ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా కూడా అనిపిస్తూ ఉంటుంది. పట్టపగలు కూడా ఇలాంటి పరిస్థితి ఉంటే డీహైడ్రేషన్ తీవ్రత ఎక్కువగా ఉన్నట్టుగా గమనించుకోవాలి. మీలో మీరు ఏదేదో మాట్లాడుకోవడం, గొణుక్కోవడం లాంటివి ఉంటే అది డీహైడ్రేషన్ లక్షణాల్లో ఒకటిగా తెలుసుకోవాలి. ఒక్కోసారి ఆ మాట్లాడుతోంది ఏమిటో కూడా మీకు గుర్తుండదు. ఇలాంటప్పుడు వెంటనే ఒక జగ్గు నీళ్ళు తీసుకుని వెంటనే తాగేయండి.

చర్మం పొడిబారిపోవడం

మీ చర్మం సహజంగా ఉండే మృదుత్వాన్ని కోల్పోయిందా. ఒక్కసారిగా మెరుపూ తగ్గిపోయిందా. కళాకాంతీ లేకుండా నిర్జీవంగా మారిందా. వీటన్నింటితో పాటు కుంచించుకుపోయినట్లుగా అయిపోతోందా? అయితే అది కచ్చితంగా డీహైడ్రేషన్ సంకేతమే.

చూపు మసకబారడం

ఉన్నట్టుండి మీ కళ్ళు కాంతిని చూడలేకపోతున్నాయా? దగ్గరలో ఉన్నా, దూరంలో ఉన్నా ఏ వస్తువునీ పట్టుమని సరిగ్గా చూడలేకపోతున్నారా? కళ్ళు మసకమసకగా అనిపిస్తున్నాయా? దానిని డీహైడ్రేషన్‌గా గుర్తించండి. ఇక్కడ ఇంకో విషయమూ గమనించుకోవాలి. చూపు మసకబారడం అనేది లో బ్లడ్ షుగర్ సంకేతం కూడా. ఈ రెండింటిలో ఏదైనా కూడా పెను ప్రమాదం ముంచుకొస్తున్నట్టే...వెనువెంటనే గ్లూకోజ్ నీళ్ళు తాగండి.

తలనొప్పి

డీహైడ్రేషన్‌లో సాధారణంగా కనిపించే లక్షణం ఇది. ఈ తలనొప్పి తీవ్రత కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి ఇది నీరు విషపూరితం కావడం వల్ల కూడా వస్తుంది. అంటే నీరు ఆ సమయానికి అవసరమైనదానికంటే ఎక్కువ, తక్కువలు ఉన్నా ఈ పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే గంటల వ్యవధిలో మనం ఎంత నీరు తాగామనే విషయంపై ఒక అవగాహన ఉండాలి. అప్రమత్తత ఉండాలి. అంటే అవసరమైన దానికంటే ఎక్కువ నీరు తీసుకోవడమూ ప్రమాదమే. అస్తమానూ ఏం తాగుతాం, ఒక్కసారే తాగేస్తే పనైపోతుందిలే అనుకోవద్దు. ఇలా చేయడం వల్లా ఇబ్బందులు ఏర్పడతాయి. నీటిని తరచుగా తాగుతుండాలి, తగిన మోతాదులో తాగుతుండాలి.

కండరాల తిమ్మిరి

ఇది డీహైడ్రేషన్‌లో కనిపించే సాధారణ లక్షణమే. కండరాల తిమ్మిరి క్రమంగా శరీరంలో ఎలక్ట్రోలైట్స్ అసమతుల్యతకు దారితీస్తుంది. విపరీతమైన శ్రమ లేదా అధిక వ్యాయామాల వల్ల ఈ కండరాల తిమ్మిర్లు వస్తున్నాయా? లేదా డీహైడ్రేషన్ కారణంగానే అనే విషయాన్ని తెలుసుకోవాలి. ఈ విషయంలో గందరగోళం ఉండకూడదు. రోజంతా కండరాల మీద ఈ ప్రభావం కనిపిస్తే అది డీహైడ్రేషన్‌గానే గుర్తించాలి. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

మూత్రం మంట

యూరిన్‌కి వెళ్ళేటప్పుడు మంటగా, నొప్పిగా ఉండడం, యూరిన్ ముదురు పసుపురంగులో ఉండడం గమనించారా? అంటే మీ శరీరానికి అదనపు నీరు అవసరం అన్నమాట. ఇదీ డీహైడ్రేషన్ లక్షణమే. అది కూడా తీవ్రంగా ఉన్నట్టు తెలుసుకోవాలి. ఎండాకాలంలోనే కాదు ఈ లక్షణం ఎప్పుడు కనిపించినా ఆరోగ్యం విషయంలో జాగ్రత్తపడాలి. ఇది అనారోగ్య సూచన. డీహైడ్రేషన్ బారినపడితే ఆకస్మికంగా యూరినేషన్ స్థాయి తగ్గిపోతుంది. ఒక్కోసారి పూర్తిగా ఆగిపోతుంది కూడా.

చెమట పట్టకపోవడం

ఎండల్లో ఎలాంటి శరీరతత్వం ఉన్నవారికైనా చెమట పడుతుంది. అది కూడా మామూలుగా కాదు అధికంగా ఉంటుంది. అలాంటిది అసలు చెమటే పట్టడం లేదా? అయితే మీరు తీవ్రమైన డీహైడ్రేషన్‌లో ఉన్నట్టే. ఈ విషయాన్ని తగిన సమయంలో తెలుసుకోవాలి.



- ఎన్ఎస్

ఇంట్లోనే యాపిల్ జామ్...!

జామ్ అంటే ఇష్టపడని పిల్లలు సాధారణంగా ఉండరు. అందులో యాపిల్ జామ్ అంటే మరింత ఇష్టపడతారు. దీనిని ఎప్పడూ బయట కొనితేవడమే కానీ ఇంట్లో తయారు చేసి ఉండరు కదా. దీనిని ఇంట్లోనే తయారు చేసుకుంటే ఎప్పడు కావాలంటే అందుబాటులో ఉంటుంది. స్వయంగా తయారు చేసుకున్నామన్న తృప్తి ఉంటుంది. బయట నుంచి తెచ్చుకున్నవాటిలో మాదిరిగా రసాయనాల బెడద ఉండదు. డబ్బులు ఎంతోకొంత మిగులుతాయి. దీనిని నిముషాల్లోనే తయారు చేసేయవచ్చు. నెల రోజుల వరకూ నిల్వ ఉంచుకోవచ్చు. మరి ఇంకెందుకు ఆలస్యం దీని తయారీ విధానం తెలుసుకుందామా!



కావలసిన పదార్థాలు

యాపిల్స్ రెండు, పంచదార ఒక కప్పు
నిమ్మకాయ అర చెక్క, నీళ్ళు అర కప్పు

తయారీ విధానం

యాపిల్స్ తొక్క తీసి చిన్నచిన్న ముక్కలుగా చేసుకోవాలి. పాన్ తీసుకుని వేడిచేసి అందులో ఈ ముక్కలు వేసి ఒకటి, రెండు నిముషాలు ఉంచండి. తర్వాత అందులో నీళ్ళు పోయండి. యాపిల్ ముక్కలు ఐదు, పది నిముషాలు ఉడకనివ్వండి. వీటిని చిదిమి గుజ్జులా చేయండి. వీటిలో పంచదార కూడా పోసి మిక్సీలో వేసి మెత్తగా చేయండి. ఇంకోసారి దీనిని వేడి చేయండి. జారుగా తయారైతే పర్వాలేదు. లేదంటే ఇందులో నిమ్మరసం కలిపి స్టవ్ కట్టేయండి. అన్నీ బాగా కలిసేలా కలియతిప్పండి. అంతే యాపిల్ జామ్ రెడీ. దీనిని గాలి చొరబడని డబ్బాలో పెట్టుకోండి. ఇలాంటి డబ్బాలో పెడితేనే నెల రోజుల వరకూ నిల్వ ఉంటుంది. లేదంటే తొందరగా పాడైపోతుంది. ఇందులో నిమ్మరసం తగినంతే పోయాలనే విషయాన్ని గుర్తుంచుకోండి. యాపిల్స్ ఎక్కువ తీసుకుంటే అంతే మోతాదులో పంచదారనూ పెంచుకోవాలి. ఒక కప్పు యాపిల్ ముక్కలకు కప్పు పంచదార సరిపోతుంది.

ఉదయాన్నే అల్పాహారంతో పాటు తాజా యాపిల్ జామ్‌ని కూడా పిల్లలకు పెడితే పలు ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయి. శరీరానికి కావలసినంత పీచుపదార్థంతో పాటు ఆరోగ్యకరమైన కొవ్వు వారికి లభిస్తుంది. బయట తయారు చేసే జామ్‌ల్లో అవి నిల్వ ఉండేందుకు కృత్రిమ రంగులు, ఇతరత్రా రసాయనాలు కలుపుతారు. వీటివల్ల అనారోగ్యాలు తప్పవు. అదే ఇంట్లోనే యాపిల్ జామ్ తయారుచేసుకుంటే ఈ బెడద ఉండదు. పైగా పలు పోషకాలు ఉంటాయి.

నల్ల మిరియాలతో నష్టాలూ ఉన్నాయి.!

నల్ల మిరియాలు ఆరోగ్యానికి ఎంత మంచివో......ఎక్కువగా వాడితే వాటివల్ల అన్ని నష్టాలు ఉన్నాయి. ఈ నల్ల మిరియాలనే కాలీ మిర్చి అని కూడా అంటారు. మన భారతీయుల వంట గదిలో కచ్చితంగా ఉండే పదార్థాల్లో ఇది కూడా ఒకటి. ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేకించి పశ్చిమ దేశాల్లో దీనిని విరివిగానే ఉపయోగిస్తారు. ఉప్పు, కారం మాదిరిగానే నల్ల మిరియాలు చాలా వంటల్లో వాడతారు. ఆమ్లెట్, సలాడ్‌లు లాంటివాటిలో తప్పనిసరిగా వేస్తారు. నల్ల మిరియాలులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఎంజైమ్‌లు, ప్రోటీన్లు, విటమిన్లు మనిషి శరీరానికి అనేక రకాల లాభాలను అందిస్తాయి. అలాగని అతిగా వాడితే తీవ్రమైన అనారోగ్యాలు తప్పవు. నల్లమిరియాలు ఎక్కువగా వాడడం వల్ల కలిగే నష్టాలు ఇవీ....

- పొట్టలో నొప్పి, మంట, గ్యాస్ సమస్యలు తలెత్తుతాయి.
- శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వస్తాయి.
- గొంతులో ఇరిటేషన్ ఏర్పడుతుంది.
- ఆస్తమా లక్షణాలూ కనిపిస్తాయి.
- చర్మం పొడిబారిపోతుంది. పొలుసులు మాదిరిగా పై చర్మం ఊడిపోవడం ప్రారంభమవుతుంది.
- పొడి చర్మంగల వారు నల్ల మిరియాలు లేదా వీటి ఫ్లేవర్ ఉండే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- సాధారణంగా దురద, మంట ఉండే చర్మం గల వాళ్ళకి ఈ పరిస్థితి మరింత ఎక్కువవుతుంది.
- గర్భంతో ఉన్నప్పుడు వీటిని తీసుకోవడం మంచిది కాదు.
- గర్భిణుల చర్మం చాలా సున్నితంగా మారుతుంది. ఇలాంటప్పుడు నల్ల మిరియాలు వాడితే దుష్ప్రభావాలు కనిపిస్తాయి.
- గర్భం తొలి నెలల్లో అయితే ఈ నల్ల మిరియాల వాడకంపై మరింత జాగ్రత్తగా ఉండాలి.
- గర్భిణులు ఏ నెలలో అయినా నల్లమిరియాలకు దూరంగా ఉండడమే అత్యుత్తమం.
- హాట్‌హాట్‌గా, స్పైసీగా ఏమైనా తినాలనుకున్నప్పుడు తక్కువ మోతాదులో నల్లమిరియాలు వాడుకోవచ్చు.
- తరచుగా వాడితే మాత్రం అనర్థాలు తప్పవు.
- నల్ల మిరియాలు అతిగా వాడితే ఒక్కోసారి గర్భస్రావమయ్యే అవకాశాలూ ఉన్నాయి.
- గర్భిణులు, పిల్లలకు పాలిచ్చే తల్లులు ఈ నల్ల మిరియాలు అస్సలు వాడరాదు.
- వీటిలో ఉండే కారం గాఢత వల్ల తల్లిపాలు రుచి మారతాయి. పిల్లలకు జీర్ణ సమస్యలూ వస్తాయి.





అతడు-ఆమె

జరిగిన కథ

అంతా పద్దులు తేడా చూసి వెరశి సున్నకి సున్నా హళ్ళికిహళ్ళి అని తేల్చేసి పారేస్తే ఆ వెధవ అహంకారం కట్టిపోతుంది!" అన్నారు నాన్న. తొమ్మిదిన్నరకి రేడియోలో గవర్నమెంటువారు కమ్యూనిస్టుల మీద ఈ వేళతో నిషేధం తొలగించేశారు అని చెప్పారు.

1 ఆమె

నాన్న బొంబాయినుంచి వచ్చేశారు. 'క్విట్టిండియా' ఉద్యమం మొదలైంది, అరెస్టులు ఉధృతంగా సాగుతున్నాయి. తనని కూడా వర్కింగు కమిటీ సభ్యులతో పాటు ఆగాఖాను భవనంలో నిర్బంధించివుంటే అన్ని విధాలా భాగుండిపోను అనుకుంటున్నారు. ఇటు కడుపులోచల్ల కదలకుండా రంగరంగ వైభోగాలతో శ్రీకృష్ణ జన్మస్థాన సందర్శనం, అటు అగ్రశ్రేణి నాయకులతో నిరంతరం సాంగత్యం. ఇహ తదుపరి దేశచరిత్ర యే రూపం యెత్తినా, ఢిల్లీ గర్భగుడిలో పీఠంమీద రిజర్వుడు స్థానం లభ్యం శిలాక్షరం.

(నిన్నటి సంచిక తరువాయి)

ఇప్పుడో - జైలే ప్రాప్తమవుతే యే వెల్లూరో బళ్ళారో కన్ననూరో తప్పదు కదా! అణాకాణీ చిల్లర నాయకుల మూకలో నమోదు పోయినట్టే లెక్క. ఇటు అలాగ జనానికి, అటు బ్రిటిషు వాడికినీ చచ్చేచావొచ్చింది. జైలు కెళితే ప్రకాశంగారు కటాక్షం యెలా వుంటుందో! సింహం గుహలో కాలు పెట్టినట్టే. ఇన్నాళ్ళూ రాజగోపాలాచారిగారి తోకై తిరిగినందుకు ఇప్పుడేం తిట్లు తినవలసొస్తుందో? జైలు కెళ్ళకపోతే తెలుగువాడు చెన్నపట్నం వీధుల్లో ఊరకుక్కల సంతలో నల్లజేపే. నాన్నకి యెటూ తోచక మంగలంలో పేలాల్లా వేగిపోతున్నారు. పేలాలు చల్లి దెయ్యాల్ని లేపినట్టు - బొంబాయిలో కొన్ని కాగితాలు ఎగిరాయట. నాన్న ఓ కాగితం పట్టుకొచ్చారు. "క్విట్ ఇండియా" ఉద్యమంలో ప్రజలేం చెయ్యాలో అందులో ఒకటీ, రెండూ, మూడు అంటూ స్పష్టంగా తెల్లకాయితం మీద నల్లక్షరాల్తో రాసుంది. అది గాంధీ ఉవాచ అంటున్నారు కొందరు. అది రహస్యపు సర్క్యులరట, చిదంబర రహస్యం. కాంగ్రెస్ అధిష్టాన దేవతలు జారీచేసినట్టు చెబుతూన్న యీ వేదవాక్కుకి నకళ్ళు పట్టుకుని చాలా మంది మైలాపూరు పెద్దలూ పిన్నలూ అమ్మదగ్గరకొచ్చి సలహా యిమ్మన్నారు. నిన్నట్నుంచీ ఇల్లంతా ఒకటే శనివారపుసంత.

ఓ ఛోటా నాయకుడు నా భుజం రాసుకు వెళ్ళిపోతూ అదే స్వర్గం అందుకున్నట్టు ఆనందిస్తూండడం కనిపెట్టి ఆ కాగితం యిమ్మన్నాను. రంభే వరం ప్రసాదించమని కోరినట్టు భావించి అతగాడు ఆ కాయితం నా చేతికిచ్చాడు. ఇస్తూ నా చెయ్యి సున్నితంగా తాకాడు. అందులో ఉద్యమ కార్యక్రమంగా టెలిగ్రాపు తీగెలు కత్తిరించడం, రైలు పట్టాలు తొలగించడం, రైలు సిగ్నలు తీగెలు తెంపడం ముఖ్యమనీ, దీనితో బ్రిటిష్‌వాడి తాడు తెగడం తథ్యమని వుంది. ఈ పనులు పకడ్బందీగా యెలా సాగించడం అన్నది తీరని సమస్య అయి కూచుంది. పెద్దలు యీ కార్యక్రమానికి ఉత్సాహంతో స్వాగతం చెప్పినా, మనో దౌర్బల్యం చేత, శారీరక బలహీనతచేత వాళ్ళ మాటలు కోటలు దాటాయేకాని చేతల మాటోచ్చేసరికి గడపలు దాటలేదు. పిన్నలకి ఆ పనులొప్పగించి వాళ్ళు తప్పుకున్నారు. నాన్న ఎలాగా పెద్దల్లో పెద్దే! ఈ ఆంగ్యల పుత్తరం కేవలం ఫోర్జరీ అంది అమ్మ. చివరికి పర్యవసానంగా గాంధీగారి చివరిమాట ప్రకారం ఎవరికి వారే నాయకులు. ఎవరి మార్గానికి వారే సేనాపతులు అని నిశ్చయించారు. నాకు మాత్రం ఈ కార్యక్రమం మంచి ఉత్సాహం ఇచ్చింది. బెంగాల్ టెర్రరిస్టులు జ్ఞాపకం వచ్చారు. గధర్ వీరులు గుర్తుకొచ్చారు. చిట్టగాంగ్ శూరులు మనసులో మెదిలారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవులు స్మృతి కొచ్చారు. వాళ్ళ అడుగుజాడల్లో అహింసాత్మకంగా దురాగ్రహంతో నడవాలనిపించింది.

మెరికల్లాంటి ఓ నలుగురు తెలుగు అమ్మాయిల్ని కూడగట్టుకుని యేదైనా ఓ సాహస కార్యం వెంటనే చేపట్టి బ్రిటిష్ వాడి గుండెలు హడల గొట్టేస్తే వెంటనే స్వతంత్రం చేతిలో పెట్టక యేం జేస్తాడు? నాకు యేదో పని చేసేదాక చెయ్యి వూరుకోకుండా వుంది. ఆ కరపత్రం చదివితే నా చేతులకి వేవేల చేతుల బలం కలిసొచ్చినట్టుంది. నా కాళ్ళని వెయ్యి హార్సు పవరు మోటారు శక్తి కదలిస్తూన్నట్టనిపించింది. నా గుండెకి



వెయ్యి విమానాల రెక్కలొచ్చి యెగిరిపోగలననే భరోసా కలిగింది. పరిగెడుతూన్న కలఁవా! ఆగు - ఆగు! నా బుర్రలో ఓ మెరుపు మెరిసింది. ఏకంగా వో రైలువంతెనే కూల్చేయ్యాలి. ఈ పని నేను చేశానంటే నా పేరు చరిత్రలో చిరస్థాయి అవుతుంది! ఐతే! వంతెన కూల్చటం యెలాగు? అందుకు ఏవేవి కావాలి? ఎవ్వరి నడగాలి? అడిగితే చెబుతారా? చెబితే నేను చెయ్యగలనా? ఎవర్నడగడం? సివిలింజనీరు సీతారాం వున్నాడు. మిలిటరీ ఇంజనీరు జనార్దనం వున్నాడు. సీతారాం నన్ను చూసి కన్ను గీటుతూనే వున్నాడు. నేను కాస్త స్వేచ్ఛిచ్చానంటే నన్ను వాటేసుకునే మొగాడు, నేను చెప్పిన పని చెయ్యడా? నా వలలో అతడు పడతాడా? నేనే అతడి వలలో చిక్కుకుంటానా?



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

చూదాం. ఇహపోతే, జనార్దనానికి నా మీద మనసున్నమాట వాస్తవం. మొన్న నా పుట్టినరోజుకి 'పార్కరు' పెన్ను యివ్వడంతో తెలిసిపోయింది. సాహసంలేని ప్రాణి. ఆ ప్రాణికి అమృతం రుచి చూపించాలి. గుండెలో సాహసం చిలకరించాలి. నామీద వుత్తుత్తి వలపో యేఁవిఁటో యీ దెబ్బతో తేలిపోవాలి-

అన్నట్టు: జనార్దనంమాట రాస్తుంటే గుర్తొచ్చింది. నేనా కాంగ్రెసు నాయకుడితో మాట్లాడ్డం చూశారు కాబోలు నాన్న - అమ్మతో అనడం వినిపించింది నాకు, భోజనాలయాక: "దీన్ని రేపో యెల్లుండో మంచిరోజుచూసి కన్యధార పోసెయ్యాలి. లేకుంటే యిది బరిదిగిపోతుంది. దీనికి పాతికేళ్ళు దాటుతున్నాయి. ప్రభగిరి పట్నం తాటిచెట్టులా ఎదిగిపోతూంది. లక్ష రూపాయలు కట్నం పారేస్తే, ఆ లక్షని కళ్ళకద్దుకుని యే ఐ.సి.యస్. వాడైనా మొగ్గలేసుకుంటూ వస్తాడు, అంతెందుకు మదనఁవే వస్తాడు, ఎంతైనా కలక్టరు కదా! మన లక్ష వూరికినే పోదు. ఈ వేళ నా యెడం చెయ్యిమీద పడింది బల్లి. శుభం. శకునం బహుదివ్యంగా వుంది. రేపు దశఁవి. నువ్వు శివ్వమ్మగారిని చూడ్డాని కెళ్ళినట్టు వెళ్ళి ఓమాటు మాట కదిపిరా, నే వెళితే ఆ పార్వతీశంగారు మరీ ధర పెంచుతారు. రేపు శుక్రవారం మధ్యాహ్నం పన్నెండింటితో రాహుకాలం దాటిపోతుంది. తరువాత ఎప్పుడెళ్ళినా మంచిదే" అన్నారు. అమ్మ యేఁవీ అన్నట్టులేదు. నాన్న ఉద్దేశం - నేనో ఒంగోలు ఆవుపడ్డననీ, వొంటికి పసుపురాసి మొహాన్ని కుంకుఁవ అదిఁవి, కొమ్ములకి వెండి తొడుగులు తొడిగి మెళ్ళో బంగారపు గంటల గొలుసు కట్టి, ఆ గొలుసుకి లక్షరూపాయిల ఉల్లాకు చెక్కు తగిలించి మందలోకి తోలేస్తే యే మైసూరు ఆబోతో నెల్లూరు అచ్చుయెద్దో జతకట్టకపోతుందా అని! అమ్మ వుద్దేశం ఏఁవిటో మరి? ఛీఛీ! వాళ్ళిష్టం వొచ్చినవాణ్ణి తీసుకొచ్చి, "వీడు పక్కలో నువ్వు పడుకోవాలే!" అంటే నేను పడుకోవాలా? నేను పడుకోను. చచ్చినా పడుకోను. నా గుండె, నా వొళ్ళూ నావీ. నన్ను పుట్టించిన తల్లిదండ్రులవి కావు. వాళ్ళని పుట్టించిన బ్రహ్మ రుద్రాదులవి అంతకంటే కావు. నన్ను పెంచి పెద్దదాన్నిచేసి విద్యాబుద్ధులు గరపిన అమ్మానాన్నవి అంతకంటే కావు. నా గుండెనీ, నా వొంటిని వేరు చెయ్యడం వాళ్ళ తరంకాదు. అవి రెండూ కలిసే వుంటాయి. అవి రెండూ కలిస్తేనే నేను.

నాన్న వాదన చీకట్లో అన్ని పిల్లలూ నల్లగానే వుంటాయి. చనువిస్తే వలపు దానంతటే కలిసొస్తుందని. కాని ఆనాడే అన్నాడు ఈసప్ నక్కా సింహం కథలో చనువు చీదర పుట్టిస్తుందని. ఈ స్తూక్తికి మరో రెండు మాటలు జోడించాడు మార్క్ ట్వేన్ : "చనువు చీదర విసుగు పుట్టిస్తుంది, పిల్లలు కూడా పుట్టిస్తుంది" కట్నం -పెళ్ళి - వలపు - పిల్లలూ ఈ మాటలు వినివిని నాప్రాణం విసుగుతూంది. సీతారాం, మదనం, జనార్దనం-ఆ మాటల్లో యీ పేర్లు జత కలుపుతే మరీ విసుగెత్తుతూంది. వీటిమధ్య యీ 'క్విటిండియా' కేకలు! వంతెనలు కూల్చడం! దేనికీ నావల్ల కాదు, బాబూ, దేనికీ నా వల్లకాదు!....

చెల్లి గాలిదుమారంలా గదిలోకి దూసుకొచ్చింది."అక్కా అక్కా! ఈ పద్యానికి అర్థం చెప్పవే!" అంది. "నాకు తెలుగు రాదే" అన్నా. "తెలుగు రాదనడానికి నీకు నోరెలా వొచ్చిందే. అక్కా! పోన్లేవే, అర్థఁవూ అంతరార్థఁవూ చెప్పొద్దులే. అది అర్థాంతన్యాసాలంకరఁవో అప్రస్తుత ప్రశంసాలంకారఁవో చెప్పొద్దులే. చిట్టచివరి పాదంలో భావం చెబుదూ చాలు. మనచరిత్రలో పద్యఁనే చంపకమాల:

"అనుటయు మాటలేక హృదయాబ్జము జల్లన మోమువెల్లనై
కనలుచు నీరుదేఱు తెలిగన్నుల నాతనిఁ బుల్కుపుల్కునం
గనుఁగొని మాటలం బొదువు గద్గదికం దలయూఁచి యక్కటా
వనిత తనంతఁడా వలచి వచ్చినఁ జుల్కన గాదె యేరికిన్"
(2 అ;66.)

"ఏఁవిఁ"టీ? భావం స్పష్టంగానే వుందే? ఏఁవిఁటి స్పష్టఁవే నా బొంద!" అంది. "నీబొంద కాకపోతే నాబొంద!" అన్నా. "అదేనే, నీబొందేనే! నువ్వన్నావు. నీకు జనార్దనంగారి మీద వలపుంది. 'నిన్ను వలచి వొచ్చాను, జనార్దనం' అంటే నువ్వు చులకనైపోతావూ?" అంది. "ఇందులో నామాటెందుకే? నేను వరూధినిటే?" "నువ్వు వరూధినివికావే వరూధిన్ని తలదన్ని పుట్టావే, అక్కా, అందులోనూ! ఉపమాలంకారం చెప్పానే. పోనీ నిజఁవైతే అతిశయోక్తే అనుకో. అబద్ధవైతే ఉత్ప్రేక్ష అనుకో! ఐనా వలపులో తొలిపలుకు మొగాడి పెదవుల్నించి వొలికితే ఒకటీ, ఆడదాని పెదవుల్నించి వొలికితే వొహటీనటే? ఇది పచ్చి బూర్జువా భావం కాదే, అక్కా?"అంది. ఆ మాటెక్కడబ్బిందే నీకు" అన్నా. "పాత భావాలన్నీ బూర్జువా భావం కాదే, అక్కా?" అంది. ఆ మాటెక్క డబ్బిందే నీకు" అన్నా. "పాతభావాలన్నీ బూర్జువా భావాలని కమ్యూనిస్టులంటున్నారు కదే? అంది. "నువ్వూ కమ్యూనిస్టు వేనేఁవిటే ఇదేంనేఁవిటి నువ్వు స్కూల్లో నేర్చుకుంటూన్నదీ?" అన్నా.

"సీతారాఁవుడి మెళ్ళో దండవేసింది. దమయంతి నలుడికి హంసచేత కబురంపించింది. రుక్మిణి యేకంగా తన్ను రాక్షస వివాహం చేసుకోమని కృష్ణుడి కాళ్ళావేళ్ళాపడింది. ఏం? వీళ్ళు బూర్జువాలా. కమ్యూనిస్టులా? నువ్వు బూర్జువావా, కమ్యూనిస్టువా, అక్కా?" అనడిగింది. "నేను కమ్యూనిస్టుని అవునో కానో నాకు సరిగా తెలీదు కాని, బూర్జువా రక్తంమాత్రం నా వొంట్లో లేదే!

- ఇంకా వుంది.

విజయ్ హజారె ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ?



కరెంట్ ఎఫైర్స్ బిట్‌బ్యాంక్

- ప్రమాదకర లూపస్ వ్యాధికి సరికొత్త చికిత్సను అభివృద్ధి చేసే దిశగా విస్తృత పరిశోధనలు చేపట్టేందుకుగాను భారత సంతతి శాస్త్రవేత్త చంద్రమోహన్‌తో కూడిన ముగ్గురు పరిశోధకుల బృందానికి లూపస్ పరిశోధకుల కూటమి (ఎల్‌ఆర్‌పి) ఎన్ని కోట్ల గ్రాంటును మంజూరు చేసింది ?
- దాదాపు రూ.3.9 కోట్లు
- దేశంలో 2017-18లో రికార్డుస్థాయిలో పంట దిగుబడులు వచ్చినట్టు కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. 2017-18 సంవత్సరం రెండోవిడత ముందస్తు అంచనాల ప్రకారం ఆహార ధాన్యాల దిగుబడి ఎన్ని మిలియన్ టన్నుల మేర ఉన్నట్లు పేర్కొంది ? **- 277.49 మిలియన్ టన్నులు**
- దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్ జుమా అవినీతి ఆరోపణలపై 2018 ఫిబ్రవరి 15వ తేదీన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉపాధ్యక్షుడు కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పేరేమిటి ?
- సిరిల్ రామఫోసా
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ప్రపంచ అవినీతి సూచీ-2017లో ఏ దేశానికి అగ్రస్థానం దక్కింది ? **- న్యూజిలాండ్**
- తెలంగాణ రాష్ట్రంలో రెండు పడకల గదుల గృహాల ఆకృతి, విపత్తులను ఎదుర్కొనేలా ఇళ్లను నిర్మిస్తున్నందున తెలంగాణ గృహ నిర్మాణ సంస్థకు ఏ అవార్డు లభించింది ? **- హడ్కో డిజైన్ అవార్డు - 2017**
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) డైరెక్టర్ (హెచ్‌ఆర్)గా ఎవరు నియమితులయ్యారు ? **- రంజన్ కుమార్ మహాపాత్ర**
- ఈఎస్‌పీఎన్-క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'టీ20 బౌలింగ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెలుచుకున్నది ఎవరు ?
- యజ్వేంద్ర చాహల్
- ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 2018 ఫిబ్రవరి 24-26 తేదీల మధ్య ఏపీ 24వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈ సదస్సు నినాదం ఏమిటి ? **- 'భారత్‌ను ప్రపంచంతో అనుసంధానించే వ్యూహాల రూపకల్పన'**
- దేశంలో యుద్ధ విమానాన్ని నడిపిన తొలి భారతీయ మహిళగా చరిత్రకెక్కింది ఎవరు ? **- అవనీ చతుర్వేది**
- కెనడాలోని మెక్‌మాస్టర్ యూనివర్సిటీ, అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఇటీవల ఏ జంతువు పూర్తి జన్యుక్రమాన్ని రూపొందించారు ? **- ఏనుగు**
- అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల బాలిస్టిక్ క్షిపణి ధనుష్‌ను భారత్ 2018 ఫిబ్రవరి 23న విజయవంతంగా పరీక్షించింది. అయితే ఇది ఎన్ని కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేదించగలదు ? **- 350 కిలోమీటర్లు**
- చెన్నై ఓపెన్- 2018 పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ? **- జోర్డాన్ థాంప్సన్ (ఆస్ట్రేలియా)**
- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నేషనల్ కాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీజీ)గా ఎవరు నియమితులయ్యారు ?
- నూకల నరేందర్ రెడ్డి
- వినియోగదారులకు బ్యాంకింగ్‌కు సంబంధించిన ప్రాథమిక ప్రశ్నలపై సమాధానాలు ఇచ్చేందుకు ఆర్‌బీఎస్ బ్యాంకు డిజిటల్ మానవ రూపాన్ని ఏర్పాటు చేసింది. దాని పేరు ఏమిటి ? **- కోరా**
- బాలికల నిష్పత్తిని గణనీయంగా పెంచడం, బాలికల విద్యను ప్రోత్సహించడంలో చొరవ చూపినందుకు కేంద్రప్రభుత్వం అందించే బేటీ బచావో.. బేటీ పఢావో అవార్డుకు తెలంగాణలోని ఏ జిల్లా ఎంపికైంది ?
- హైదరాబాద్
- ఈఎస్‌పీఎన్- క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'డెబ్యూడెంట్ (నూతన ఆటగాడు) ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎవరు ఎంపికయ్యారు ?
- కుల్దీప్ యాదవ్
- 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ నటుడి పురస్కారం ఎవరికి దక్కింది ? **- గారీ ఓల్డ్‌మాన్**
- **2018 ఫిబ్రవరిలో న్యూజిలాండ్‌లో బీభత్సం సృష్టించిన తుపాను పేరు ఏమిటి ?** - గిటా
- 2018 ఫిబ్రవరి 17-23 తేదీల మధ్య కుటుంబ సమేతంగా ఏ దేశ ప్రధాని భారత్‌లో ఏడు రోజులపాటు అధికారిక పర్యటన జరిపారు ?
- కెనడా ప్రధాని జస్టిన్ పియర్రీ జేమ్స్ ట్రూడో
- 26వ ప్రపంచ ఐటీ (సమాచార సాంకేతిక రంగం) కాంగ్రెస్ 2018 ఫిబ్రవరి 19-21 తేదీల మధ్య ఎక్కడ జరిగింది ?
- హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో
- స్వచ్ఛభారత్ అభియాన్‌కు మస్కట్‌గా ఎంపికైన మహిళ 2018 ఫిబ్రవరి 23న మరణించింది. ఆమె పేరు ఏమిటి ? **- కున్వర్‌బాయ్ (106)**
- హోంశాఖ తాజా గణాంకాల ప్రకారం దేశంలో ఏ రాష్ట్ర పోలీస్ శాఖ అత్యధిక మహిళా ఉద్యోగులతో తొలిస్థానంలో నిలిచింది ? **- తమిళనాడు**
- చెక్ ఓపెన్ అంతర్జాతీయ జూనియర్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నమెంట్‌లో హైదరాబాద్ ప్లేయర్ సూరావజ్జుల స్నేహిత్ సభ్యుడిగా ఉన్న భారత బాలుర జట్టు ఏ పతకం గెలుచుకుంది ? **- కాంస్య పతకం**
- 2018 ఫిబ్రవరి 24-26 తేదీల మధ్య ఏపీ 24వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు ఎక్కడ జరిగింది ? **- ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో**
- 2018 సంవత్సరానికిగాను బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ దర్శకుడు పురస్కారం ఎవరికి లభించింది ? **- గిల్లెర్మో డెల్ టోరో**
- ప్రముఖ బహుళజాతి బయో ఫార్మాస్యుటికల్ సంస్థ 'ఎలి లిలి అండ్ కంపెనీ' తన భారతీయ కార్యకలాపాలకు ఎవరిని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించింది ? **- లూకా విసిని**
- ఈఎస్‌పీఎన్- క్రిక్ ఇన్ఫో ప్రకటించిన వార్షిక అవార్డుల్లో 'ఉమెన్స్ బ్యాటింగ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఎవరికి దక్కింది ?
- హర్మన్‌ప్రీత్ కౌర్
- ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో వ్యక్తిగత పతకం సాధించిన తొలి భారత జిమ్నాస్ట్‌గా రికార్డులకెక్కింది ఎవరు ?
- బుద్దా అరుణారెడ్డి
- 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమ చిత్రం పురస్కారం దేనికి లభించింది ?
- త్రీ బిల్‌బోర్డ్స్ అవుట్‌సైట్ ఎబ్బింగ్, మిస్సోరి
- నేపాల్ నూతన ప్రధానమంత్రిగా 2018 ఫిబ్రవరి 15న పదవీ బాధ్యతలు స్వీకరించింది ఎవరు ?
- కేపీ శర్మ ఓలీ
- స్పానిష్ ఓపెన్ జూనియర్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది ఎవరు ?
- జక్కా వైష్ణవి రెడ్డి
- 2018 ఫిబ్రవరి 22-24 తేదీల మధ్య బయో ఆసియా సదస్సు - 2018 ఎక్కడ జరిగింది ? **- తెలంగాణలోని హైదరాబాద్ నగరంలో**
- జింబాబ్వేతో ఫిబ్రవరి 16న జరిగిన నాలుగో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ టీనేజ్ ఆఫ్ స్పిన్నర్ ఐదు వికెట్లు తీసి అత్యంత పిన్న వయస్సు (16 ఏళ్ల) లోనే ఈ ఘనత సాధించిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. అతని పేరు ఏమిటి ? **- ముజీబ్ జద్రాన్**
- తెలంగాణ ఎన్నికల సంఘం ప్రధానాధికారిగా ఎవరిని నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది ? **- రజత్‌కుమార్**
- ఆస్ట్రియా ఓపెన్ - 2018 బ్యాడ్మింటన్ టోర్నీలో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ?
- పారుపల్లి కశ్యప్ (భారత్)
- భారత సంతతికి చెందిన ఇద్దరు ఇండో - అమెరికన్లు ప్రతిష్టాత్మక వర్జీనియా సైంటిస్ట్ అవార్డును దక్కించుకున్నారు. వారు ఎవరు ?
- పార్థిక్ నాయుడు, అరుణ్ జె సన్యాల్
- ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ విడుదల చేసిన ప్రపంచ అవినీతి సూచీ-2018లో భారత్‌కు ఎన్నవ ర్యాంకు దక్కింది ?
- 81వ ర్యాంకు
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) దక్షిణ భారత ప్రాంతీయ కౌన్సిల్ (ఎస్‌ఐఆర్‌సీ) హైదరాబాద్ శాఖ చైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు ? **- సునీల్ కుమార్ మండవ**
- పన్నెండు కంటే తక్కువ వయసున్న బాలికలపై అత్యాచారం చేసినట్లు రుజువైతే మరణ శిక్ష విధించే చట్టం రూపకల్పనకు ఇటీవల ఏ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ? **- హర్యాణా**
- కతార్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ - 2018లో మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు కైవసం చేసుకున్నారు ?
- చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ పెట్రా క్విటోవా
- అణ్వస్త్ర సామర్థ్యమున్న మధ్యంతర శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-2ను భారత్ 2018 ఫిబ్రవరి 20న విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి ఎన్ని కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు ?
- రెండువేల కిలోమీటర్లు



- టీ 20 కెరీర్‌లో అత్యధిక పరుగులు (2,188) చేసిన బ్యాట్స్‌మన్‌గా గుర్తింపు పొందింది ఎవరు ?
- మార్టిన్ గప్టిల్ (న్యూజిలాండ్)
- విజయ్ హజారె ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకుంది ? **- కర్ణాటక**
- స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖుడు, ప్రపంచ నెంబర్ వన్ రోజర్ ఫెదరర్ రోటెర్ డామ్ టోర్నీలో విజేతగా నిలిచి టైటిల్‌ను అందుకున్నాడు. ఫెదరర్ కెరీర్‌లో ఇది ఎన్నవ టైటిల్ ? **- 97వ టైటిల్**
- ప్రముఖ నటుడు కమల్‌హాసన్ మధురైలో 2018 ఫిబ్రవరి 21న ప్రకటించిన రాజకీయ పార్టీ పేరు ఏమిటి ?
- 'మక్కల్ నీది మయ్యం) (ప్రజా న్యాయవేదిక)
- 2018 ఫిబ్రవరి 15-18 తేదీల మధ్య భారత్‌లో ఏ దేశ అధ్యక్షుడు అధికార పర్యటన జరిపారు ? **- ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ**
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2018ని ఏ సంవత్సరంగా అధికారికంగా ప్రకటించింది ? **- తెలుగు భాషా వికాస సంవత్సరం**
- విజయ్ హజారె ట్రోఫీ ఒక సీజన్‌లో అత్యధిక పరుగులు (723 పరుగులు) చేసిన బ్యాట్స్‌మన్గఆ రికార్డు సృష్టించింది ఎవరు ? **- మయాంక్**
- నెల్లూరు జిల్లాలో ఉన్న ఏ ఓడరేవును 'అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్ట్'గా కేంద్రప్రభుత్వం ప్రకటించింది ? **- కృష్ణపట్నం**
- స్విస్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ - 2018లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఎవరు గెలుచుకున్నారు ? **- సమీర్ వర్మ (భారత్)**
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఎవరు నియమితులయ్యారు ?
- డాక్టర్ శంకర్ ఎస్ మంత
- 2018 సంవత్సరానికిగాను ప్రకటించిన బాఫ్టా సినిమా అవార్డులలో ఉత్తమనటి పురస్కారం ఎవరికి లభించింది ? **- ఫ్రాన్సెస్ మెక్ డెర్మాండ్**
- చంద్రబాబు నాయుడి రాజకీయ జీవితానికి 2018 ఫిబ్రవరి 27తో ఎన్నేళ్లు నిండాయి ? **- 40 ఏళ్లు**

కొత్త సిలబస్‌తో కంపెనీ సెక్రటరీస్ (సీఎస్) కోర్సు

కంపెనీ, కార్పొరేట్ చట్టాల్లో నిరంతరం చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విధుల నిర్వహణకు సరికొత్త నైపుణ్యాలు అందించే కోర్సు కంపెనీ సెక్రటరీస్ (సీఎస్) కోర్సు.

దీన్ని పూర్తిచేసిన వారికి కార్పొరేట్ రంగం, ఇతర ప్రముఖ సంస్థల్లో కంపెనీ సెక్రటరీ, అసిస్టెంట్ కంపెనీ సెక్రటరీ తదితర హోదాలు లభిస్తున్నాయి. ఈ కోర్సుకు సంబంధించిన కొత్త సిలబస్ గురించిన వివరాలు..

మొత్తం మూడు దశల్లో కోర్సు..

కంపెనీ సెక్రటరీస్ కోర్సు మూడు దశల్లో ఉంటుంది. అవి.. ఫౌండేషన్ ప్రోగ్రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్. సీఎస్ కోర్సులో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హతతో చేరవచ్చు. ప్రత్యేక అర్హతలతో (ఉదా: ఫైన్‌ఆర్ట్స్ మినహా ఇతర విభాగాల్లో గ్రాడ్యుయేషన్ ద్వారా) ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశించొచ్చు.

రెండు, మూడు దశల్లో మార్పులు : 2018, మార్చి 1 నుంచి ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ (మాడ్యూల్ 1-4 పేపర్లు; మాడ్యూల్ 2-4 పేపర్లు)కు కొత్త సిలబస్ అమల్లోకి వచ్చింది. అదే విధంగా ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ (3 మాడ్యూళ్లలో 9 పేపర్లు)కు 2018, సెప్టెంబర్ 1 నుంచి కొత్త సిలబస్ అమలవుతుంది.

కార్పొరేట్ రంగంలో మారుతున్న పరిస్థితులు, వాటికి అనుగుణంగా ఔత్సాహికులకు నైపుణ్యాలను అందించి, కోర్సు పూర్తయ్యేసరికి పరిపూర్ణ సీఎస్‌లుగా తీర్చిదిద్దే ఉద్దేశంతో సిలబస్‌లో మార్పులు చేసినట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్‌ఐ) వర్గాలు పేర్కొన్నాయి.

ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్..

మాడ్యూల్-1 :

1. జ్యూరిస్‌ప్రుడెన్స్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ జనరల్ 'లాస్.
2. కంపెనీ లా.
3. సెటింగ్ అప్ ఆఫ్ బిజినెస్ ఎంటిటీస్ అండ్ క్లోజర్ (వ్యాపార సంస్థల ఏర్పాటు, మూసివేత).
4. ట్యాక్స్ 'లాస్.

మాడ్యూల్-2 :

5. కార్పొరేట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్.
6. సెక్యూరిటీస్ 'లాస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్.
7. ఎకనామిక్, బిజినెస్ అండ్ కమర్షియల్ 'లాస్.
8. ఫైనాన్షియల్ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్.

ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ కొత్త సిలబస్

మాడ్యూల్-1 :

1. గవర్నెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, కంప్లయన్సెస్ అండ్ ఎథిక్స్.
2. అడ్వాన్స్‌డ్ ట్యాక్స్ 'లాస్.
3. డ్రాఫ్టింగ్, ప్లీడింగ్స్ అండ్ అపియరెన్సెస్.

మాడ్యూల్-2 :

4. సెక్రటేరియల్ ఆడిట్, కంప్లయన్స్ మేనేజ్‌మెంట్ అండ్ డ్యూ డిలిగెన్స్.
5. కార్పొరేట్ రీస్ట్రక్చరింగ్, ఇన్‌సాల్వెన్సీ, లిక్విడేషన్ అండ్ వైండింగ్ అప్.
6. రిజల్యూషన్ ఆఫ్ కార్పొరేట్ డిస్ప్యూట్స్, నాన్ కంప్లయెన్సెస్ అండ్ రెమిడీస్.

మాడ్యూల్-3 :

7. కార్పొరేట్ ఫండింగ్ అండ్ లిస్టింగ్స్ ఇన్ స్టాక్ ఎక్స్ఛేంజెస్.
8. మల్టీ డిసిప్లినరీ కేస్ స్టడీస్. 9. ఎలక్టివ్ పేపర్.

బ్యాంకింగ్- లా అండ్ ప్రాక్టీస్
ఇన్సూరెన్స్ - లా అండ్ ప్రాక్టీస్.
ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - లా అండ్ ప్రాక్టీసెస్.
ఫోరెన్సిక్ ఆడిట్.
డైరెక్ట్ ట్యాక్స్ లా అండ్ ప్రాక్టీస్.
లేబర్ 'లాస్ అండ్ ప్రాక్టీస్.
వాల్యుయేషన్స్ అండ్ బిజినెస్ మోడలింగ్.
ఇన్‌సాల్వెన్సీ-లా అండ్ ప్రాక్టీస్.
(వీటిలో ఒక దాన్ని ఎంపిక చేసుకోవాలి).

ప్రాక్టికల్ శిక్షణ విధానాల్లో మార్పు :

సీఎస్ ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్ సిలబస్‌లో మార్పులు చేసిన ఐసీఎస్‌ఐ.. ఫౌండేషన్ నుంచి ప్రొఫెషనల్ వరకు అమలు చేస్తున్న పలు రకాల శిక్షణ విధానాల్లోనూ మార్పు చేసింది. ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ విద్యార్థులకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్, కంప్యూటర్ ట్రైనింగ్ నుంచి మినహాయింపు ఇచ్చింది. అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్‌లో మార్పులేదు

సీఎస్ కోర్సు పూర్తిచేసే క్రమంలో విద్యార్థులు కేవలం రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడమే కాకుండా.. తప్పనిసరిగా అప్రెంటిస్‌షిప్ పేరుతో ఉండే ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ అప్రెంటిస్‌షిప్ గరిష్ట వ్యవధి మూడేళ్లు. అభ్యర్థులు సీఎస్ కోర్సు ఏ దశలో చేరారో దానికి అనుగుణంగా ఈ వ్యవధిలో మార్పు ఉంటుంది.

- సీఎస్ కోర్సు పూర్తి వివరాలకు వెబ్‌సైట్ :www.icsi.edu

కోర్సుతో ఉద్యోగాలు

సీఎస్ కోర్సు పూర్తిచేసి, ఐసీఎస్‌ఐ అసోసియేట్ మెంబర్‌షిప్ పొందిన అభ్యర్థులకు కార్పొరేట్ సంస్థల్లో కంపెనీ సెక్రటరీలు, అసోసియేట్ కంపెనీ సెక్రటరీలు, కంప్లయన్స్ ఆఫీసర్స్ తదితర కీలక హోదాల్లో కొలువులు లభిస్తాయి. వీటికితోడు స్వయం ఉపాధి కోణంలోనూ ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీగా కెరీర్ ప్రారంభించొచ్చు. ఇందులోనూ మంచి ఆదాయం లభిస్తుంది. కొత్తగా కంపెనీ ఏర్పాటు చేసేటప్పుడు నిర్దేశిత చట్టాల ప్రకారం.. కంపెనీ ప్రాస్పెక్టస్, ఇతర వివరాలను గుర్తింపు పొందిన కంపెనీ సెక్రటరీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో స్వయం ఉపాధికి మంచి ఆదరణ నెలకొంది.

కొత్త నైపుణ్యాలు అందించేందుకే..

ఐసీఎస్‌ఐ.. ఎగ్జిక్యూటివ్, ప్రొఫెషనల్ ప్రోగ్రామ్‌ల సిలబస్‌లో మార్పులు చేయడానికి ప్రధాన కారణం.. విద్యార్థుల్లో కొత్త నైపుణ్యాలు అందించడమే. ఇటీవల కార్పొరేట్ చట్టాలు, ఇతర అంశాల పరంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వీటికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేందుకు కొత్త సిల బస్‌ను రూపొందించాం. ఈ కోర్సు ఔత్సాహికులు నిరంతర పరిణామాలపై అవగాహనతో అడుగులు వేస్తే ఎన్ని మార్పులు వచ్చినా సులువుగా కెరీర్‌లో రాణించగలుగుతారు.

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-409.73 ▼	-116.70 ▼	200 ▲	29,340	300 ▲	41,600	
32,596.54	9,998.05	29,350	ప్రొద్దుటూరు 29,340	39,800	ప్రొద్దుటూరు 41,536	65.01
			22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
అదానీపోర్ట్స్	361.70	0.99
ఇన్ఫోసిస్	1,167.45	0.75
ఎం&ఎం	733.25	0.47
కోల్ ఇండియా	271.95	0.09
ఏషియన్ పెయింట్స్	1,119.00	0.03

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
ఎస్-బ్యాంక్	286.70	-3.87
యాక్సిస్ బ్యాంక్	501.00	-3.34
ఎస్‌బీఐ	234.60	-2.90
ఐసీఐసీఐబ్యాంక్	277.85	-2.73
టాటాస్టీల్	569.25	-2.40

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.10	65.01
యూరో	80.22	80.19
పౌండ్	92.05	91.85
ఆస్ట్రేలియా డాలర్	50.21	50.24
సింగపూర్ డాలర్	49.49	49.47

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,390	31,433
చెన్నై	29,390	31,433
బెంగళూరు	28,450	30,427
ముంబై	29,980	32,064
విజయవాడ	29,350	31,800
విశాఖపట్నం	29,340	31,370
ప్రొద్దుటూరు	29,340	30,810
ముడి చమురు		69.91



పెరిగిన బంగారం, వెండి ధరలు

ముంబై: దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఊపందుకున్నాయి. 10గ్రాముల బంగారం ధర రూ.250లు పెరిగి రూ.31,750లు పలికింది. అంతర్జాతీయంగా బంగారం ధర 0.92శాతం పెరిగి ఔన్స్ 1340.80 డాలర్లకు చేరింది. వెండి స్వల్పంగా రూ.50లు పెరిగి కేజీ వెండి ధర రూ.39,550 చేరింది. ఔన్స్ 0.98శాతంతో 16.50 డాలర్లు నమోదుచేసింది. నాణేలు, పరిశ్రమల నుండి వెండికి డిమాండ్ పెరగడంతో ధరలు పెరిగేందుకు తోడ్పడింది. ట్రంప్ వాణిజ్యయుద్ధానికి తెరదీయడంతో మదుపరులు బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు మొగ్గుచూపుతున్నట్లు ట్రేడర్లు పేర్కొన్నారు.

8పైసలు తగ్గిన రూపాయి

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ గురువారం 8పైసలు విలువ తగ్గి 65.19 వద్ద నిలిచింది. చైనా దిగుమతులపై 60బిలియన్ డాలర్ల సుంకాన్ని విధించనున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో గ్లోబల్ ఈక్విటీ మార్కెట్‌లో స్వల్ప నష్టాలను నమోదుచేసింది. గురువారం రూపాయి 10పైసలు లాభపడి 65.11 వద్ద నమోదైంది.

అన్నదాత అవాక్కు!

చెన్నై: రైతులకు పరిహారం చెల్లింపులో పైసన్నర, రెండు పైసలు చొప్పున చెక్కులిచ్చి యూపీ ప్రభుత్వం పల్లికిలిస్తే... రైతుల నుంచి వందల్లో ప్రీమియం వసూలు చేసిన బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లింపుల్లో ఐదు రూపాయలు, పది రూపాయలకు చెక్కులిచ్చి పరిహాసం చేసిన వైనం తమిళనాడులో వెలుగు చూసింది. నష్టపరిహారం పేరిట తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన చెక్కులను చూసి అన్నదాతలు అవాక్కయ్యారు. ఏడు రూపాయలు, పది రూపాయలతో వచ్చిన చెక్కులు చూసి విస్తుపోయారు. పంటలు కోల్పోయిన రైతులకు సాయం కోసం దిండిగుల్ సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు ఈ చెక్కులు జారీ చేసింది. ఇందులో మరీ దారుణంగా 5 రూపాయల చెక్కులు ఉండడం విశేషం. ఎకరం పొలంలో వరి పంట నష్టానికి రూ.26వేలు, అపరాలకు రూ.12వేలు, చిరుధాన్యాలకు రూ.20వేల చొప్పున నష్ట పరిహారం పొందే అవకాశం ఉండగా.. ఇలా రైతుల చేతిలో ఐదు, పది రూపాయల చెక్కులు పెట్టడం విమర్శలకు దారి తీసింది. దిండిగుల్ జిల్లాలోని కొన్ని గ్రామాల్లో పొరపాట్లు దొర్లాయని ప్రభుత్వం అంగీకరించింది. రాతలో పొరపాట్లను సరిదిద్దాలంటూ ఇప్పటికే బీమా కంపెనీలను ఆదేశించినట్టు వెల్లడించింది. పంటనష్టంపై రైతులకు ఐదు రూపాయల పరిహారం ఇచ్చారంటూ కిల్వెన్నతూర్‌కి చెందిన డీఎంకే ఎమ్మెల్యే కే.పిట్చండి అసెంబ్లీలో లేవనెత్తడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కరుపాసామి అనే రైతు ఎకరా భూమికి బీమా కోసం రూ.102 ప్రీమియం కడితే రూ.10 పరిహారం వచ్చింది. తిరుమలైసామి అనే మరో రైతుకూ ఇదే అనుభవం ఎదురైంది. ఎకరానికి రూ.50 ప్రీమియం కడితే ఐదు రూపాయల పరిహారం ఇచ్చారు.

మేమూ ఆంక్షలు విధిస్తాం

అమెరికాకు చైనా హెచ్చరిక





బీజింగ్: విదేశీ దిగుమతిలపై భారీ సుంకం విధించి వాణిజ్య యుద్ధానికి తెరతీసిన అమెరికాకు దిమ్మతిరిగేలా.. చైనా ధీటైన జవాబు ఇచ్చింది. అమెరికాతో వాణిజ్య యుద్ధానికి ఏమాత్రం భయపడేది లేదని, వెనకడుగు లేదని చైనా శుక్రవారం స్పష్టంచేసింది. తాము కూడా అమెరికాపై వాణిజ్య ఆంక్షలు విధిస్తామని హెచ్చరించింది. అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలు పెంచుతామని వెల్లడించింది. సుంకాలు పెంచే అమెరికా వస్తువుల జాబితాను చైనా విడుదల చేసింది. తాజా పండ్లు, పంది మాంసం, వైన్ వరకు పలు వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. ఈ విషయంపై అమెరికాతో చర్చించి నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వివాదాన్ని చర్చలతో పరిష్కరించుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. చైనాపై అమెరికా ప్రభుత్వం గురువారం వాణిజ్య ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. చైనా నుంచి దిగుమతులపై 6000 దాలర్ల వార్షిక సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. ఏ వస్తువు మీద ఎంత సుంకం విధించాలనేది మరో పదిహేను రోజుల్లో నిర్ణయిస్తామని తెలిపారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తాము కూడా అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తువులపై సుంకం విధిస్తామని హెచ్చరించింది. ట్రంప్ సర్కారు వాణిజ్య యుద్ధం మొదలుపెడితే తాము వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేసింది. తాము వాణిజ్య యుద్ధంలో పోరాడాలని అనుకోవట్లేదు. కానీ దాని గురించి ఏమాత్రం భయపడట్లేదని చైనా వాణిజ్య శాఖ వెల్లడించింది. ట్రంప్ తాజా నిర్ణయంతో చైనా నుంచి దిగుమతయ్యే దాదాపు 1300 వస్తువుల ధరలు పెరిగే అవకాశముందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. చైనాపై వాణిజ్య ఆంక్షలు సహేతుకమైనవేనని ట్రంప్ సమర్థించుకున్నారు. అమెరికా కార్లపై చైనా 25శాతం పన్ను విధిస్తోంది.. అదే చైనా కార్లపై అమెరికాలో 2.5శాతం పన్ను మాత్రమే ఉందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ విషయంలో దీర్ఘకాలంలో చైనాతో సంప్రదింపులు సాగించినా ఫలితం లేకపోయిందనీ, దీంతో ఆంక్షలు విధించక తప్పలేదని ట్రంప్ అంటున్నారు. అమెరికా చరిత్రలోనే చైనాతో వాణిజ్య లోటు రికార్డుస్థాయిలో 37,500 కోట్ల డాలర్లకు చేరిందని చెప్పారు. కాబట్టి చైనాపై వాణిజ్య ఆంక్షలు సరైనవేనని సమర్థించుకున్నారు. భారత్ విషయంలోనూ గతంలో ట్రంప్ ఇదే విధమైన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అమెరికా మోటార్‌సైకిళ్లపై భారత్‌లో అధిక సుంకాలు విధిస్తున్నారని, తాము మాత్రం భారత వాహనాలపై ఆ విధంగా సుంకాలు వేయడం లేదని, ఇలా కాకుండా పరస్పరం ఒకే విధమైన పన్నుల విధానం ఉండాలని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు.

అమెరికా దిగుమతులపై రెండు దశల్లో సుంకాన్ని పెంచేందుకు చైనా సన్నద్ధమైంది. స్టీల్ పైప్‌లు, వైన్ తదితర 120 రకాల ఉత్పత్తులపై 15 శాతం సుంకం వసూలు చేయాలని భావిస్తోంది. అంటే 9770 కోట్ల మేరకు స్టీల్ పైప్‌లు, వైన్ ఉత్పత్తులపై అమెరికాకు భారం పడుతుంది. అదేవిధంగా పందిమాసం, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం అంటే సుమారు 199 కోట్ల డాలర్ల సుంకాన్ని చైనా వసూలు చేయనుంది. దీంతో భారీ సుంకం భారంతో అమెరికా వాణిజ్య వర్గాలు ఓ పెద్ద మార్కెట్‌ను కోల్పోతాయి.

మార్కెట్లు నష్టాల బాట



ముంబై: వాణిజ్య యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ సన్నద్ధంకానున్నారు. చైనాపై వాణిజ్య ఆంక్షలు విధించారు. ఈ ప్రభావం అమెరికా, ఐరోపా స్టాక్ మార్కెట్లతోపాటు ఆసియా దేశాల స్టాక్ మార్కెట్లు తీవ్ర నష్టాల్లో ముగిసాయి. ఈ ప్రతికూల ప్రభావం దేశీయ మార్కెట్లపై కూడా పడటంతో శుక్రవారం ఆరంభంలోనే సూచీలు కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా 410పాయిట్లు కోల్పోగా, నిఫ్టీ ఈ ఏడాదిలోనే తొలిసారిగా 10,000 పాయింట్లకు దిగువన ట్రేడ్ అయింది. ఒక దశలో 500పాయింట్లకు పైగా పతనమైంది. చివరకు కాస్త కోలుకున్నప్పటికీ భారీ నష్టం తగ్గలేదు. చైనాకు సంబంధించిన అన్ని ఉత్పత్తులపై సుమారు 1.300 వస్తువుల దిగుమతులపై భారీ సుంకాన్ని విధించేందుకు అమెరికా సిద్ధపడింది. 60బిలియన్ డాలర్ల సుంకాన్ని విధించనుంది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయంతో వరల్ట్ ట్రేడ్ ఆర్గనైజేషన్ పరిధిలో అమెరికాపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు చైనా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. వాణిజ్యయుద్ధం ప్రభావంతో డౌ 724 పాయింట్లతో 23,957కు దిగివచ్చింది. ఆసియా మార్కెట్లు రెడ్ మార్కులో ట్రేడ్ అవుతున్నాయి. సెన్సెక్స్ 410పాయింట్లతో 32,563 పాయింట్లు నిఫ్టీ 142పాయింట్ల నష్టంతో 9,972 పాయింట్లు వద్ద నిలదొక్కుకుంది. 2017, అక్టోబరు 12 తరువాతం మొదటిసారి నిఫ్టీ 10వేల దిగువకు దిగజారింది. ఇండెక్స్ సుమారు 4శాతం దిగువన 9,988.90 దిగువన ముగిసింది. జనవరి 29న అత్యధికంగా నిఫ్టీ 11,171.55 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30స్టాక్స్‌లో అన్నీ రెడ్‌లో నమోదయ్యాయి. యస్ బ్యాంకు 3.69శాతం, టాటాస్టీల్ 3.37శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 3.02శాతం ప్రధానంగా నష్టపోయాయి. మిడ్‌కాప్, స్మాల్ కాప్ స్టాక్స్ 1.83శాతం, 1.98శాతం నమోదయ్యాయి. బిఎస్‌ఇ బ్యాంకెక్స్ 522 పాయింట్లు 1.93శాతం క్రాష్ కావడంతో బ్యాంకింగ్ స్టాక్స్ పూర్తిగా నష్టాల్లో నమోదయ్యాయి. బిఎస్‌ఇ కాపిటల్ గూడ్స్ ఇండెక్స్ 339 పాయింట్లతో 17,992 వద్ద ముగిసింది. 1776స్టాక్స్ నష్టాల్లో నమోదుకాగా 164 స్టాక్స్ లాభాల్లో నమోదయ్యాయి. విదేశీ మదుపరులు రూ.1065.99 కోట్ల విలువైన షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. దేశీయ మదుపరులు రూ.1127.78 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. 19 సెక్టరల్ సూచీల్లో రియాల్టీ, బ్యాంకెక్స్, బేసిక్ మెటీరియల్స్, మెటల్ 2శాతానికిపైగా నష్టపోయాయి. పిఎస్‌యు బ్యాంక్ 3.64శాతం నష్టపోయింది. అదానీ పోర్టు, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, ఆసియన్ పెయింట్స్ టాప్ గెయినర్స్ కాగా యస్‌బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఐసిఐసిఐ బ్యాంకు ప్రధానంగా నష్టపోయారు.

10వేల దిగువకు నిఫ్టీ

అంతర్జాతీయ మార్కెట్లు: జపాన్ బెంచ్ మార్కు నిక్కీ 225 ఇండెక్స్ 3.5 శాతంతో 20,827.92 వద్ద ముగిసింది. సౌత్ కొరియా కాస్పి 2.3శాతంతో 2438.03 వద్ద నమోదైంది. హాంగ్‌కాంగ్ హాంగ్ శాంగ్ 3.2శాతంతో 30,090.32 పాయింట్లు, షాంఘై కాంపోజిట్ 2.7 శాతంతో 3169.19 పాయింట్లు, ఆస్ట్రేలియా ఎస్ అండ్ పి/ఏఎస్‌ఎక్స్ 200 1.9 శాతంతో 5824.50 వద్ద ముగిసాయి.

ఆస్తి పన్ను బకాయిలు రూ.1,572 కోట్లు

- ఇప్పటికి వసూలైంది రూ.792 కోట్ల 81 లక్షలే
- రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది కొరతతో మందగించిన వసూళ్లు
- మొండి బకాయిదారుల జాబితాలో ప్రభుత్వ కార్యాలయాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో ఆస్తి పన్నును 80 శాతానికిపైగా వసూలు చేయాలని సంబంధిత కమిషనర్‌లు పట్టుదలతో ఉన్నారు. పన్ను వసూలుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. మొండి బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ వసూలు చేయాలని, లేని పక్షంలో బకాయిదారుల ఆస్తులు జప్తు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నట్లు సమాచారం. ఆయా మునిసిపాలిటీలలో సిబ్బంది కొరత ఉన్నందు వల్ల కూడా ఆశించిన మేరకు పన్నులు వసూలు కావడం లేదు. రాష్ట్రంలో కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన ఆస్తి పన్ను కోట్లలో ఉంది. 7.8 సంవత్సరాల నుండి కూడా పలు ప్రభుత్వ కార్యాలయాలు పన్నులు చెల్లించడం లేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు విడుదల చేస్తే మున్సిపాలిటీలకు పన్నులు కట్టడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే ప్రభుత్వ కార్యాలయాలు మునిసిపాలిటీలకు కట్టవలసిన పన్నుల బకాయిలు వడ్డీతో పెరుగుతూనే ఉంటాయి. ఈ నేపథ్యంలో 13 జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో మొత్తం 29 లక్షల 70 వేల 980 ఇళ్లు ఉన్నాయి. ఈ 13 జిల్లాల్లో ఆస్తి పన్ను రూ.1,572 కోట్ల 12 లక్షలు వసూలు కావాల్సి ఉండగా ఈ నెల 17వ తేదీ వరకు రూ.792 కోట్ల 81 లక్షలు మాత్రమే వసూలయ్యాయి. వసూలు శాతం 50.43గా ఉంది.

కార్తీ చిదంబరానికి బెయిల్



న్యూఢిల్లీ : ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం తనయుడు కార్తి చిదంబరంకు ఊరట లభించింది. అవినీతి కేసులో ఢిల్లీ హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. లండన్ నుంచి తిరిగివచ్చిన కార్తిని ఫిబ్రవరి 28న సీబీఐ అరెస్టు చేయడం తెలిసిందే. ఆయనకు విధించిన 12 రోజుల జ్యుడీషియల్ కస్టడీ శనివారంతో ముగియనుంది. ఇప్పటికే ఆయన పాస్‌పోర్టు అధికారుల వద్ద ఉన్నట్టు కార్తి న్యాయవాదులు ఇంతకుముందే కోర్టుకు తెలిపారు. కేసును జస్టిస్ ఎస్పీగార్గ్ విచారించారు. కార్తికి బెయిల్ మంజూరు చేస్తూ రూ.10లక్షల పూచీకత్తు ఇవ్వాల్సి ఉంటుందని, విదేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా సీబీఐ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందని ఆదేశించారు. అంతేకాకుండా బయటకు వచ్చిన తర్వాత కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలను తారుమారు చేయడం లాంటివాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే, ఇందుకు సీబీఐ అభ్యంతరం తెలిపింది. కార్తి ఇప్పటికే సాక్ష్యాధారాలను తారుమారు చేశారని, ఆయనకు బెయిల్ ఇవ్వవద్దని వాదించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆరోపణలను కార్తి తరపు న్యాయవాదులు ఖండించారు. కార్తిపై ఇప్పటివరకు అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయలేదని, ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని వాదించారు. కార్తి కస్టోడియల్ ఇంటరాగేషన్‌ను సీబీఐ కోరనప్పుడు ఆయనను జ్యుడీషియల్ కస్టడీలో ఎందుకు ఉంచాలని ప్రశ్నించారు.

12శాతం తగ్గనున్న పత్తి దిగుబడి



విశాలాంధ్ర-బిజినెస్ డెస్క్: ప్రపంచంలోనే పత్తి ఉత్పత్తిలో ప్రథమస్థానంలో ఉన్న భారత్‌లో పత్తి పెంపకం ఈ ఏడాది దాదాపు 12శాతం వరకు తగ్గిపోతున్నట్లు నిపుణులు ఆందోళన చెందుతున్నారు.. 2018-19 సంవత్సరానికి కాటన్ ప్లాంటింగ్ భారత్‌లో పత్తిని పంటను నాశనం చేసే పింక్ బోల్‌వర్మ్ రైతుల ఆదాయాన్ని గణనీయంగా తగ్గించడంతో రైతుల ఇతర పంటల వైపు దృష్టి సారిస్తున్నట్లు వెల్లడైంది. 2018-19 సంవత్సరంలో కాటన్ పంట పండించే భూమి కూడా 10.8 మిలియన్ హెక్టార్లకు పడిపోయింది. అక్టోబరు నుండి ప్రారంభమయ్యే పత్తి పంట ఈ ఏడాది 12.26 మిలియన్ హెక్టార్లనుండి మరింత దిగువకు నమోదయ్యే సూచనలు ఉన్నట్లు నిపుణులు వెల్లడించారు. పత్తి పంట దిగుబడి గణనీయంగా తగ్గడంతో సంబంధిత ఎగుమతులు కూడా తగ్గడంతో నూలు వస్త్రాల ధరలు కూడా పెరగనున్నాయి. 2014 జూన్ తరువాత ఈ ధరలు మరింత అధికం కానున్నాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల్లో పత్తి పంటను నాశనంచేసే పింక్ బోల్ వర్మ్ పురుగుల ప్రభావం దిగుబడి మరింత తగ్గిందని చెప్పవచ్చు. ఈ రాష్ట్రాల్లో రైతులు సోయాబీన్స్ వంటి ఇతర పంటల సాగుబడికి దృష్టి కేంద్రీకరిస్తున్నారని కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అతుల్ గనాత్ర వెల్లడించారు. ఆయా రాష్ట్రాల్లో రైతులు వాడే క్రిమి సంహారక మందులపై పెట్టే పెట్టుబడులు మరింత ఎక్కువవుతున్నాయి. పింక్ బోల్ వర్మ్‌లు పత్తిబాల్‌లో ఉండే ఫైబర్‌ను, విత్తనాలను తినేయడంతో దిగుబతికి భారీ విఘాతం కలుగుతోంది. పత్తి పంటకు ప్రధానంగా కావలసింది తేమ. రుతుపవనాలు జూన్, జులైమసాల్లో ప్రారంభకాగా సాగునీటి పొలాలు ఉన్నవారు మే ప్రథమార్ధంలోనే పత్తి నాటడం ప్రారంభిస్తారు. ఈ ఏడాది సుమారు రూ.35,000లు కేవలం క్రిమి సంహారక మందులకే వినియోగించగా ఎకరానికి కేవలం 400కేజీల దిగుబడి కాగా, గత ఏడాది 900కేజీలు వచ్చినట్లు ఓ రైతు వాపోయాడు. ఈ రైతు 5 ఎకరాల నుండి 2 ఎకరాలకు తగ్గించి సోయాబీన్‌పంటను వేసుకోనున్నట్లు తెలిపాడు. బోల్‌వర్మ్‌ను అరికట్టేందుకు మన రైతులు జనెటికల్లీ మోడిఫైడ్ బిటి కాటన్ విత్తనాలను నాటినప్పటికీ క్రిములను నియంత్రించలేకపోతున్నారు. అమెరికా తరువాత భారత్ కాటన్ ఎగుమతిదారుల్లో రెండవ అతిపెద్ద దేశంగా గణతికెక్కింది. సాంకేతిక విధానంలో ముందంజలో ఉన్నప్పటికీ పింక్ బోల్‌వర్మ్‌ను మాత్రం సాంకేతికత నియంత్రించలేకపోతోంది. బిటి కాటన్‌కుబదులుగా హైబ్రిడ్ కాటన్ విత్తనాలను ఉపయోగించవలసిందిగా రైతులకు సూచించినట్లు ఇండియా టెక్స్‌టైల్ కమిషనర్ కవిత గుప్త వెల్లడంచారు. దేశీయ వ్యవసాయ మంత్రిత్వశాఖ భారతదేశ విత్తనాలకంపెనీలు జన్యుపరంగా మార్పుచెందిన పత్తికోసం మోన్‌శాంటోకు 20.4శాతం చెల్లించిన రాయల్టీలను తగ్గించాలని నిర్ణయించింది. రుతుపవనాలు కాటన్ ఉత్పత్తికి ప్రధాన కారణం. ఈ ఏడాది జూన్-సెప్టెంబరు మాసాల్లో వర్షాలు రావచ్చునని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రైవేటు సంస్థలు మాత్రం ఈ ఏడాది వాతావరణంలో తేమ శాతం తక్కువగా ఉండవచ్చునని తెలిపింది.

విజ్ఞానం

బేరియాట్రిక్‌తో కిడ్నీ వ్యాధులు తగ్గుముఖం



శరీరబరువు తగ్గేందుకు చేయించుకుంటున్న బేరియాట్రిక్ సర్జరీతో దీర్ఘకాలంగా ఉన్న మూత్రపిండాల వ్యాధులు, ఫెయిల్యూర్స్‌ను నివారించ వచ్చునని నిపుణులు వెల్లడించారు. ఒబెసిటీ నియంత్రణకోసం పరిగణలో ఉన్న బేరియాట్రిక్‌సర్జరీతో అప్పటికే ఉన్న కిడ్నీవ్యాధులు, రీనల్‌ఫెయిల్యూర్స్ అరికట్టవచ్చు. కార్డియోవాస్కులార్ వ్యాధులు, టైప్ 2 దయాబెటిస్ వ్యాధి, బీపీ ఒబెసిటీకి గురైన వారిలో ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంది. ఒబెసిటీ నియంత్రించేందుకుగాను ఆహార వ్యవహా రాల్లో పలుమార్పులు, జీవన విధానం, ఫార్మకలాజికల్, సర్జికల్ చికిత్సా విధానం కీలకమైనవి. యూరిన్‌లో అధికశాతం ఉన్న ప్రోటీన్లను కిడ్నీ డ్యామేజ్‌గా పరిగణించవచ్చు. స్వీడన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ గోథెన్‌బర్గ్ నిర్వహించిన అధ్యయనంలో భాగంగా 37-60 సంవత్సరాల వయసున్న 4,000 మంది రోగులపై 20సంవత్సరాలు చేపట్టిన అధ్యయనంలో పై విషయం వెల్లడైంది. వీరిలో సగంమంది వైట్‌లాస్ సర్జరీ చేయించు కోగా, మిగిలిన సగంమంది నాన్ సర్జికల్ పద్ధతుల ద్వారా చికిత్స చేయించుకోగా సర్జరీ చేయించుకున్న వారిలో మోర్టాలిటీ రేటు తగ్గు ముఖం పట్టడంతోపాటు టైప్2 దయాబెటిస్ తగ్గినట్లు రుజువైంది.

జీలకర్రతో ఉపశమనం



కడుపులో వికారంగా ఉండి పుల్లని తేపులతో బాధపడేవారు కొంచెం జీలకర్రను నమిలి రసం మింగితే ఉపశమనం కలుగుతుంది. కడుపులో నులిపురుగులను నివారిస్తుంది. దీనిని తరచూ నమిలి రసం మింగుతుంటే కడుపులో ఉన్న నులిపురుగులను నివారించడమే కాదు, ఉదర సంబంధ వ్యాధులు కూడా తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. జీలకర్రను కషాయంగా కాచి తాగుతుంటే ఎలర్జీ వల్ల కలిగే బాధలు తగ్గుతాయి. నల్ల జీలకర్ర కషాయాన్ని సేవిస్తే షుగర్, బీపీని అదుపులో ఉంచుతుంది. గుండె నొప్పులు రాకుండా కాపాడుతుంది. డయేరియాతో బాధపడేవారు ఒక టీస్పూన్ జీలకర్ర నీటితో తీసుకుని ఒక టీస్పూన్ కొత్తిమీర, రసం, జీలకర్ర, చిటికెడు ఉప్పు కలిపి తీసుకుంటుంటే డయేరియా తగ్గుతుంది. భోజనం తర్వాత ఇలా రెండు సార్లు తీసుకోవాలి. నల్ల జీలకర్ర మూలశంకు మంచి మందు. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు నల్లజీలకర్రను వేయించి మగ్గిన అరటి పండుతో తీసుకుంటే నిద్రలేమి సమస్య పరిష్కారం అవుతుంది.


ముంజల్ యూనివర్సిటీలో నూతన కోర్సులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రముఖ హీరో గ్రూప్‌నకు చెందిన బీఎంఎల్ ముంజల్ యూనివర్సిటీ (బీఎంయూ) తాజాగా రెండు నూతన కోర్సులను ప్రవేశపెట్టింది. హర్యానాలోని గుర్‌గావ్‌లో ఉన్న బీఎంఎల్ ముంజల్ యూనివర్సిటీ తాజాగా ఎంబీఏ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్టిమెంట్ బ్యాంకింగ్, బీబీఏ ఇన్ ఫ్యామిటీ బిజినెస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఫైనాన్స్ అండ్ బ్యాంకింగ్‌లో కెరియర్ ఎంచుకునేవారికి ఎంబీఏ ఉపకరిస్తుందని వర్సిటీ పేర్కొంది.

ఇంజనీరింగ్ విద్యార్థులకు
వెర్‌టెక్స్ 8.0 నైపుణ్య ప్రతిభ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: అంతర్ కళాశాలల జాతీయ స్థాయి సాంకేతిక వేడుక వెర్‌టెక్స్8.0 ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం నిర్వహించే ఈ వెర్‌టెక్స్ ఫెస్టివల్‌లో రోబోటిక్స్, ఎలక్ట్రిక్ కార్ట్ ఛాలెంజ్, పాకెట్ బైక్ రేసింగ్, ఆండ్రాయిడ్ యాప్స్, పజిల్ చాంప్ వంటి 200కు పైగా సాంకేతికపరమైన పోటీలు నిర్వహిస్తుంది. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు లక్షల్లో నగదు బహుమతి అందజేయనున్నట్లు వెర్‌టెక్స్ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఈవెంట్స్‌లో 2500 మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు. 200కు పైగా కళాశాలలు పాలు పంచుకున్నాయి. ఏరోనాటికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, సివిల్ ఇంజినీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేకానికల్, టోమేషన్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ విభాగాల్లో సరికొత్త ప్రమాణాలు సృష్టించడానికి సవాళ్లను ఆహ్వానించే విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది.

బ్రెస్ట్ కేన్సర్‌పై కొరవడిన అవగాహన



లండన్ : ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటైన బ్రెస్ట్ కేన్సర్‌ను భారత్‌లోని గ్రామీణ మహిళలు నిర్లక్ష్యం చేస్తున్నట్లు అధ్యయనాల్లో తేలింది. ఈ వ్యాధి లక్షణాల గురించి గ్రామాల్లో ఉండే మహిళల్లో చాలా మందికి అవగాహన లేకపోవడం, వైద్యం ఖర్చుతో కూడుకొన్నది కావడం కూడా ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. గ్రామీణ మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్‌పై అప్రమత్తత ఎంతైనా అవసరమని స్వీడన్‌లోని ఉమే యూనివర్సిటీ డాక్టోరల్ విద్యార్థి నితిన్ గంగనే అభిప్రాయపడ్డారు. తాను నిర్వహించిన అధ్యయనాల్లో వెల్లడైన వాస్తవాలు నిరాశాజనకంగా ఉన్నాయన్నారు. ఈ వ్యాధిని ఏ విధంగా గుర్తించాలన్నది భారతీయ మహిళల్లో చాలా మందికి తెలియదని, స్వీయ పరీక్షలు నిర్వహించుకొనే పద్ధతిపై వారికి ఏ మాత్రం అవగాహన లేదని అన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఒక వేళ తెలిసినా వైద్యం ఖరీదైనది కావడం వల్ల కూడా కొంత మంది దీనిని నిర్లక్ష్యం చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఏదిఏమైనా గ్రామీణ మహిళల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. నిరక్షరాస్యత, నిర్లక్ష్యం, పేదరికం, మూఢనమ్మకాల కారణంగా చాలా మంది మహిళలు చివరి దశ వరకు వైద్యులను ఆశ్రయించడం లేదని ఆయన తెలిపారు. నితిన్ మహారాష్ట్ర వార్ధాలోని గ్రామీణ జిల్లాల మహిళలపై రెండు అధ్యయనాలు చేపట్టారు. మొదటి అధ్యయనంలో వెయ్యి మంది మహిళలను ఇంటర్వ్యూ చేసి, సామాజిక ఆర్థిక అంశాలు, బ్రెస్ట్ కేన్సర్ గురించి వారికి అసలేం తెలుసని ఆరా తీశారు. రెండో అధ్యయనంలో భాగంగా అదే జిల్లాలో పేషంట్ స్టడీ చేపట్టి 212 మందికి బ్రెస్ట్ కేన్సర్ ఉన్నట్టు గుర్తించారు. సగటున ముగ్గురిలో ఒకరికి బ్రెస్ట్ కేన్సర్ అంటే ఏమిటో కూడా తెలియదని, ఈ వ్యాధి గురించి తెలుసుకునేందుకు వారంతా ఆసక్తి కనబర్చారని నితిన్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత్‌లో తక్షణమే జాతీయస్థాయి బ్రెస్ట్ కేన్సర్ అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించాలని, ముఖ్యంగా గ్రామాల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచడం అత్యవసరమని ఆయనన్నారు.

మెసేంజర్‌లో మీకు తెలియని ఫీచర్స్ ఇవే..

బోలెడు పనులు

మీ కంప్యూటర్‌లో మెసేంజర్‌గా వాడుకోవచ్చు.

మీరు ఫేస్ బుక్ అప్ డేట్స్‌తో విసిగిపోయారా. కేవలం మీ ఫ్రెండ్స్ షేర్ చేసే న్యూస్ ఫీడ్, ఫొటోస్ మాత్రమే కాదు. మెసెంజర్ డాట్ కామ్ లోకి వెళ్లి మీ కంప్యూటర్ లో మెసెంజర్‌ను ఇన్ స్టాల్ చేసుకుంటే మీ ఫ్రెండ్స్ లిస్ట్‌లోని ఆన్ లైన్‌లో ఉన్న వ్యక్తులతో చాట్ చేసుకోవచ్చు. దీన్ని డెస్క్ టాప్ ఐకాన్ సెట్ చేసుకొని ఎంచక్కా మెసెంజర్ సర్వీసులను పొందవచ్చు.

డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకునే సౌకర్యం..

ప్రస్తుతం డిజిటల్ మీడియా ద్వారా డబ్బు పంపుకోవడం చాలా సులభంగా మారింది. అయితే ఫేస్ బుక్ కూడా ఓ పేమెంట్ గేట్ వేగా వాడుకోవచ్చు. ముఖ్యంగా వెన్మో యాప్ ద్వారా మీ డెబిట్ లేదా క్రెడిట్ కార్డులను అటాచ్ చేసుకొని మనీ ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం ఉంది. ముందుగా మీ డెబిట్ కార్డును ప్రొఫైల్‌కు అటాచ్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రొఫైల్ ౧ పేమెంట్స్ ౧ యాడ్ న్యూ డెబిట్ కార్డ్ ఆప్షన్స్‌ను క్లిక్ చేయడం ద్వారా మీరు ఈ పేమెంట్ గేట్ వేను వాడుకునే అవకాశం ఉంది.

ప్రొఫైల్ కోడ్ ద్వారా ఫ్రెండ్స్‌ను యాడ్ చేసుకునే అవకాశం.

మీకు నచ్చిన వారిని ఫ్రెండ్ చేసుకోవాలని ఉందా. అయితే ఫ్రెండ్ రిక్వెస్ట్‌తో సంబంధం లేకుండా కూడా యాడ్ చేసుకోవచ్చు. యూనిక్ ప్రొఫైల్ కోడ్ క్రియేట్ చేసుకొని స్కాన్ చేసుకోవడం ద్వారా యాడ్ చేసుకోవచ్చు. ముందుగా మీ ప్రొఫైల్ ఐకాన్‌ను క్లిక్ చేయగానే టాప్ లెఫ్ట్ కార్నర్‌లో యాప్ కనిపిస్తుంది. ప్రొఫైల్ పిక్చర్‌ను మధ్యలో క్లిక్ చేయగానే. మధ్యలో ప్రెస్ మై కోడ్ అని కనబడుతుంది. దాన్ని క్లిక్ చేయగానే స్కాన్ కోడ్ వస్తుంది. దాన్ని స్కాన్ చేయడం ద్వారా ఎవరైనా మిమ్మల్ని ఫ్రెండ్ చేసుకునే వీలు కలుగుతుంది.

గేమ్స్ ఆడుకోవచ్చు

ఫేస్ బుక్ ద్వారా గేమ్స్ ఆడుకునే వీలుంది. ఇందులోని ప్రీలోడెడ్ గేమ్ యాప్స్ ద్వారా అన్ లిమిటెడ్ వినోదం పొందవచ్చు. మీరొక్కరే కాదు. ఇందులో వేరే ప్రొఫైల్ వారితో కూడా గేమ్స్ ఆడవచ్చు. పాక్ మ్యాన్, స్నేక్ వంటి బేసిక్ గేమ్స్‌తో పాటు ఛాలెంజ్ గేమ్స్ వరకూ అనేక గేమ్స్ అందుబాటులో ఉన్నాయి. మీకు జోడీ కావాలనుకుంటే జోడీతో, ఒంటరిగా ఆడాలి అనుకుంటే ఒంటరిగా ఆడుకునే వీలుంది.

బాట్స్‌తో చాట్ చేసుకునే అవకాశం..

చాట్ బాట్స్ ఇప్పుడు ఆటోమేటిగ్గా మీకు ఎలాంటి సమాచారాన్నైనా అందించే చాట్ బాట్స్ ఎన్నో మెసెంజర్స్‌లో అందుబాటులోకి వచ్చాయి. మీకు కావాల్సిన న్యూస్, సలహాలు, అడ్రస్‌లు, సూచనలు అప్ డేట్స్ ఇలా ఒకటేమిటీ సమస్తం మీతో పంచుకోవడానికి ఈ ఆటోమేటిక్ చాట్ బాట్స్ సిద్ధంగా ఉన్నాయి.



> సోషల్ మీడియా నేడు అత్యంత వేగంగా వ్యాప్తి చెందుతున్న మాధ్యమం. ముఖ్యంగా ఫేస్ బుక్ నేడు ప్రతి ఒక్కరి జీవితంలో భాగస్వామిగా మారిపోయింది. ముఖ్యంగా యువత దీనికి బానిసలై పోయారు. పొద్దున లేచినప్పటి నుంచి పడుకునేవరకు ఫేస్ బుక్ వేదికగా అన్ని షేర్ చేసుకుంటున్నారు. సుమారు 130 కోట్ల మంది ప్రపంచవ్యాప్తంగా ఫేస్‌బుక్ వాడుతున్నారు అంటే అతిశయోక్తి కాదేమో. అయితే ప్రతి ఒక్కరు ఫేస్ బుక్‌ను పూర్తిగా వాడుతున్నారా అంటే అనుమానమే. ఫేస్ బుక్ అంటే కేవలం కామెంట్స్ పోస్ట్ చేయడం, ఫొటోలు షేర్ చేయడమేనా అంటే కాదని దీనితో బోలెడు పనులు చేయచ్చంటున్నారు టెక్ సేవీలు.

గోప్యంగా చాటింగ్..

వాట్సప్ తరహాలోనే ఎండ్ టు ఎండ్ ఎన్ క్రిప్షన్‌తో చాటింగ్ చేసుకునే వీలుంది. దీంతో మీ చాటింగ్ మధ్యలోకి మూడో వ్యక్తి దూరకుండా వీలు కలిగింది. చాట్ బాక్స్‌లో కుడివైపు కార్నర్‌లో ఉన్న ఆప్షన్‌ను క్లిక్ చేయగానే మీ చాట్ గోప్యంగా ఉందో లేదో ఇట్టే గుర్తు పట్టేయొచ్చు.

మీ చాట్ ను కస్టమైజ్ చేసుకోండిలా..

ఫేస్‌బుక్ లో మీ చాటింగ్ ను సరదాగా మార్చేందుకు ఎన్నో సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. మీ గ్రూప్ చాట్ బాక్స్ కలర్ మార్చుకోవచ్చు. అలాగే మీ ఫ్రెండ్స్‌కు నిక్ నేమ్స్ ఇవ్వచ్చు. ఇలాగే మీ గ్రూప్ అంతటికి కలిపి ఒక ఇమోజీ ఏర్పాటు చేసుకోవచ్చు.

సమాచారం తెలుసుకోండిలా...


ఫేస్ బుక్ మెసెంజర్ కేవలం చాటింగ్, షేరింగ్ కే పరిమితమా అంటే కానే కాదు. మీ ఫ్రెండ్స్‌కు మెసెంజర్ ద్వారా బోలెడు సాయం చేయవచ్చు. ఉదాహరణకు వారు ఏదైనా ప్రయాణంలో ఉంటే వారు ఉన్న ప్రదేశంలోని హోటల్స్, రెస్టారెంట్స్, దర్శనీయ స్థలాలకు సంబంధించిన వివరాలను మీరు షేర్ చేయవచ్చు. అలాగే సాంగ్స్, న్యూస్ అప్ డేట్స్ లాంటివి కూడా పంచుకోవచ్చు.

స్క్రిబుల్ చాట్..

టైప్ చేసి చేసి బోర్ కొట్టేస్తోందా... అయితే స్క్రీన్ పై మీరు పెన్‌తో రాసినట్టు రాయండి. అదే త్రీడీ యానిమేషన్ లుక్ తో మెసేజ్ సెండ్ అవుతుంది. దీన్నే స్క్రిబుల్ చాట్ అంటారు. ఇందులో చాలా రకాల ఆప్షన్స్ ఉన్నాయి.

ఆడియో క్లిప్ పంపడం..

మీకు నచ్చిన పాట, లేదా, మాట, సందేశం ఇలా ఏదైన సరే చాట్ బాక్స్ ద్వారా రికార్డ్ చేసి పంపే సదుపాయం ఫేస్ బుక్ మెసెంజర్‌లో ఉంది. సరిగ్గా మీరు టైప్ చేసే బాక్స్ పక్కనే ఉన్న రికార్డింగ్ బటన్ ప్రెస్ చేయడం ద్వారా పంపవచ్చు. అంతేకాదు ఫైల్ అటాచ్‌మెంట్స్ ద్వారా కూడా ఆడియో క్లిప్స్ పంపవచ్చు.



దూసుకొస్తున్న లైఫై..

వైఫై ఇక కనుమరుగే!



ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫిలిప్స్ సరికొత్త టెక్నాలజీతో దూసుకొస్తోంది. వైఫై ఇక చరిత్రపుటల్లోకి జారుకోనుంది. ఇకపై మనం వైఫై కాదు, లైఫై (LiFi)ని వాడుకోవాలి. ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఫిలిప్స్ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాజాగా ఆవిష్కరించింది. దీంతో త్వరలో లైఫై టెక్నాలజీ మనకు అందుబాటులోకి రానుంది. దీని ద్వారా సురక్షితమైన, వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను పొందేందుకు వీలుంటుంది. మరి అదెలా ఉండబోతోంది. దాని ఫీచర్లు ఎలా ఉండబోతున్నాయి అనేదానిపై చాలామందికి సందేహాలు రావచ్చు. ఈ వివరాలు తెలుసుకుందాం.

లైఫై ఎలా పనిచేస్తుంది

వైఫై టెక్నాలజీ అంటే వైర్‌లెస్ తరంగాల ఆధారంగా పనిచేసే టెక్నాలజీ అని అందరికీ తెలిసిందే. అయితే లైఫై కాంతి తరంగాల ఆధారంగా పనిచేస్తుంది. అంటే ప్రత్యేకంగా తయారు చేయబడిన ఎల్‌ఈడీ లైట్లలో మోడెమ్‌ను అమరుస్తారు.

లైట్లను ఆన్ చేసినప్పుడు..

ఈ క్రమంలో లైట్లను ఆన్ చేసినప్పుడు ఆ మోడెమ్ నుంచి కాంతి తరంగాలు లైట్ల ద్వారా బయటకు వస్తాయి. ఇక స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌కు అమర్చబడిన ప్రత్యేకమైన యూఎస్‌బీ డాంగిల్ ఆ కాంతి తరంగాలను గుర్తించి వాటిని ఇంటర్నెట్ తరంగాలుగా మార్చి డివైస్‌లకు ఇంటర్నెట్‌ను అందిస్తుంది. ఇలా లైఫై పనిచేస్తుంది.

లైఫై ఉపయోగాలు

వైర్‌లెస్ తరంగాలు వాడేందుకు వీలుకాని చాలా వరకు ప్రదేశాల్లో లైఫైని సులభంగా వాడవచ్చు. దీంతోపాటు ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానం వినియోగదారులకు పూర్తి సెక్యూరిటీని అందిస్తుంది. గోడల ద్వారా వైఫై బయటకు కూడా ప్రసారం అవుతుంది. కానీ లైఫై కేవలం ఒకే చోట ఉంటుంది. ఇతరులు దాన్ని యాక్సెస్ చేయలేరు

ఇది వైఫై ప్రయాణించినట్లు గోడల ద్వారా ప్రయాణించదు. దీంతో లైఫై ద్వారా వచ్చే ఇంటర్నెట్‌కు సెక్యూరిటీ ఉంటుంది. ఇతరులు దాన్ని యాక్సెస్ చేయలేరు. కార్పొరేట్ కార్యాలయాల్లో, ఇతర సంస్థల్లో లైఫై ద్వారా ఇంటర్నెట్‌ను వాడితే అది సురక్షింగా ఉండడమే కాదు, సుస్థిరమైన, వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తుంది.

ప్రస్తుతానికి 30 ఎంబీపీఎస్ స్పీడ్

కాగా ఈ లైఫై టెక్నాలజీ ప్రస్తుతానికి 30 ఎంబీపీఎస్ స్పీడ్ మీద ప్రయాణించే అవకాశం ఉంది. అయితే ఇది అంత వేగం కాకపోయినప్పటికీ ముందు ముందు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఈ వేగం మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఫిలిప్స్ ఆవిష్కరించిన ఈ లైఫై టెక్నాలజీ ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది. త్వరలో పూర్తి స్థాయిలో వాణిజ్యపరమైన వినియోగానికి అందుబాటులోకి రానుంది.

అప్పుడే దీన్ని సృష్టించా : అల్లు అర్జున్



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్ ఎప్పుడూ హిట్టే. 'ఆర్య' చిత్రం నుంచి మొన్నవిడుదలైన 'దువ్వాడ జగన్నాథమ్' వరకూ అన్ని పాటలకు విశేష ఆదరణ లభించింది.ఈ విషయాన్ని బన్నీ చాలా సార్లు వెల్లడించారు. అయితే దేవిశ్రీ ప్రసాద్‌ను గుర్తు చేసుకుంటూ తాజాగా బన్నీ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'మనం వాయించేది కాదు మనం చెప్పేదే గొప్ప పాట అవుతుంది. ఈ వాక్యాన్ని దేవిశ్రీ సంగీతం విన్నాక సృష్టించాను.' అని క్యాప్షన్ ఇస్తూ దేవిశ్రీ పియానో వాయిస్తున్న ఫొటోను పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పై తాజాగా దేవిశ్రీ స్పందించారు. 'ఈ లవ్లీ పోస్ట్ పెట్టినందుకు థాంక్యూ సో మచ్ మై డియరెస్ట్ ఫ్రెండ్. సారీ..కాస్త ఆలస్యంగా చూశాను. హౌ స్వీట్ ఆఫ్ యూ బన్నీ బాయ్' అని ట్వీట్ చేశారు దేవిశ్రీ. బన్నీ ప్రస్తుతం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' చిత్రంలో నటిస్తున్నారు. వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మేలో విడుదల కాబోతోంది. మరోపక్క దేవిశ్రీ 'భరత్ అనే నేను', 'రంగస్థలం' చిత్రాలకు బాణీలు అందిస్తున్నారు. మహేశ్-వంశీ పైడిపల్లి దర్శకత్వంలో వస్తున్న ఓ సినిమాకు కూడా దేవిశ్రీనే సంగీతం అందిస్తున్నారు.



పక్కా మాస్‌గా కల్యాణ్‌రామ్

> సినిమా పేరు : ఎం.ఎల్.ఎ
> నటీనటులు : కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్, పోసాని కృష్ణ మురళి, జయ ప్రకాశ్‌రెడ్డి, రవి కిషన్ తదితరులు
> సంగీతం : మణిశర్మ
> నిర్మాతలు : కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి, విశ్వ ప్రసాద్
> ఛాయాగ్రహణం : ప్రసాద్ మూరెళ్ల
> కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : ఉపేంద్ర మాధవ్



తొలి నుంచీ కమర్షియల్ సినిమాలకే ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు కల్యాణ్ రామ్. ఆయన చేసిన సినిమాల్లో చాలా మటుకు పక్తు కమర్షియల్ కథలే ఉన్నాయి. 'ఇజం', 'పటాస్' ఈ కోవకు చెందినవే. ఇప్పుడు 'ఎం.ఎల్.ఎ' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చారు. మంచి లక్షణాలు ఉన్న అబ్బాయిగానే కాకుండా ఎమ్మెల్యే గానూ మెప్పిస్తానని ప్రచార కార్యక్రమాల్లో వెల్లడించారు. మరి ఈ అబ్బాయి ప్రేక్షకులకు నచ్చుతాడా? ఈ సినిమాతో కల్యాణ్ రామ్ మరో హిట్ అందుకుంటారా? చూద్దాం.

ఓ సందర్భంలో కల్యాణ్(కల్యాణ్‌రామ్) ఇందు (కాజల్)ను చూస్తాడు. ఆమెను చూసిన వెంటనే ప్రేమిస్తాడు. కానీ ఇందు.. కల్యాణ్ నుంచి తప్పించుకుని తిరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో ఇందు ఓ సమస్యలో ఇరుక్కుంటుంది. ఆ సమస్య నుంచి తన తెలివితేటలతో బయటపడేస్తాడు కల్యాణ్. ఈ తరుణంలో ఇందుకి కల్యాణ్‌పై ప్రేమ పెరుగుతుంది. ఇందు నాన్న జయప్రకాశ్‌రెడ్డి ఎమ్మెల్యేని అల్లుడిగా చేసుకోవాలనుకుంటాడు. కానీ ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గాడప్ప(రవి కిషన్) బాధ్యతలు నిర్వర్తిస్తుంటాడు. దాంతో ఇందును గాడప్పకి ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. ఈ నేపథ్యంలో కల్యాణ్ వచ్చి ఇందుని ప్రేమిస్తున్నానంటాడు. అది విని 'నువ్వు కూడా ఎమ్మెల్యే అవ్వు' అని కల్యాణ్‌తో చెప్తాడు జయప్రకాశ్. దాంతో ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ఎమ్మెల్యే అవుతానని చెప్పి కల్యాణ్.. గాడప్పతో ఛాలెంజ్ చేస్తాడు. మరి ఆ ఛాలెంజ్‌లో కల్యాణ్ ఎలా నెగ్గాడు? ఇందుని పెళ్లి చేసుకున్నాడా? అన్న విషయాలు తెరపై చూడాలి. ఇదో కమర్షియల్ సినిమా. ప్రతీదీ కమర్షియల్‌గానే సాగుతుంది. ప్రథమార్థంలో కథేమీ ఉండదు. కేవలం ఇందుని ఇంప్రెస్ చేయడానికి కల్యాణ్ పడే తాపత్రయం కనిపిస్తుంది. కల్యాణ్ పాత్రను మంచి లక్షణాలన్న అబ్బాయిగా చూపించడానికి తొలి సగాన్ని వాడుకున్నాడు దర్శకుడు. కబ్జా అయిన ఇందు ఆస్తిని తిరిగి రప్పించడానికి కల్యాణ్ వేసే ప్లాన్, దాన్ని అమలు పరిచే తీరు లాజిక్‌కి దూరంగా ఉన్నా ఫన్నీగా అనిపిస్తుంది. ప్రేక్షకులకు కావాల్సిన వినోదం ఆ ఎపిసోడ్‌లో దొరకుతుంది. ద్వితీయార్థం పూర్తిగా ఎమ్మెల్యే అవడానికి కల్యాణ్ చేసే ప్రయత్నం నుంచే మొదలవుతుంది. కమర్షియల్ విలువలతో పాటు చిన్న పిల్లలు చదువుకోవాలి తప్ప పనికి వెళ్ల కూడదు అనే మంచి పాయింట్‌ని చూపించాడు. ప్రతి సన్నివేశం ఊహకు అందుతూ సాగుతుంటుంది. కానీ వినోదం మాత్రం ఖాయం. చాలా సన్నివేశాలు లాజిక్‌కు దూరంగా ఉంటాయి. పాటలు, ఫైట్‌లు, పంచ్ డైలాగులు కమర్షియల్‌గానే సాగాయి. మొత్తంగా చూస్తే ఇది తెలిసిన కథే. కమర్షియల్ విలువలు జోడించి వినోదాత్మకంగా తెరకెక్కించాడు దర్శకుడు. 'పటాస్' నుంచి కల్యాణ్‌లోఈజ్ మరింత పెరిగింది. ఈ సినిమాలో అది కనిపిస్తుంది. వినోదం, భావోద్వేగ సన్నివేశాల్లో అతని నటన ఆకట్టుకుంటుంది. స్టైల్, దుస్తులు కూడా కొత్తగా ఉన్నాయి. కాజల్ అందంగా కనిపించింది. తన పాత్రకీ ప్రాధాన్యం ఉంది. కానీ ద్వితీయార్థంలో కేవలం పాటలకే పరిమితమైంది. 'రేసుగుర్రం' తర్వాత రవికిషన్‌కి ఆ స్థాయి పాత్ర దక్కింది. విలన్‌గా మెప్పించాడు. తొలి సగంలో వెన్నెల కిశోర్ ద్వితీయార్థంలో ప ృథ్వీ వినోదాన్ని పంచుతారు. పోసాని క ృష?మురళి సంభాషణలు అతిగా అనిపిస్తాయి. మణిశర్మ అందించిన బాణీలు బాగున్నాయి. యాక్షన్ సన్నివేశాల్లో నేపథ్య సంగీతం బాగుంది. నిర్మాణ విలువలు ఆకట్టుకున్నాయి. దర్శకుడికి ఇది తొలి సినిమా. కాబట్టి ప్రయోగాల జోలికి పోలేదు. కమర్షియల్ విలువలనే నమ్ముకున్నాడు. ప్రేక్షకులకు ఎలాంటి అంశాలు నచ్చుతాయో వాటిని మేళవించాడు.

బ్రాండ్ అంబాసిడర్‌గా ఇలియానా



గోవా బ్యూటీ ఇలియానా చేతికి ఇప్పుడు కొత్త ప్రాజెక్టు వచ్చి చేరింది. డైరక్టర్, హీరో ఎవరు అని అడిగేయకండి. ఆమె ఫిజీ దేశ పర్యాటక రంగం తరఫున ప్రచారం చేయడానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితురాలైంది. గతంలో కూడా పరిణితీ చోప్రా ఆస్ట్రేలియా, సిదార్థ్ మల్హోత్రా న్యూజిల్యాండ్ తరఫున బ్రాండ్ అంబాసిడర్లుగా నియమితులయ్యారు. ఆ జాబితాలో ఇప్పుడు ఇలియానా కూడా చేరింది. 'అందాల దేశం ఫిజీతో కలిసి పనిచేయనుండటం ఆనందంగా ఉంది. వారి ఆతిథ్యం, ప్రేమ నాకు సొంతింటిలో ఉన్న ఫీలింగ్ కలిగించింది. ఇంకా చాలా ప్రదేశాలు చూసిన తరవాత తిరిగి రావడం గురించి ఆలోచిస్తాను' అని ఆమె తెలిపింది. భారత్, ఫిజీల మధ్య బలమైన సాంస్కృతిక సంబంధాలున్నాయి. ఆ దేశంలో నివసిస్తున్న దాదాపు 38 శాతం ప్రజలు భారత సంతతికి చెందిన వారే. గత కొన్ని సంవత్సరాలుగా ఫిజీలో పర్యటించే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. 'భారతీయ పండగలైన దీపావళి, వినాయక చవితి కూడా జరుపుకొంటాం. ఇలియానా బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వల్ల ఇంకా మా దేశంలో పర్యటించే భారతీయుల సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాం' అని ఫిజీ పర్యాటక శాఖ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

లండన్‌లో మరో 'బాహుబలి'

దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన 'బాహుబలి' చిత్రంలో 'అమరేంద్ర బాహుబలి', 'మహేంద్ర బాహుబలి'గా నటించి, మెప్పించిన ప్రభాస్‌కు మరో అరుదైన గౌరవం దక్కనుంది. ఇటీవల బాహుబలి గెటప్‌లో ఉన్న ప్రభాస్ విగ్రహాన్ని బ్యాంకాక్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. ఇప్పుడు ప్రధాన శాఖ అయిన లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మరో 'బాహుబలి' మైనపు విగ్రహం రూపొందించబోతున్నారట. మరోపక్క 'కట్టప్ప' సత్యరాజ్ మైనపు విగ్రహాన్ని కూడా మేడమ్ టుస్సాడ్స్‌లో ఉంచనున్న సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని సత్యరాజ్ కుమారుడు సిబిరాజ్ సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. ప్రస్తుతం ప్రభాస్ 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. సుజీత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ నటి శ్రద్ధా కపూర్ కథానాయిక.

ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానంలో 'భరత్'

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కైరా అడ్వాణీ కథానాయిక. ఇటీవల 'భరత్' విజన్ పేరిట విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించింది. టాలీవుడ్‌లోనే అత్యధిక లైక్స్ సాధించిన టీజర్‌గా రికార్డు స ృష్టించిన ఈ టీజర్ ఇప్పుడు మరో రికార్డు సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మంది లైక్ చేసిన టీజర్లలో రెండో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు ఈ టీజర్‌ను 6,40,000 మంది లైక్ చేశారు. తొలి స్థానంలో హాలీవుడ్ చిత్రం 'కెప్టెన్ అమెరికా: సివిల్ వార్' ఉంది. 6,58,000 మంది ఈ టీజర్‌ను లైక్ చేశారు. ఈ విషయాన్ని చిత్ర వర్గాలు సోషల్‌మీడియా ద్వారా వెల్లడించాయి.

డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దానయ్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఏప్రిల్20న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా తర్వాత మహేశ్ వంశీపైడిపల్లి దర్శకత్వంలో నటిస్తారు. ఇందులో మహేశ్‌కి జోడీగా పూజా హెగ్డే నటిస్తున్నారు.

'ఎంత సక్కగున్నావే' ప్రోమో విడుదల



లెక్కల మాస్టారు సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం రంగస్థలం. మార్చి 30న విడుదల కానున్న ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. ఒకవైపు చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన రామ్ చరణ్, సమంతలు ఇంటర్వ్యూలతో హోరెత్తిస్తుంటే మరో వైపు మేకర్స్ ప్రోమో వీడియోస్ తో అభిమానులని హుషారెత్తిస్తున్నారు.

ఇటీవల సినిమాలోని రంగా రంగా రంగస్థలాన.. సాంగ్ ప్రోమో వీడియోని విడుదల చేసిన టీం కొద్ది సేపటి క్రితం ఎంత సక్కగున్నావే సాంగ్ ప్రోమోని రిలీజ్ చేసింది. ఇందులో సమంత, రామ్ చరణ్ లుక్స్ ఫ్యాన్స్ కి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. దేవి శ్రీ ప్రసాద్ రంగస్థలం చిత్రానికి సంగీతం అందించగా, ఆయన సంగీత సారధ్యంలో రూపొందిన పాటలు ఇప్పటికే విడుదలైన మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. ఆది పినిశెట్టి, జగపతి బాబు, అనసూయ ముఖ్య పాత్రలు పోషించారు.

టాక్సీవాలా ఫస్ట్ గేర్

టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ తన తర్వాతి చిత్రం టాక్సీవాలా ఫస్ట్ లుక్ ఇచ్చేశాడు. టాక్సీవాలా ఫస్ట్ గేర్ పేరుతో ఓ చిన్న వీడియో బైట్‌ను వదిలారు. ఫుల్ జోష్‌తో టాక్సీలో దూసుకెళ్తున్న విజయ్ లుక్కును రివీల్ చేశారు. జేక్స్ బెజోయ్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకునేలా ఉంది. ఎస్‌కేఎన్, గీతా ఆర్ట్స్ బ్యానర్, యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని రాహుల్ సంక ృత్యన్ డైరెక్ట్ చేస్తున్నాడు. టీజర్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు. ఈ సినిమాలో విజయ్ క్యాబ్ డ్రైవర్ రోల్‌లో కనిపించబోతుండగా.. మాళవికా నాయర్, షార్ట్ ఫిలింస్ బ్యూటీ ప్రియాంక జవల్కర్‌లు హీరోయిన్‌లుగా నటిస్తున్నారు.

జీనత్ అమన్ కేసులో.. వ్యాపారవేత్త అరెస్టు



ముంబై : సీనియర్ నటి జీనత్ అమన్‌పై లైంగిక దాడి చేయడమే కాకుండా రూ.15కోట్లకుపైగా మోసం చేసినట్లు ఆరోపణలు ఉండడంతో ముంబైకి చెందిన వ్యాపారవేత్తను అరెస్టు చేశామని పోలీసులు శుక్రవారం తెలిపారు. నిందితుడు సర్ఫరాజ్ అలియాస్ అమన్ ఖన్నాను గురువారం రాత్రి అదుపులోకి తీసుకొన్నామన్నారు. తనపై అత్యాచారం జరిగినట్లు జీనత్ అమన్ గురువారం జుహూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని స్థానిక కోర్టులో ప్రవేశ పెట్టామన్నారు. ఈ వ్యవహారాన్ని క్రైంబ్రాంచ్‌కు అప్పగించామని, విచారణ కొనసాగుతోందని డీసీపీ (క్రైం) నిసార్ తంబోలి చెప్పారు. ఖన్నా (38) తనను వెంబడిస్తూ.. వేధిస్తున్నాడని జీనత్ జనవరిలోనూ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఈ తదుపరి నెలలో అతను అరెస్టు అయ్యాడని, ఆపై బెయిల్‌పై విడుదలయ్యాడని తెలిపారు. ప్రాపర్టీ డీల్ నెపంతో తన వద్ద నుంచి రూ.15.40 కోట్లను ఖన్నా దండుకొన్నట్లు తాజా ఫిర్యాదులో జీనత్ అమన్ (68) పేర్కొన్నట్లు డీసీపీ చెప్పారు. ఈ నేరాలు 2010-15 మధ్యకాలంలో జరిగాయని, తదుపరి విచారణ కోసం కేసును క్రైంబ్రాంచ్ యూనిట్ 9కు అప్పగించామని అన్నారు. ఖన్నాపై రేప్, మోసంతో సహా ఐపీసీలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదైనట్లు డీసీపీ తంబోలి తెలిపారు.

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- కేంద్ర నోటిఫికేషన్ చట్టవిరుద్ధం
- లాభదాయక పదవుల అంశాన్ని పున: పరిశీలించండి ఈసీని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు
- ఇది నిజాయతీ సాధించిన విజయం : కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యేలకు భారీ ఊరట లభించింది. లాభదాయక పదవుల కేసులో ఆ పార్టీ 20 మంది ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత వేటును తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. లాభదాయక పదవుల అంశాన్ని మరోసారి పరిశీలించాలని ఎన్నికల కమిషన్(ఈసీ)ని న్యాయస్థానం ఆదేశించింది. ఆప్ ఎమ్మెల్యేలు అనర్హులుగా కేంద్రం నోటిఫికేషన్ ఇవ్వడం చట్టవిరుద్ధమని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, చంద్రశేఖర్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. అనర్హతకు గురైన ఎమ్మెల్యేల అభ్యర్థనను ఎన్నికల కమిషన్‌కు తిరిగి పంపించింది. అనర్హతపై ఈసీ సిఫార్సు 'చెరుపు' చేసేదిగా ఉందని పేర్కొంటూ, ఇది సహజ న్యాయ ఉల్లంఘన అని బెంచ్ తెలిపింది. ఢిల్లీ శాసనసభలోని సభ్యులను అనర్హులుగా ప్రకటించడానికి ముందు ఎమ్మెల్యేలకు వారి వాదన వినిపించే అవకాశం ఇవ్వలేదని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. '2018, జనవరి 19న భారత ఎన్నికల కమిషన్ అభిప్రాయం(భారత రాష్ట్రపతికి ఇచ్చిన) సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా నడుచుకోవడంలో విఫలమైంది. ఇది చట్టవిరుద్ధం, భంగపరిచేది' అని కోర్టు తెలిపింది.

లాభదాయక పదవుల అంశంపై ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల పట్ల ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఇది నిజాయితీ సాధించిన విజయమని అభివర్ణించారు. 'ఎన్నికయిన ప్రజాప్రతినిధులపై తప్పుడు అనర్హత వేటు వేశారు. ఢిల్లీ ప్రజలకు హైకోర్టు న్యాయం చేసింది. ఇది ఢిల్లీ ప్రజల విజయం' అని ఆప్ అధ్యక్షుడు ట్వీట్ చేశారు. 'ఈ అంశంపై ఎమ్మెల్యేల వాదనలు వినే అవకాశం ఇవ్వడంలో వైఫల్యం చెందడం ద్వారా సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించింది' అని ఈసీ అభిప్రాయాన్ని కొట్టిపారేస్తూ తన 79 పేజీల ఆదేశాల్లో హైకోర్టు బెంచ్ పేర్కొంది. 'భారత ఎన్నికల సంఘం ఎమ్మెల్యేల వాదనలను విడిగా వినాలని ఉత్తర్వులు జారీ చేస్తున్నాం. ప్రభుత్వం క్రింద నిర్వహించే లాభదాయక పదవులను ఏవిధంగా నిర్వచించాలనే వంటి ఇతర ప్రారంభ, ముఖ్య విషయాలను అటుతర్వాత నిర్ణయించాలి' అని కోర్టు తెలిపింది. 'పార్లమెంటు కార్యదర్శులుగా నియామకంలో ఆప్ ఎమ్మెల్యేలను అనర్హులుగా చేసారో లేదో నిర్ణయించటానికి ఆ అంశాన్ని మరోసారి పరిశీలించాలి' అని ఈసీని ఆదేశించింది. కిక్కిరిసిన కోర్టు హాలులో న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తీర్పును చదివి వినిపించారు. కోర్టు ఆదేశాల అనంతరం అక్కడే ఉన్న ఆప్ ఎమ్మెల్యేలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నారంటూ తమపై అనర్హత వేటు వేయడాన్ని పార్లమెంటు కార్యదర్శులుగా నియమితులైన ఆప్ ఎమ్మెల్యేలు న్యాయస్థానంలో సవాలు చేశారు. ఈ కేసు విచారణ సమయంలో, ఈ అంశాన్ని మరోసారి పరిశీలించేందుకు ఎన్నికల సంఘానికి తిరిగి పంపుతూ ఆదేశాలు జారీ చేయాలని కోర్టును ఎమ్మెల్యేలు అభ్యర్థించారు. ఈసీ సిఫార్సుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోదం తెలిపిన తర్వాత తమపై అనర్హత వేటు వేయడాన్ని ఎమ్మెల్యేలు ఢిల్లీ హైకోర్టులో సవాలు చేశారు.

2015, మార్చిలో ఢిల్లీ ప్రభుత్వంలో మంత్రులకు పార్లమెంటు కార్యదర్శులుగా నియమించారు. దీంతో వారు లాభదాయక పదవుల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఢిల్లీ శాసనసభకు ఎన్నికయిన వెంటనే ఈ నియామకాలు జరిగాయి. అయితే ఫిబ్రవరి 7వ తేదీ నుంచి రోజువారీగా వారి అభ్యర్థనలను విన్న తర్వాత పార్లమెంటు కార్యదర్శులుగా వారి నియామకానికి వ్యతిరేకంగా 2016, సెప్టెంబరులో ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించి కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌పై స్టే విధించేందుకు జనవరి 24న న్యాయస్థానం నిరాకరించింది. ఖాళీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించడం, ఎన్నికల తేదీలను ప్రకటించడం వంటి ఎటువంటి చర్యలు చేపట్టకుండా ఢిల్లీ హైకోర్టు ఎన్నికల సంఘాన్ని నిలువరిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

జనవరి 19న 20 మంది ఆప్ ఎమ్మెల్యేలపై ఈసీ అనర్హతకు సిఫార్సు చేసింది. వీరిలో అల్కా లాంబా, ఆదర్శ్ శాస్త్రి, సంజీవ్ ఝా, రాజేష్ గుప్తా, కైలాష్ గెహ్లోట్, విజేంద్ర గార్గ్, ప్రవీణ్ కుమార్, శరద్ కుమార్, మదన్ లాల్, శివ చరణ్ గోయల్, సరితా సింగ్, నరేష్ యాదవ్, రాజేష్ రిషి, అనిల్ కుమార్, సోమ్ దత్, అవతార్ సింగ్, సుఖ్‌వీర్ సింగ్ దాలా, మనోజ్ కుమార్, నితిన్ త్యాగి, జర్నైల్ సింగ్‌లు ఉన్నారు. కాగా ఈసీ సిఫార్సు చేసిన మరుసటి రోజు ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటును రాష్ట్రపతి ఆమోదించారు.

అసెంబ్లీకి ఆప్ ఎమ్మెల్యేలు

లాభదాయక పదవుల కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యేలపై అనర్హత వేటును తొలగిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించిన తర్వాత బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు 20 మంది ఆప్ ఎమ్మెల్యేలను ఢిల్లీ శాసనసభ స్పీకర్ రామ్ నివాస్ గోయెల్ శుక్రవారం అనుమతిం చారు. ఆప్ ఎమ్మెల్యేలు అల్కా లాంబా, నితిన్ త్యాగిలు సభలోకి తొలిగా ప్రవేశించారు. త్యాగి సభలోకి ప్రవేశించగానే 'భారత్ మాతాకీ జై' అని బల్లలు చరుస్తూ ఆప్ శాసనసభ్యులు నినాదాలు చేశారు. అటుతర్వాత మిగిలిన ఆప్ ఎమ్మెల్యేలు సభలోకి వచ్చారు.

ఆరో రోజూ-అదే రచ్చ..!



- అన్నా డీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల లొల్లి
- రాజ్యసభ సోమవారానికి..
- లోక్‌సభ మంగళవారానికి వాయిదా

న్యూఢిల్లీ: ఏపీ ఎంపీలు పట్టువదలని విక్రమార్కుల్లా ఎన్డీఏ సర్కారుపై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇస్తుంటే...ఏఐడీఎంకే, టీఆర్ఎస్ సభ్యుల శిఖండి పాత్రతో ఆరో రోజు శుక్రవారం కూడా అవిశ్వాస తీర్మానంపై చర్చ జరగలేదు. ఎప్పటి మాదిరిగానే సభ ప్రారంభం కాగానే తమిళనాడు, తెలంగాణ ఎంపీల నినాదాలు.. సభ సజావుగా లేదంటూ స్పీకర్ వాయిదా వేసే దృశ్యమే మళ్లీ తెరమీద రక్తి కట్టింది. లోక్‌సభ మంగళవారానికి, రాజ్యసభ సోమవారానికి వాయిదా పడ్డాయి. శుక్రవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే షహీద్ దివస్‌కు సంబంధించి స్పీకర్ సుమిత్రా మహాజన్ కీలక ప్రకటన చేశారు. స్వాతంత్ర్య సమర యోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను జాతి గుర్తుచేసుకుంటున్నదని, వారి త్యాగాలు మరువలేనివని స్పీకర్ గుర్తుచేశారు. అమరులకు నివాళులు అర్పించిన పార్లమెంట్.. నిమిషంపాటు మౌనం పాటించింది. అమరులను తలుచుకుంటూ మౌనం వీడటానికి సూచనగా స్పీకర్ 'ఓం శాంతి..' అని అన్నారు. అప్పటికే వెల్‌లో ఉన్న టీఆర్ఎస్, ఏఐడీఏంకే సభ్యులు పెద్దగా నినాదాలు చేశారు. దీంతో స్పీకర్.. 'శాంతి తర్వాత అశాంతి..' అని చమత్కరించారు. శాంతించాలని ఎంత చెప్పినా సభ్యులు వినిపించుకోపోవడంతో సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదావేశారు. అనంతరం లోక్‌సభ మళ్లీ ప్రారంభమైంది. స్పీకర్ ప్రశ్నోత్తర సమయాన్ని కొనసాగించే ప్రయత్నం చేశారు. అన్నాడీఎంకే, టీఆర్ఎస్ ఎంపీల నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకువచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేశారు. సభాపతి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు అవిశ్వాసంపై చర్చ చేపట్టాలని ఏపీ ఎంపీలు డిమాండు చేశారు. సభ ఆర్డర్‌లో లేని కారణంగా అవిశ్వాసంపై చర్చ చేపట్టలేమని చెబుతూ స్పీకర్ సభను వాయిదా వేశారు. శుక్రవారం అవిశ్వాసంపై చర్చ జరుగుతుందని ఏపీ ఎంపీలు ఆశగా ఎదురు చూశారు. వారికి నిరాశే ఎదురైంది. అంతకుముందు టీడీపీ, వైసీపీ ఎంపీలు పార్లమెంటు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. గాంధీ విగ్రహం దగ్గర టీడీపీ ఎంపీలు ధర్నా నిర్వహించారు. టీడీపీ ఎంపీ శివప్రసాద్ పశువుల కాపరి వేషంలో నిరసన తెలిపారు. ఇక రాజ్యసభలో షహీద్ దివస్ సందర్భంగా అటు అమరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఛైర్మన్ వెంకయ్య నాయుడు ప్రశ్నోత్తరాలు చేపట్టారు. కొద్దినిమిషాలు మాత్రమే సజావుగా సాగిన సభ.. విపక్షాల ఆందోళనలతో మళ్లీ గందరగోళంగా మారింది. టీడీపీ, వైసీపీ, అన్నాడీఎంకే సభ్యులు తమ డిమాండ్లపై నిరసన తెలిపారు. సభ సజావుగా జరిగేందుకు సభ్యులు సహకరించాలని ఛైర్మన్ కోరారు. అయినా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. దీంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

లోక్‌పాల్, వ్యవసాయ దుస్థితిపై


హజారే నిరవధిక దీక్ష



43 లేఖలు రాసినా మోడీ స్పందించ లేదని వెల్లడి

న్యూఢిల్లీ : సామాజిక కార్యకర్త అన్నా హజారే కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమయ్యారు. అవినీతికి వ్యతిరేకంగా ఆయన శుక్రవారం నుంచి తన తాజా పోరాటాన్ని ప్రారంభించారు. కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని, వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ హజారే శుక్రవారం నిరవధిక నిరాహార దీక్షను ప్రారంభిం చారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని చేపట్టి లక్షలాది మంది ప్రజలను ఆయన ఆకర్షించారు. 2011లో తాను నిరసన తెలిపిన వేదిక అయిన రామ్‌లీలా మైదా నంలో హజారే తాజాగా దీక్ష చేపట్టారు. ఇక్కడి రాజ్‌ఘాట్ వద్ద మహాత్మాగాంధీ సమాధికి నివాళి అర్పించిన తర్వాత రామ్‌లీలా మైదానంలో తన నిరవధిక నిరాహార దీక్షను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ "గత నాలుగేళ్ల కాలంలో మోడీ ప్రభుత్వానికి నేను 43 లేఖలు రాశాను. కానీ వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. దేశంలో రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. కనీస మద్దతు ధరలు ప్రకటించడానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు' అని హజారే పేర్కొన్నారు. వ్యవసాయ సమస్యల పరిష్కారానికి సలహా ఇచ్చిన స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయడంతోపాటు ఎన్నికల సంస్కరణలు తీసుకువచ్చేందుకు, అవినీతి కేసుల దర్యాప్తునకు రాష్ట్రాలలో లోకాయుక్తలు, కేంద్రంలో లోక్‌పాల్ ఏర్పాటు చేయాలని హజారే డిమాండు చేస్తున్నారు. నిరసన సమయంలో ప్రభుత్వంతో చర్చలు జరుపు తానని హజారే తెలి పారు. అయితే ఒక పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం దిగి వచ్చే వరకు తన నిరవధిక నిరాహార దీక్ష 'సత్యాగ్రహ' పేరుతో కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్, మహారాష్ట్రకు చెందిన మరికొంత మంది మంత్రులు గురువారం హజారేను కలిసి కొన్ని హామీలు ఇచ్చారు. 'కానీ మిమ్మల్ని నమ్మనని చెప్పాను. ఇప్పటి వరకు మీరు ఎన్ని హామీలు అమలు చేశారు. లేదు. ఒక పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో రండి' అని ఇక్కడ హాజరైన వేలాది మందిని ఉద్దేశించి మాట్లాడుతూ చెప్పారు. 23 పంటల ధరలను నిర్ణయించే వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సీఏసీపీ) కనీస మద్దతు ధరకు స్వతంత్రంగా ఉండాలి అని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ అధీనంలో సీఏసీపీ ఉంది. రాష్ట్రాలు సూచించిన మేరకు 30 నుంచి 35 శాతం ధరలను తగ్గిస్తుందన్నారు. 'నేను గుండెపోటు కంటే దేశం కోసం చనిపోవడానికే ప్రాధాన్యత ఇస్తా' అని 80 ఏళ్ల ఈ సామాజిక కార్యకర్త పేర్కొన్నారు. "గత నెలలో హజారే కేంద్రంలో లోక్‌పాల్ నియామకం పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆసక్తి చూపడం లేదని ఆరోపించారు. ఈ నియామకంలో జాప్యానికి కారణం, ఒకసారి ఇది అమలయినట్లయితే, తన కార్యాలయంతోపాటు తన కేబినెట్‌లోని వారందరూ లోక్‌పాల్ పరిధిలోకి వస్తారని ప్రధాని భయపడుతు న్నారని హజారే అన్నారు. రామ్‌లీలా మైదానంలో హజారే చేపట్టిన దీక్షకు వేలాది మంది ప్రజలు హాజరవుతారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో ఢిల్లీ పోలీసులు దేశ రాజధానిలోని వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

దక్షిణాది సత్తా చాటుదాం



సీఎంలకు సిద్ధరామయ్య పిలుపు

న్యూఢిల్లీ : నరేంద్రమోడీ ప్రభుత్వంపై దక్షిణాది రాష్ట్రాలు ఆగ్రహంతో రగిలిపోతున్నాయి. మోడీ ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిని ఎండగడుతున్నాయి. దేశంలోని దక్షిణాది రాష్ట్రాల రాజకీయ నాయకుల మధ్య ఐక్యతా రాగం మరింత బలపడుతోంది. నిధుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు చెక్ పెట్టాల్సిన ఆవశ్యకతను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దక్షిణాది సీఎంలకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, పుదుచ్చేరి ముఖ్యమంత్రులను ఉద్దేశిస్తూ ట్విటర్లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలకు నిధుల కేటాయింపు కోసం 2011 జనాభా లెక్కలను ఉపయోగించాలంటూ మోడీ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘానికి సిఫారసు చేయడంపై దక్షిణాదిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటివరకు 1971 జనాభా లెక్కల ప్రకారమే నిధుల కేటాయింపు కొనసాగుతూ వస్తోంది. శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య ట్విటర్లో స్పందిస్తూ... 'పన్నుల బదిలీని నిర్ణయించడానికి వినియోగిస్తున్న 1971 జనాభా లెక్కలను కాకుండా 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘాన్ని కోరుతోంది. దీనివల్ల దక్షిణాది ప్రయోజనాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. కాబట్టి మనం దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. తన పోస్టులో సిద్ధరామయ్య మరో ఆరుగురు ముఖ్యమంత్రుల ట్విటర్ ఖాతాలను ట్యాగ్ చేశారు. వీరితో పాటు డీఎంకే నేత ఎంకే స్టాలిన్, కాంగ్రెస్ నేత శశిథరూర్‌లను ట్యాగ్ చేశారు.

మరోవైపు ఆర్థిక సంఘానికి కేంద్ర ప్రభుత్వం చేసిన సిఫారసులను అధికార పార్టీలు, ప్రతిపక్షాలతో నిమిత్తం లేకుండా దక్షిణాది నేతలంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ విజయవంతంగా జనాభా నియంత్రణ అమలు చేయగా... ఉత్తరాదిలో ప్రత్యేకించి హర్యానా, బీహార్, యూపీ, మధ్యప్రదేశ్‌లలో మాత్రం ఇది జరగలేదు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలో జనాభా విపరీతంగా పెరిగిపోయింది. ఇదే ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలకు ఆందోళన కలిగిస్తోంది. 2011 జనాభా లెక్కలను ఉపయోగించి కేంద్ర పన్ను బదలాయింపులు చేపడితే... దక్షిణాది రాష్ట్రాలకు కేటాయించే నిధుల్లో భారీగా కోతపడుతుంది. జనాభా నియంత్రణ కోసం పడిన శ్రమ మొత్తం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. మరోవైపు తమ రాష్ట్రాల నుంచి కేంద్రం అధిక మొత్తంలో ఆదాయం పొందుతూ... నిధుల కేటాయింపులో మాత్రం దారుణంగా వ్యవహరిస్తున్నారంటూ ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఉత్తరాదికి రాయితీలు ఇచ్చేందుకు దక్షిణాదికి మొండి చెయ్యి చూపిస్తున్నారని సిద్ధరామయ్య ఇంతకు ముందే నిప్పులు చెరిగారు.

కాల్‌బుర్గి హత్యపై స్పందించండి

కర్ణాటక, మహారాష్ట్ర, గోవాలకు సుప్రీం నోటీసు



న్యూఢిల్లీ : ప్రముఖ జర్నలిస్టు, రచయిత ఎంఎం కాల్‌బుర్గి హత్యకు సంబంధించి సుప్రీంకోర్టు మూడు రాష్ట్రాల ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. నాలుగు వారాల్లోగా ఈ నోటీసుకు సమాధానం ఇవ్వాలని కర్ణాటక, గోవా, మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ నోటీసులు జారీచేసింది. కాల్‌బుర్గి భార్య ఉమా కాల్‌బుర్గి తరపున హాజరైన కృష్ణకుమార్ అందజేసిన సమాచారంపై ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ ధర్మాసనంలో ఇతర సభ్యులుగా జస్టిస్ ఎఎం ఖన్విల్‌కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్ ఉన్నారు. అదనపు సొలిసీటర్ జనరల్ (ఏఎస్‌జీ) పింకీ ఆనంద్ కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తూ, ఈ హత్య కేసును జాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఏ) దర్యాప్తు జరపలేదని, ఈ నేరం ఎన్ఐఏ చట్టం పరిధిలోకి రాదని తెలిపారు. తన భర్త ఎంఎం కాల్‌బుర్గి హత్యపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు జరిపించాలని ఆ పిటిషన్‌లో ఉమాదేవి కోరారు. కర్ణాటకలోని ధార్‌వాడ్‌లో 2015లో కాల్‌బుర్గిని హత్య చేశారు. హేతువాది ధబోల్కర్, సీపీఐ నాయకులు, హేతువాది గోవింద్ పన్సారే హత్యలు కూడా ఇదే తరహాలో జరిగాయని గత విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం దృష్టికి ఉమాదేవి తీసుకువచ్చారు.

నల్లార్‌పై చెక్‌డ్యాం నిర్మాణాన్ని నిలిపివేయాలి : కేరళ



తిరువనంతపురం : తమిళనాడులో నల్లర్ నదిపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం అక్రమ నిర్మాణమని కేరళ ప్రభుత్వం పేర్కొంది. దాని నిర్మాణ పనులను నిలిపివేయాలని శుక్రవారం ఆ ప్రభుత్వాన్ని కోరింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాష్ట్ర అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడుతూ, తమిళనాడు నల్లార్ నదిపై చెక్‌డ్యాం నిర్మాణానికి పనులు ప్రారంభించిన విషయం తమ దృష్టి వచ్చిందని తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని, ఆ నిర్మాణ పనులపై గనుక బదులివ్వకపోతే తమ రాష్ట్రం అవసరమైన చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు.

చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం : పాక్




న్యూఢిల్లీ : కాశ్మీర్‌తోపాటు భారత్, పాకిస్తాన్‌ల మధ్య ప్రధాన సమస్యలను చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని భారత్‌లో పాకిస్తాన్ హైకమిషనర్ సోహైల్ మహమూద్ శుక్రవారం పేర్కొన్నారు. పాకిస్తాన్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఆయన ఆ దేశ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. భారత్‌తోపాటు, దక్షిణాసియాలోని అన్ని పొరుగు దేశాలతో శాంతి, సత్సంబంధాలను కలిగి ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు



అహ్మదాబాద్ : గుజరాత్ జీఎస్టీ చట్టం రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గుజరాత్ హైకోర్టు కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. ఈ కొత్త చట్టం కింద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లైమింగ్ చేస్తున్న సంస్థలు ఆంక్షలు విధించడంపై ప్రశ్నిస్తూ అహ్మదాబాద్‌లోని విల్‌ఫుడ్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు దీనిపై బదులివ్వాలని జీఎస్టీ కౌన్సిల్, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంకు జస్టిస్ అఖిల్ ఖురేషి, బీఎన్ కరియాలతో కూడిన డివిజన్ బెంచ్ గత మంగళవారం నోటీసులు జారీ చేశారు.

భారత్-జింబాబ్వే మధ్య వాణిజ్య బంధం : కోవింద్



న్యూఢిల్లీ : భారత్-జింబాబ్వేల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్‌కొవింద్ తెలిపారు. జింబాబ్వే వైస్ ప్రెసిడెంట్ జనరల్ (రిటైర్డ్) కాన్‌స్టాంటినో చివెంగాతో సమావేశమైన సందర్భంలో ఆయన ఈ విధంగా పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య 170 మిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని, ఇది భారత్ శక్తి సామర్థ్యాల కంటే చాలా తక్కువని ఆయన అన్నారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు, వాణిజ్యం పుంజుకోవడానికి రెండు దేశాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఐదుగురు నక్సలైట్లు అరెస్ట్



రాయ్‌పూర్ : చత్తీస్‌గఢ్‌లోని బీజపూర్ జిల్లాలో ఐదుగురు నక్సలైట్లు, ఒక మావోయిస్టు సానుభూతిపరుడిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. సీఆర్‌పీఎఫ్ 168వ బెటాలియన్, స్థానిక పోలీసులతో కూడిన సంయుక్త బృందం బసగూడలో ఈ ఆరుగురిని అరెస్టు చేసిందని చెప్పారు. నక్సలైట్లు సర్కేగూడ-టర్రెం రహదారి మార్గంలో రాకపోకలను నిలిపివేయాలని ప్రయత్నిస్తున్నట్టు ముందుగా అందిన సమాచారం మేరకు రక్షణ బృందం అక్కడికి చేరుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్టు తెలిపారు.

మైనర్‌పై అత్యాచారం..రైతుకు పదేళ్ల జైలు



తమిళనాడు : మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో ఓ రైతుకు పదేళ్ల జైలు శిక్ష విధించింది మహిళా కోర్టు. 2016లో పెరంబలూర్‌లో శివప్రకాశం అనే 59 ఏళ్ల రైతు 12 ఏళ్ల బాలికను అపహరించి, ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ కేసుపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి ఎస్ విజయకాంత్ నిందితుడు శివ ప్రకాశంకు పదేళ్ల జైలుశిక్షతోపాటు 10వేలు జరిమానా విధించారు. అరియాలూర్ జమీన్‌కు సమీపంలో సదరు బాలిక ఆడుకుంటుండగా శివప్రకాశం మాయమాటలు చెప్పి ఆమెను ఎత్తుకెళ్లాడు. బాలికను రేప్ చేసి అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు బాలికను ఆస్పత్రిలో చేర్పించి..శివప్రకాశంను పోలీసులకు అప్పగించారు.

లోకాయుక్తను ఎందుకు నియమించలేదు?

12 రాష్ట్రాలకు సుప్రీం సూటిప్రశ్న



న్యూఢిల్లీ : ఇప్పటి దాకా లోకాయుక్తను ఎందుకు నియమించలేదని 12 రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. జస్టిస్ రంజన్ గగోయ్, జస్టిస్ ఆర్.భానుమతిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై శుక్రవారం విచారణ జరిపింది. లోకాయుక్త నియామకంలో రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి ఏమిటని ఒడిశా ప్రధాన కార్యదర్శిని ధర్మాసనం అడిగింది. జమ్మూకాశ్మీర్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమ బంగ్లా రాష్ట్రాల్లో లోకాయుక్త నియామకం జరగ లేదు. లోక్‌పాల్, లోకాయుక్తా చట్టం2013లోని సెక్షన్ 63 ప్రకారం ప్రతి రాష్ట్రం లో లోకాయుక్తను నియమించాలి. న్యాయవాది, ఢిల్లీకి చెందిన బీజేపీ నేత అశ్విన్ కుమార్ ఉపాధ్యాయ పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. ఈ పిటిషన్‌లో రాష్ట్రాల్లో లోకాయుక్త సరిగ్గా పనిచేయడానికి కావాల్సిన బడ్జెట్ కేటాయింపులు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కొన్ని రాష్ట్రాలు లోకాయుక్తకు ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా బలహీనపరుస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థుల ఆటో బోల్తా

ఒకరు మృతి - ఆరుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బెలగాం/జియ్యమ్మవలస : విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామం హైస్కూల్ మలుపు వద్ద శుక్రవారం ఆటో బోల్తా పడిన ఘటనలో పదవ తరగతి పరీక్షలు రాసి వస్తున్న ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఆరుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. గరుగుబిల్లి మండలం నాగూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థులు రోజూ మూడు ఆటోల్లో అదే మండలం రావివలస జెడ్పీ హైస్కూలులో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసి వస్తున్నారు. అదే క్రమంలో శుక్రవారం పరీక్షల అనంతరం రావివలస నుంచి నాగూరు వస్తుండగా మధ్యాహ్నం 12.30 ప్రాంతంలో తురకనాయుడువలస హైస్కూలు మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గరుగుబిల్లి మండలం ఖడ్గవలస గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి మరిశర్ల తిరుమల సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న మరో ఆరుగురు విద్యార్థులు మిరియాల ప్రకాష్, దీసర మధు, చింతాడ మణికంఠ, చీపురుపల్లి హరికృష్ణ, తెర్లాపాటి హరికృష్ణ, సీహెచ్. జనార్దన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఖడ్గవలస సర్పంచ్ అంబటి గౌరినాయుడు వెంటనే క్షతగాత్రులను 108లో పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు సుమారు 13 మంది వరకు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఒక్కగానొక్క కొడుకు సాయి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ దంపతులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. జియ్యమ్మవలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్ర హాస్పిటల్‌లో 22 మంది చిన్నారులకు ఉచిత గుండె చికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : హీలింగ్ లిటిల్ హార్ట్, యూకే చారిటీ వారి సౌజన్యంతో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో 22 మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. ఆంధ్ర హాస్పిటల్స్ హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో శుక్రవారం చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ డాక్టర్ పీవీ. రామారావు మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పిల్లలకు ఆపరేషన్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ బృందంలో వైద్యులు విక్రమ్, ప్రేమ్ వేణుగోపాల్, సంజీవ్ నీచని, నయన్‌శెట్టి, గోపి, చెల్లప్పన్ సుబ్రమణియన్, అనురాధ, ఆనంద్ మోహన్ పాటిల్, జూలియాలతో పాటు తొమ్మిది మంది ఇంగ్లండ్ వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. గుండెకు సంబంధించి అత్యంత క్లిష్టమైన టెట్రాలజీ ఆఫ్ ఫాలో, ఆబ్సెంట్ పల్మనరీ వాల్వ్, పల్మనరీ ఎట్రిసీయా, కంప్లీట్ ఎవీఎస్డీ, డబల్ అవుట్లెట్ రైట్ వెంట్రికల్ ఆపరేషన్లు చేసినట్టు వివరించారు. కార్డియాక్ సర్జన్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ 2015 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు పదమూడు సార్లు ఆంధ్రహాస్పిటల్స్‌లో 274 మంది పిల్లలకు సర్జరీలను విజయవంతంగా చేశామన్నారు. ప్రపంచఖ్యాతి గాంచిన యూకే హాస్పిటల్ లెస్టర్ రాయల్ ఇంఫమరీ, లెస్టర్, ఆల్డర్ హే హాస్పిటల్, లివర్పూల్, యూకే, లేడీ సిలెంతో చిల్డ్రన్ హాస్పిటల్ నుంచి వచ్చి ఈ రకమైన ఆపరేషన్లు చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లోనూ ఈ రకమైన గుండె ఆపరేషన్లు ప్రతి రెండు నెలలకోసారి ఆంధ్రహాస్పిటల్‌లో నిర్వహిస్తారని తెలిపారు. సినీనటుడు మహేష్‌బాబు తన వంతు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు.





సత్యసాయి సమాధిని దర్శించుకున్న గవర్నర్

విశాలాంధ్ర - పుట్టపర్తి : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అనంతపురం జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి మహాసమాధిని దర్శించు కున్నారు. బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన శుక్రవారం 12.10 గంటలకు ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. ప్రశాంతి నిలయంలోని శాంతి భవన్ వద్ద గవర్నర్‌కు కలెక్టర్ వీరపాండ్యన్, ఎస్పీ అశోక్‌కుమార్, ఓఎస్‌డీ ఐశ్వర్య రస్తోగి, ట్రస్ట్ సభ్యులు ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి, ప్రసాదరావు, మున్సిపల్ చైర్మన్ బెస్తచలపతి, ఆర్డీవో రామ్మోహన్, తహశీల్దార్ సత్యనారాయణ, డీఎస్పీలు రామవర్మ, రామక్రిష్ణయ్య, సీఐ ఆంజనేయులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. శాంతిభవన్‌లో కాసేపు విశ్రాంతి తీసుకొని తన సమీప బంధువైన ప్రహ్లాదరావు ఇంటికెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలపై ట్రస్ట్ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మునిసిపల్ చైర్మన్ బెస్తచలపతి, కౌన్సిలర్లు గవర్నర్‌కు శాలువా కప్పి బాబా చిత్రపటాన్ని బహూకరించారు. తిరిగి మధ్యాహ్నం 02:10 గంటలకు ఇక్కడనుండి బయలుదేరి బెంగళూరుకు వెళ్లారు.

ఉపాధికి ని'బంధన'లు

- సాగని పంచాయతీ అనుసంధాన పనులు
- నిధుల కొరతతో పంచాయతీలు తెల్లమొహం
- విజయనగరం జిల్లాలో పంచాయతీలకు బంపర్ ఆఫర్

విశాలాంధ్ర - విజయనగరం : రాష్ట్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అమలుచేస్తున్న కన్వర్జన్సీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనుల్లో పంచాయతీల భాగస్వామ్యం పేరుతో కేంద్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో ముందుకు సాగని పరిస్థితి. గ్రామాభివృద్ధికి బాటలు వేయాల్సిన ఈ పథకం నిర్వీర్యమయ్యే పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో పంచాయతీరాజ్‌శాఖ పనులకు సంబంధించి సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరుచేస్తోంది. ఈ పనులను సక్రమంగా నిర్వహించేందుకు స్థానిక పంచాయతీల నుంచి కొంత వాటాగా నగదు పెట్టాలని షరతు విధించింది. దీంతో పంచాయతీ పాలకులకు షాక్ తగిలినట్టయింది. ఆర్థిక వనరులు వచ్చే పంచాయతీలు ఉపాధి పనులకు సిద్ధం కాగా, కనీస ఆదాయం లేని పంచాయతీల్లో పనులు ప్రారంభం కాలేని అయోమయ దుస్థితి. కేంద్రం నిబంధనల ప్రకారం రెండు వేలలోపు జనాభా నివాసం ఉంటున్న పంచాయతీల్లో ఉపాధి నిధులతో పనులుచేస్తే పంచాయతీ నుంచి 19 శాతం నిధులను వాటాగా పెట్టాలి. అలాగే 2 వేల నుంచి 5 వేల లోపు జనాభా వుంటే 30 శాతం, 5 వేల పైన జనాభా కలిగిన పంచాయతీలు 50 శాతం నిధులను వాటాగా పెట్టి గ్రామాల్లో పనులను చేసుకోవచ్చు. పంచాయతీ నిధుల మంజూరును బట్టే ఉపాధి నిధులు విడుదల చేస్తారు. దీంతో తప్పనిసరిగా పంచాయతీలలో నిధులు ఉన్నవారే పనులకు సిద్ధమవుతున్నారు.



జామి మండలంలో నిర్మించిన సీసీ రోడ్డు

రాష్ట్రవ్యాప్తంగా పనుల్లో వెనుకంజ..

రాష్ట్రంలో పంచాయతీరాజ్ విభాగం పనుల్లో ఈ పథకం పూర్తిగా వెనుకబడి వుంది. ఈ ఏడాది రాష్ట్రంలో మొత్తం 1,46,540 పనులను గుర్తించారు. వీటిలో ప్రస్తుతం 24,393 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మరో 69,556 పనులు నిలిచిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా మరో 50 వేల పనులు అసలు ప్రారంభం కాలేదు. ఉపాధిహామీ పథకంలోని ఆర్డీఎఫ్, సీఆర్ఆర్ వర్కులకు నిధులు విడుదల వుతున్నా, కన్వర్జన్సీ పనులకు మాత్రం కేంద్రం మంజూరు చేయడంలేదు. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి.

విజయనగరం జిల్లా కలెక్టర్ కొత్త ప్రణాళిక..

విజయనగరం జిల్లాలో మాత్రం పంచాయతీలకు జిల్లా కలెక్టర్ బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఈ నెల మార్చి 31వ తేదీతో ఆర్థిక ఏడాది ముగుస్తుండడంతో ప్రస్తుతం ఉపాధి నిధులు రూ.50 కోట్ల వరకు మిగులు ఉండడంతో వినియోగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ నెల మార్చి 31లోపు కన్వర్జన్సీ పనులకు ప్రారంభించే ఏ పంచాయతీ అయినా కేవలం 10 శాతం నగదు ఇస్తే చాలని అభయం ఇచ్చారు. మేజర్ పంచాయతీ అయినా 10 శాతం నిధులు పెడితే మిగిలిన మొత్తం మంజూరు చేస్తామని చెబుతున్నారు. దీంతో అన్ని మండలాలలోని పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు పనులను వేగవంతం చేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఈ ఆఫర్ ఆకర్షణీయంగా ఉండడంతో కొన్ని పంచాయతీల సర్పంచ్‌లు ముందుకు వస్తున్నారు. ఇతర జిల్లాలలో మాత్రం పంచాయతీల్లో నిధుల కొరతతో పనులు చేయలేకపోతున్నారు.

గుంటూరు ఎస్ఈపై
అతిసార వేటు

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అతిసార కాటుకు దాదాపు ఇరవైమంది మృత్యువాత పడిన ఘటనలో తాజాగా గుంటూరు నగరపాలకసంస్థ ఎస్ఈ మరియన్నను ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. గుంటూరు నగరంలో మూడు వారాల నుంచి అతిసార ప్రబలి ఇరవైమంది వరకు రోగులు మృతిచెందగా, రెండువేల మంది వరకు ఆసుపత్రిపాలయ్యారు. తాగునీరు కలుషితం కావడంతో ఉద్యోగుల నిర్లక్ష్య మే కారణంగా భావించిన ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. తొలుత తొమ్మిది మంది నగరపాలక సంస్థ ఉద్యోగులను సస్పెండ్ చేసిన తర్వాత నగరపాలకసంస్థ కమిషనర్ అనురాధను బదిలీ చేశారు. ఆమె స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విజయనగరం జేసీ శ్రీకేష్ బి లఠ్కర్‌ను నియమించారు. అనురాధకు ఇంకా పోస్టింగ్ దక్కలేదు. ఎస్ఈ మరియన్నను సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఉన్నతాధికారులు ఈయన స్థానంలో ఏపీఎండీపీ ఎస్ఈ పి.సత్య నారాయణను నియమించారు. తాజా బదిలీ గుంటూరు నగరపాలకసంస్థ ఉద్యోగుల్లో తీవ్ర కలకలం రేపుతోంది. అతిసార కాటు ఇంకా ఎంతమంది ఉద్యోగులను బలిగొంటుందోనని భయపడుతున్నారు.

బాకీలు తీర్చలేక రైతు బలవన్మరణం

నాలుగేళ్లుగా వరుస నష్టాలతో ఉక్కిరిబిక్కిరి

విశాలాంధ్ర - నాదెండ్ల : వ్యవసాయంలో వరుస నష్టాలు ఆ రైతును ఉక్కిరిబిక్కిరి చేశాయి. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే దారి లేక కొద్ది రోజుల క్రితం ఊరు వదిలి వెళ్లిపోయాడు ఆ అన్నదాత. మళ్లీ తిరిగి తన పొలానికి చేరుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం గుంటూరు జిల్లా నాదెండ్ల మండలంలోని జాప్తివారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. పొలంలోనే పురుగుల మందులో మద్యం కలుపుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దావనబోయిన శివసూర్యనారాయణ (54) తనకున్న 1.5 ఎకరాల సొంత పొలంతో పాటు 15 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తున్నాడు. నాలుగేళ్లుగా వర్షాలు సక్రమంగా లేకపోవటం, ఆశించిన దిగుబడులు రాక వరుస నష్టాలపాలవుతున్నాడు. ఈ క్రమంలో గతేడాది పదెకరాల్లో మిర్చి సాగు చేయడంతో ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. ఈ ఏడాది పదెకరాల్లో పత్తి సాగు చేసినా గులాబీరంగు పురుగు ఉధృతికి దిగుబడి పడిపోయింది. చేతికందిన పంటలోనూ నాణ్యత లేకపోవటంతో ధర దక్కక నష్టపోయాడు. రెండేళ్ల క్రితం రూ.2.5 లక్షల వ్యయంతో జీవాలు కొనుగోలు చేసిన కొద్దినెలలకే వ్యాధులు సోకటంతో మొత్తం మృత్యువాత పడ్డాయి. గడిచిన నాలుగేళ్లలో రూ.25 లక్షల మేర అప్పులపాలయ్యాడు. నాలుగేళ్ల క్రిందట సొంత భూమిని గణపవరం ఎస్‌బీఐలో తనఖాపెట్టి రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. టీడీపీ ప్రభుత్వ రుణమాఫీ రెండు విడతల్లో రూ.60 వేలు మాఫీ అయింది. అప్పులిచ్చిన ఎరువుల దుకాణాల యజమానులు, తోటి రైతులు ఒత్తిడి పెరగడంతో ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవటంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామానికి చేరుకున్న శివసూర్యనారాయణ నేరుగా పొలానికి వెళ్లి తనతోపాటు తెచ్చుకున్న పురుగుమందు, మద్యం కలిపి తాగాడు. గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అప్పటికే శివసూర్యనారాయణ మృతి చెందినట్లు గుర్తించారు. గ్రామస్తుల సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



వరకట్న కాటుకు అధ్యాపకురాలు బలి

- భర్తపై వరకట్న కేసు నమోదు
- సిక్కోలు జిల్లా సోంపేటలో విషాదం

విశాలాంధ్ర - సోంపేట : శ్రీకాకుళం జిల్లా సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని జువాలజీ విభాగంలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న గేదెల సింహాచలం అలియాస్ గీత (32) శుక్రవారం వేకువజామున ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. బ్యాంకు ఉద్యోగం చేస్తున్న భర్త నూకరాజు వరకట్న దాహమే ప్రాణం తీసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చినప్పటికీ వరకట్న దాహం తీరక గీతను తరచూ వేధించేవాడు. తీవ్ర మనస్తాపంతో పడకగదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త వెంటనే మృతదేహాన్ని కిందకు దించి ఇంటి హాలులోకి మార్చడం, ఆమె ఒంటిపై దుస్తులను మార్చడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నూకరాజుపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తహశీల్దార్ ఆర్.గోపాలరత్నం, సీఐ సన్యాసినాయుడు, ఎస్సై దుర్గాప్రసాద్ సమక్షంలో శవపంచనామా నిర్వహించారు. సోంపేట పట్టణంలోని రాజాపంతులు కాలనీలో రెండేళ్ళుగా గీత, నూకరాజు దంపతులు తమ ఇద్దరు పిల్లలు చేతన్(3), హైతి (4 నెలలు)తో నివాసం ఉంటున్నారు. గీత స్వగ్రామం విజయనగరం జిల్లా తెర్లాం గ్రామం. అదే జిల్లా బత్తిరాజేరు మండలం చేగంటివలస గ్రామానికి చెందిన నూకరాజుతో 2012 మార్చి 9న వివాహం జరిగింది. విజయనగరం జిల్లాలో పనిచేసిన వీరిద్దరు బదిలీపై 2016లో సోంపేట చేరుకున్నారు. 2017 ఏప్రిల్ నుంచి గీత సోంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జువాలజీ విభాగంలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. నూకరాజు సమీపంలోని కవిటి మండలం బొరివంక గ్రామంలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నూకరాజుకు పెళ్లికి ముందు నుంచే మరో మహిళతో వివాహేతర సంబంధం ఉందని, అదనపు వరకట్నం కోసం అనేకమార్లు భార్యను వేధిస్తున్నట్లు మృతురాలి తండ్రి సత్యన్నారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. భర్త వేధింపులు భరించలేక తరచూ కుమార్తె ఆందోళన చెందేదని తండ్రి చెప్పారు. బిడ్డలు విగతజీవిగా మారిన తల్లి వద్ద రోదించిన తీరు అందరినీ కలచి వేసింది.





నన్నయ సెట్‌కు నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర - అమలాపురం : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌తోపాటు ఉభయగోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల పోస్ట్ గ్రాడ్యుయేషన్ సెంటర్లలో అడ్మిషన్ల కోసం నన్నయ విశ్వవిద్యాలయం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్ ఈ నెల 13వ తేదీన విడుదల చేసినట్టు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కె. దీప్తి తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్ష విధి విధానాలను శుక్రవారం అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఎ.డి. దీప్తి విలేకరులకు వివరించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. నన్నయ సెట్ 2018 ద్వారా ఆర్ట్స్‌లో 14 పీజీ కోర్సులు, సైన్సులో 17 పీజీ కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు రూ.300 చొప్పున రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సి ఉందన్నారు. వచ్చే నెల 14వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అపరాధ రుసుము రూ.1000తో ఏప్రిల్ 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ప్రవేశ పరీక్ష కోసం శ్రీకాకుళం, విజయనగరం, అమలాపురం, కాకినాడ, రాజమండ్రి, రంపచోడవరం, ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, విజయవాడ పరీక్షా కేంద్రాలు ఉంటాయని చెప్పారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఆర్ట్స్ కోర్సులలో 2,670 సీట్లు, సైన్స్ కోర్సులలో 3,535 సీట్లు నన్నయ సెట్- 2018 ద్వారా భర్తీ కానున్నాయని తెలిపారు. సమావేశంలో ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. కృష్ణమోహన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నన్నయ సెట్-2018 బ్రోచర్లను విడుదల చేశారు.

ఉపాధి పనిలో కూలీ హఠాన్మరణం

విశాలాంధ్ర - అర్ధవీడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చెరువు మట్టి పనిలో శుక్రవారం ఓ ఉపాధి కూలీ కుప్పకూలి మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా అర్ధవీడు మండలంలోని బొల్లుపల్లె పంచాయతీలో జరిగింది. ఉపాధి హామీ పథకంలో బొల్లుపల్లెలోని తిమ్మనాయుని చెరువు తవ్వకం పనులు చేస్తున్నారు. బొల్లుపల్లెకు చెందిన మాసారపు చిన్నక్క రోజులానే శుక్రవారం ఉదయం పనికి వెళ్ళి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. సహచర కూలీలు ఆమెను నీడకు తరలిస్తుండగా చెరువు కట్ట దాటే లోపు ప్రాణాలు విడిచింది. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశంలో ఎండ నుంచి కూలీల రక్షణ కోసం పరదాలు కట్టాలి. ప్రమాదాలు సంభవిస్తే ప్రాథమిక చికిత్స కిట్టు అందుబాటులో ఉండాలి. మూడేళ్లుగా ఈ సౌకర్యాలు మండలంలో మచ్చుకయినా కనిపించకపోవడం గమనార్హం. కూలీ మరణ సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో తాతపూడి సుకుమార్, ఈసీ కిషోర్, ఏపీవో మాల్యాద్రి ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

రూ.75 లక్షల విలువైన ఎర్రచందనం పట్టివేత

విశాలాంధ్ర - గూడూరు : నెల్లూరుజిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వేర్వేరు దాడుల్లో రూ. 75లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను పట్టుకున్నారు. స్థానిక ఎస్‌డీపీఓ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో జిల్లా క్రైమ్ ఓఎస్‌డీ విఠలేశ్వర్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చిల్లకూరు, నాయుడుపేట, దొరవారిసత్రం ఎస్ఐలతో కలిసి ఏకకాలంలో మూడు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 9మంది అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుండి రూ. 75 లక్షల విలువైన 40 ఎర్ర చందనం దుంగలు, 3 వాహనాలు, 11 సెల్‌ఫోన్లు, రూ. 5,250 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రచందనం దుంగలతోపాటు స్మగ్లర్లను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. వెంకటాచలం, చిల్లకూరు, నాయుడుపేట ప్రాంతాల్లో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్లు వెలిగొండ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు సిద్ధం చేసి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరుకు తరలిస్తున్నారన్నారు. పోలీసులు వీరిని వెంబడించి పట్టుకునే క్రమంలో స్మగ్లర్లు వాహనంతో గుద్దించి చంపడానికి ప్రయత్నించారన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లతో సంబంధాలున్న స్మగ్లర్లను పట్టుకునేందుకు మూడు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. స్మగ్లర్ల కదలికలపై గట్టి నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎర్రచందనం స్మగ్లర్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారి ఆస్తులను సైతం సీజ్ చేయనున్నట్లు తెలిపారు. గూడూరు డివిజన్ పరిధిలో ఎక్కడైనా ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతున్నట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 9390777727 నెంబరుకు మెసేజ్ చేయాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో గూడూరు డీఎస్పీ రాంబాబు, సీఐలు సుబ్బారావు, అక్కేశ్వరరావు, ఎస్ఐలు నాగరాజు, శ్రీనివాసరావు, రవినాయక్, టాస్క్‌ఫోర్స్ అధికారులు పాల్గొన్నారు.

వేల ఏళ్ల చరిత్రకు ఆధారం రుద్రంకోట

- పురావస్తుశాఖ తవ్వకాలలో ఆదిమానవుల అవశేషాలు
- ఆనాడే అలంకరణకు అద్భుత పూసల వినియోగం

విశాలాంధ్ర - వేలేరుపాడు : పశ్చిమ గోదావరి జిల్లా వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట గ్రామంలో పురావస్తుశాఖ తవ్వకాల్లో సుమారు 3000 వేల సంవత్సరాల క్రితం నాటి ఆదిమానవుల అవశేషాలు బయటపడ్డాయి. దీంతో ఒక్కసారిగా రుద్రంకోట చరిత్ర దేశవిదేశాల్లో చర్చనీయాంశంగా మారింది. పురాతన ఆలయం, కట్టడాలు ఇతర అంశాల ఆధారంగానే ఆ గ్రామానికి రుద్రంకోట పేరు పెట్టి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. తవ్వకాల్లో పెద్ద పరుపు బండ.. దాని చుట్టూ మరికొన్ని బండలు పాతి ఉండటంతో పురాతన సమాధిగా గుర్తించారు. ఇటువంటి సమాధులు ఈ ప్రాంతంలో సుమారు రెండు వందలపైగా ఉంటాయని భావిస్తున్నారు. ఇప్పటివరకు 60 సమాధుల తవ్వకాలు పూర్తయ్యాయి. మరో 40 సమాధులను మే నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలుపుతున్నారు.

కుండలో అవశేషాలు

ఆనాటి సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి సంబంధించిన ఆదిమానవుల సమాచారాన్ని తెలియజేసే అవశేషాలు ఈ సమాధుల్లోని మట్టి కుండల్లో వెలుగుచూశాయి. మరణించిన తర్వాత దహన సంస్కారాలు పూర్తి చేసి వారి అస్థికలు, వారు వినియోగించిన వస్తువులను కుండలో భద్రపరచి దానికి సమాధి నిర్మించేవారని భావిస్తున్నారు. అలా ఒక్కో సమాధిలో నాలుగు, ఐదు వరకు కుండలు ఉండటంతో అవి ఒక కుటుంబానికి చెందినవిగా అంచనా వేస్తున్నారు.

వందల ఏళ్ల క్రితమే ఇనుము వినియోగం

సింధూ నాగరికత కంటే వందల సంవత్సరాల ముందే ఇక్కడ ఇనుము వాడినట్లు ఆధారాలను గుర్తించారు. అలంకరణకు ప్రాధాన్యత ఇచ్చేవారని సమాధుల్లో దొరికిన వివిధ రకాల డిజైన్లతో కూడిన విలువైన పూసలను బట్టి అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో పూసల తయారీ కేంద్రం ఉండవచ్చని, జలమార్గం ద్వారా వ్యాపారం చేసే అవకాశం ఉందని పరిశోధనలు చేస్తున్నారు.





జలసమాధి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఎంతో పురాతన చరిత్ర కలిగిన రుద్రంకోట మరి కొంతకాలంలో జలసమాధి కానుంది. పురాతన ప్రాంతం కనుమరుగు కావటం చాలా బాధాకరమని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

సోమవారం శ్రీరామనవమి సెలవు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: శ్రీరామనవమి సెలవును ఆదివారం నుంచి సోమవారానికి ప్రభుత్వం మార్పు చేసింది. ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ (పొలిటికల్) కార్యదర్శి శ్రీకాంత్ నాగులపల్లి శుక్రవారం జీవో జారీ చేశారు. ప్రభుత్వం శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఈనెల 25వ తేదీ ఆదివారం సాధారణ సెలవుగా ప్రకటించింది. అయితే 26వ తేదీ సోమవారానికి మార్పు చేయాలని పేర్కొంటూ దేవాదాయశాఖ కమిషనర్ ప్రభుత్వానికి లేఖ రాసారు. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి పండుగ సెలవును ఆదివారం నుంచి సోమవారానికి మార్పు చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసింది.

పీజీ మెడికల్, డెంటల్ సీట్ల భర్తీకి దరఖాస్తులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరిధిలోని వివిధ వైద్యకళాశాలల్లో 2018-రాష్ట్ర కోటాలో భాగంగా పీజీ మెడికల్, డెంటల్ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. శుక్రవారం యూనివర్శిటీ రిజిస్ట్రార్ ఒక ప్రకటన విడుదల చేశారు.నీట్ పీజీ /నీట్ ఎండీఎస్-2018లో కటాఫ్ అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసేందుకు అర్హులు. ఎంబీబీఎస్/బీడీఎస్ చదివిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీ నుంచి 31 తేదీలోగా దరఖాస్తు చేయాలి.పూర్తి వివరాలను 'ఏపీఎన్‌టీఆర్‌యూహెచ్‌ఎస్.ఇన్' వెబ్ సైట్‌లో అందుబాటులో వుంచారు.

అవిశ్వాసంపై 'మోడీ' డ్రామాలు : శివాజీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లోక్‌సభలో టీడీపీ, వైసీపీ ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపై చర్చించకుండా ప్రధాని మోడీ డ్రామాలాడుతున్నారని పీసీసీ అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ ఎద్దేవా చేశారు.శుక్రవారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ప్రకటన విడుదల చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ ప్రయోజనాల కోసం మోడీ, అమిత్‌షా కుట్ర పన్నుతున్నారని ఎద్దేవా చేశారు.రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించి వారి కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. బీజేపీ ప్రోద్బలంతోనే టీఆర్ఎస్ అధినేత కేసీఆర్..సాటి తెలుగువారన్న జాలి లేకుండా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.



హోదా సాధించే వరకూ పోరాటం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్

విశాలాంధ్ర బ్యూరో-శ్రీకాకుళం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకూ కేంద్రంతో పోరు కొనసాగిస్తూనే ఉంటామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాకు మద్దతుగా బీజేపీ ప్రభుత్వంపై అవిశాస్వ తీర్మానం ప్రవేశపెడితే ఎన్నో పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయని చెప్పారు. శ్రీకాకుళంలో నగరం రామలక్ష్మణ కూడలి వద్ద గల క్రాంతిభవన్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో జేవీఎస్ఎన్ మాట్లాడారు. కార్పొరేట్‌లకు ప్రధాని నరేంద్ర మోడీ కాపలాదారుడుగా ఉన్నాడే తప్ప ప్రజలకు కాదని ఎద్దేవా చేశారు. వందల కోట్లు బ్యాంకుల నుండి లూటీ చేసిన వారికి విదేశాలకు పారిపోవడానికి అవకాశం కల్పించారన్నారు. పైగా ఎగవేతదారులు పారిపోవడానికి బ్యాంకుల వైఫల్యమే కారణమని బూచిగా చూపించి బ్యాంకులను ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తున్నారని దీన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కష్టాల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కి ఒక్క పైసా కూడా ఇవ్వని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు జరిగే పక్క రాష్ట్రాల్లో మాత్రం అడక్కుండానే వందల కోట్ల నిధులు అందిస్తోందని, ఏపీని మోడీ చిన్నచూపు చూస్తున్నారని ఆయన తెలిపారు. హోదా కోసం గురువారం చేసిన హైవే దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొన్నవారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. హోదా గురించి మాట్లాడితే జైల్లో పెడతామన్న చంద్రబాబుకు ఇన్నాళ్ళకు జ్ఞానోదయం కలిగినట్టుందని, అఖిలపక్షం అంటే అఖిల సంఘమని చంద్రబాబు అన్నారని, రాష్ట్ర భవిష్యత్ కోసం సీపీఐ దేనికైనా సిద్ధంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు అఖిల సంఘం ఏర్పాటు చేసి, కేంద్రం తలను వంచేలా పోరాటాలు చేయాలని జేవీఎస్ఎన్ పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు మాట్లాడుతూ అణువిద్యుత్ ప్రాజెక్టు వద్దని గతంలో చాలా పోరాటాలు జరిగాయని, పర్యావరణానికి ఇబ్బంది కలిగించే ఏ పరిశ్రమనైనా సీపీఐ అడ్డుకుంటుందని తెలిపారు. భూకంపాల జోన్‌లో ఉన్న కొవ్వాడకు ఏదైనా ప్రమాదం జరిగితే చుట్టుపక్కల ఉన్న రాష్ట్రాలకు సైతం తీరని నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. వంశధార నిర్వాసితులకు న్యాయం చేయాలని, యూత్ ప్యాకేజీలు ఇప్పటివరకు ఇవ్వలేదని, వారికి కనీస సౌకర్యాలు కల్పించలేదని, నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమించడానికి సీపీఐ సిద్ధంగా ఉందన్నారు. సీపీఐ మహాసభలు ఏప్రిల్ 6 నుండి 10 వరకు కడపలో జరుగుతాయని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నర్సింహులు కోరారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 7న ' చలో కడప' అనే పోస్టర్‌ను సత్యనారాయణ మూర్తి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చాపర వెంకటరమణ, బలగ శ్రీరామ్మూర్తి, బుడితి అప్పలనాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యుగంధర్, ప్రభావతి, రంధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహన ఏడాదిగా 2018

రెండేళ్లలో లక్ష వాహనాలు ప్రవేశ పెట్టడమే లక్ష్యం

త్వరలో నూతన పాలసీ : చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించడంతోపాటు యువతకు విస్తృతంగా ఉపాధి కల్పించేందుకు 2018ని ఎలక్ట్రిక్ వాహనాల సంవత్సరంగా ప్రకటిస్తున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. దీనిలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తామని, త్వరలోనే ఇందుకు సంబంధించి పాలసీని రూపొందిస్తామని చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలో ముందుగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించేలా కార్యాచరణ చేపడతామన్నారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహన రంగం అభివృద్ధికి గల అవకాశాలు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి అందించాల్సిన ప్రోత్సాహంపై అధికారులు, తయారీదారులతో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రెండేళ్లలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు రాష్ట్రంలో ప్రవేశ పెట్టాలనేదే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. ముందుగా పది వేల ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగిస్తామని చెప్పారు. ఏపీఎస్ఆర్టీసీలో కూడా ఎలక్ట్రిక్ బస్సులు ప్రయోగాత్మకంగా ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో ముందుగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో చేకూరే ప్రయోజనాలను, ఈ రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ వివరించారు. 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ వాహన రంగ విధానం' ముసాయిదాను ప్రస్తావించారు. ముందుగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించే యోచన చేస్తున్నామని, రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, ఎస్‌జీఎస్‌టీలో మినహాయింపులకు పాలసీలో అవకాశం వుంటుందన్నారు. రాష్ట్రంలో ద్విచక్ర వాహనాలతో సహా త్రీవీలర్, ఫోర్ వీలర్ వాహనాల సంఖ్య మొత్తం కోటి 5 లక్షలని అధికారులు లెక్క తేల్చారు. యూనిట్ విద్యుత్ ధర రూ. 6.95గా వుంటే ఎలక్ట్రిక్ ఫోర్ వీలర్‌లో కిలోమీటరు దూరం వెళ్లేందుకు రూ. 1.39 వ్యయమవుతుందని, అదే పెట్రోల్ వాహనానికి రూ. 3.90, డీజిల్ వాహనానికి రూ. 3.25 వ్యయమవుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అదే యూనిట్ విద్యుత్ ధరను రూ. 4కే అందించగలిగితే కిలోమీటరు దూరానికి 80 పైసలే ఖర్చవుతుందని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ యూనిట్లను వీలున్న ప్రతీ చోట ఏర్పాటు చేసేలా ఔత్సాహికులను ప్రోత్సహిస్తామని, ఇది వారికి మంచి ఆదాయ వనరుగా అవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే ప్రతి అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ శాఖ ద్వారా నేరుగా చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఇ-రిక్షాలను నడిపేందుకు వీలుగా త్వరలోనే అనుమతులు ఇస్తామని తెలిపారు.

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో యూఎస్, చైనా, నెదర్లాండ్, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియాలు అగ్రగామిగా వున్నాయని, వాటిని అధిగమించేలా ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపై తిరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్ష వ్యక్తం చేశారు. పవన విద్యుత్‌లో దేశంలోనే రాష్ట్రం అత్యధిక ఉత్పత్తి సాధించి నందుకు గాను నెడ్‌క్యాప్‌కు 'బెస్ట్ ఫెర్ఫార్మింగ్ నోడల్ ఏజెన్సీ అవార్డు'ను నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ ఇవ్వడంపై ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.



హోదా కోరుతూ

భద్రాచలానికి వైద్యుల బృందం సైకిల్ యాత్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ వైద్యుల బృందం విజయవాడ నుంచి భద్రతా చలం వరకూ సైకిల్ యాత్రను నిర్వహించారు. ఈ యాత్రలో డాక్టర్ జి.బుజ్జి బాబు, డాక్టర్ పిడికిటి ప్రసాద్, రావి రమేష్, జిజి శ్రీనివాస్, జి.బసవయ్య పాల్గొన్నారు. పార్లమెంటు సాక్షిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రకటించిన విభజన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

హోదా కోసం క్యాండిల్ ర్యాలీ



విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్ : విభజన హామీలు, ప్రత్యేక హోదాపై మచిలీపట్నంలో సీపీఐ, సీపీఎం, వైసీపీ, కాంగ్రెస్, జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ జరిగింది. వైసీపీ, కాంగ్రెస్, వామపక్షాల నేతలు అత్యధిక సంఖ్యలో క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శి అక్కినేని వనజ, మోదుమూడి రామారావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రఘు సహా ఇతర వామపక్ష నేతలు, వైసీపీ అధికార ప్రతినిధి పేర్ని వెంకట్రామయ్య(నాని), మచిలీపట్నం మాజీ మున్సిపల్ ఛైర్మన్ షేక్ సిలార్‌దాదా, కాంగ్రెస్‌పార్టీ ప్రధాన నేతలు సుంకర పద్మశ్రీ పాల్గొన్నారు. మోడీ ప్రధానిగా ఉండటం ఆంధ్రప్రదేశ్ శాపమని, ఆంధ్రులను మరింతగా అణగదొక్కేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని, ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగితే సహించేదిలేదని నాయకులు హెచ్చరించారు. స్థానిక లక్ష్మీటాకీస్ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి, జిల్లాకోర్టు సెంటర్లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రత్యేకహోదా సాధన సమితి రాష్ట్ర నాయకులు పూలమాల వేసి క్యాండిల్ ర్యాలీని ప్రారంభించారు. మహిళలు, యువకులు, మేధావులు, కార్మికులు, గ్రామీణప్రాంత రైతులు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ కోనేరుసెంటరు వరకూ ర్యాలీ నిర్వహించారు. కోనేరుసెంటరులో జరిగిన బహిరంగసభలో చలసాని శ్రీనివాస్, పి.మధు, కె.రామకృష్ణ, సుంకర పద్మశ్రీ, పేర్ని వెంకట్రామయ్య మాట్లాడారు.

గృహ నిర్మాణానికి సాయంలో కేంద్రం అలసత్వం

మంత్రి కాల్వ శ్రీనివాసులు

విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు కేంద్రం నుండి తగిన సహకారం లభించడం లేదని రాష్ట్ర గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. శాసనమండలిలో గృహ నిర్మాణంపై శుక్రవారం జరిగిన స్వల్ప వ్యవధి చర్చకు మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల ఇళ్ల నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి మంజూరైన ఇళ్లకు కూడా తగిన రీతిలో నిధులు అందడం లేదన్నారు. ఇళ్ల మంజూరులో అన్యాయం జరగడంతోపాటు మంజూరు చేసిన ఇళ్లకూ నిధుల విడుదల విషయంలోనూ కేంద్రంలో అలక్ష్య ధోరణి కనిపిస్తోందన్నారు. పట్టణ గృహ నిర్మాణానికి తొలి విడతలో రూ.1018 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా రూ.181 కోట్లు మాత్రమే విడుదల చేశారని పేర్కొన్నారు. 2017-18 సంవత్సరానికి రూ.1714.87 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇప్పటికే రూ. 2970.48 కోట్లు ఖర్చు చేశామని, అదనంగా ఎంజీఎన్ఆర్‌జీఎస్ గ్రాంట్ నుండి రూ.400 కోట్లు ఖర్చు చేసినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రి గృహనిర్మాణ సంస్థకు అవసరమైన రుణాన్ని ఆర్థిక సంస్థల నుండి పొందేందుకు అనుమతించరన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను 5,64,128 గృహాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3679.53 కోట్లు కేటాయించిందని తెలిపారు. షెడ్యూల్ కులాలకు రూ.853.3 కోట్లు, షెడ్యూల్ తెగలకు రూ.294.02 కోట్లు కేటాయించినట్లు మంత్రి చెప్పారు. గృహ నిర్మాణ సంస్థకు నిధుల సమీకరణ కోసం రూ.6,189 కోట్ల వరకు ఆర్థిక సంస్థల నుండి రుణం తీసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని మంత్రి వివరించారు. హుద్ హుద్ తుఫాన్ బాధితుల కోసం శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో 9,170 గృహాలకు రూ.396.01 కోట్లు మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క ఇంటికి గ్రామీణ ప్రాంతాల్లో రూ.3.98 లక్షల నుండి రూ.5.36 లక్షలు మంజూరు జరిగిందన్నారు. 2004 సంవత్సరం కంటే ముందు నిర్మించి నివాస యోగ్యంగా లేని ఇళ్ల మరమ్మతులకు రూ.15,000 కోట్లు మంజూరు చేసిందన్నారు.లబ్ధిదారుల ఎంపిక జిల్లా అధికార యంత్రాంగం ద్వారా జన్మభూమి కమిటీ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు.

27న కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు

జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నేత రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : కనీస వేతనాల సలహా బోర్డు పునరుద్ధరణ, కనీస వేతనం రూ.18,000 ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద, కృష్ణాగుంటూరు జిల్లాల ఆధ్వర్యంలో విజయవాడలో జరుగు ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులకు రూ.3000 పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వం వాడుకున్న సంక్షేమ నిధులను తిరిగి జమ చేయాలని, ఆటో, హమాలీ ఇతర అసంఘటిత కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా,అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే సిబ్బందిని కార్మికులుగా గుర్తించి చట్టబద్ధ ప్రయోజనాలు కల్పించాలన్నారు. అదే విధంగా అంగన్‌వాడీ కార్మికులకు తెలంగాణ రాష్ట్రంలోవలె రూ.10, 500ల వేతనాలు పెంచాలని,మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు 2016 జూలై నుండి రూ.12వేలు జీతాలు చెల్లించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలనే సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలన్నారు.

మెడికల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని,మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని, కార్మికుల వేతనాలు పెంచి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయిస్ హమాలీ కూలి రేట్లు 24 రూపాయలకు పెంచాలని,గత 10వ పీఆర్సీలో మధ్యంతర భృతి చెల్లించిన కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరరికి పీఆర్సీ వేతనాలు అమలు చేయాలన్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని, సాక్షరభారతి, సర్వశిక్షాఅభియాన్‌లలో పనిచేయు కార్మికులందరికీ ఇతర రాష్ట్రాల మాదిరిగా వేతనాలు పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ జరిగే ఈ ఆందోళన కార్యక్రమాల్లో కార్మికవర్గం పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రవీంధ్రనాద్ కోరారు.

2018-19 నాటికి హంద్రీ-నీవా పూర్తి

మంత్రి దేవినేని ఉమా

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాయలసీమకు వరప్రదాయినీ అయిన హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకాన్ని 2018-19 నాటికి పూర్తి చేస్తామని జలవనరులశాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. రాయలసీమను రతనాలసీమగా మార్చేందుకు హంద్రీ-నీవా దోహదం చేస్తోందన్నారు. ఈ నెలలోనే లేపాక్షి ఉత్సవాల్లో భాగంగా హిందుపురం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఆధ్వర్యంలో నీటి విడుదల కార్యక్రమాన్ని చేపడతామన్నారు. చిత్తూరుజిల్లా మదనపల్లి, తంబళ్లపల్లె, కుప్పం, చిత్తూరు ప్రాంతాలకు ఏప్రిల్ నెలలో నీరు వెళ్లబోతోందన్నారు. అలాగే మే చివరి నాటికి మడకశిరకు నీటిని తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుకు 2017-18 సంవత్సరం బడ్జెట్‌లో రూ. 483.20 కోట్లను కేటాయించినప్పటికీ రూ. 1154.14 కోట్లను ఖర్చు చేసినట్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. గుంటూరుజిల్లా పత్తిపాడు నియోజకవర్గంలోని చంద్రబాబుసాగర్ పనుల్లో ప్రధాన కుడి కాలువను 1.10 కి.మీ. వరకూ తవ్వడం జరిగిందన్నారు. ఇంకా 12.20 కి.మీ. ఎడమ ప్రధాన కాల్వను తవ్వవలసి ఉందన్నారు.

స్వల్ప వ్యవధి ప్రశ్నగా 'కర్నూలు పట్టణంలో తాగునీటి సమస్య'పై మంత్రి మాట్లాడుతూ 'అమృత' పథకంలో రూ. 250 కోట్ల వ్యయంతో హంద్రీ-నీవా నుంచి గాజుల దిన్నె ప్రాజెక్టుకు 2 టీఎంసీల నీటిని తీసుకొచ్చేం దుకు సీఎం అంగీకరించినట్లు మంత్రి తెలిపారు.

దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న ప్రజలు 9.2 శాతం: మంత్రి యనమల

ప్రణాళిక కమిషన్ లెక్కల ప్రకారం 2011-12లో దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న ప్రజలు 9.2 శాతంగా ఉన్నారని అంచనా వేసినట్లు ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. అయితే జిల్లాల వారిగా సమాచారం లభ్యం కాలేదని మంత్రి సభకు వివరించారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో 'రాష్ట్రంలో పేదరిక నిర్మూలన'పై ఎమ్మెల్యేలు ఎం వేణుగోపాలరెడ్డి, జి రవికుమార్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ జరిపిన సమగ్ర సర్వేలో ఈ శాతం 21గా ఉందన్నారు. ఈ సంస్థ అన్ని రకాల కోణాల్లో సర్వే చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 22 శాతం, పట్టణ ప్రాంతాల్లో 19 శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని సర్వేలో తేలిందన్నారు. అలాగే ఎస్సీలో 24 శాతం, ఎస్టీలో 3 శాతం, ఓబీసీలో 21 శాతం, జనరల్ కేటగిరిలో 16 శాతం మంది ప్రజలు ఇంకా దారిద్ర్యరేఖకు దిగువనే జీవిస్తున్నారని తెలిపారు. ప్రకాశంజిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చాలని కేంద్రానికి ఇప్పటికే లేఖ రాసినట్లు ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేసే కఠిన చర్యలు

మంత్రి ప్రత్తిపాటి

విశాలాంధ్ర-అమరావతి : పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. సచివాలయంలో మంత్రి ముఖ్య కార్యదర్శి రాజశేఖర్, ఎండీ సూర్యకుమారితో కలిసి 13 జిల్లాల డీఎంలతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. రైసు మిల్లుల్లో బియ్యం లావాదేవీలు కచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చెయ్యాలని, ఏ. బీ రిజిస్టర్లను మిల్లర్లు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజనం పథకం, గర్భిణులు, బాలింతలకు సరఫరా చేస్తున్న బియ్యం నాసిరకంగా ఉంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో రైతుల నుంచి సేకరించిన వడ్లకు సరిపోయే బియ్యం సక్రమంగా వచ్చే విధంగా కమిషనర్, ఎండీ చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల పని తీరు గురించి మంత్రి వాకబు చేశారు. నెల్లూరు జిల్లాలో మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలపై డీఎంలు దృష్టి సారించాలన్నారు. హాస్టళ్లు, మధ్యాహ్నం భోజన పథకానికి స్వర్ణ, ఎన్ఎల్ఆర్ వంటి బియ్యం రకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, బియ్యం రవాణా సమయంలో అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. మిల్లర్లు సీఎంఆర్ పాత బకాయిలను చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమనుకుంటే ఆంఆర్ యాక్ట్ కింద ఆయా మిల్లుల యజమానుల నుంచి రికవరీ చేయాలని పౌర సరఫరాల శాఖకు చెందిన జిల్లా మేనేజర్లను ఆయన ఆదేశించారు.

గృహ నిర్మాణం సహా

మౌలిక వసతులు కల్పించండి : కత్తి



విశాలాంధ్ర-అమరావతి : రాష్ట్రంలో నిర్మించే గృహాల నిర్మాణంతోపాటు మౌలిక వసతులు విద్యుత్, పాఠశాలలు, తాగునీరు, రోడ్లు వంటి సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. శుక్రవారం మండలిలో డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం అధ్యక్షతన గ్రామీణ గృహ నిర్మాణంపై చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 2022 నాటికీ అందరికీ ఇళ్లు నిర్మించాలనే కార్యాచరణతో ముం దుకు సాగటం అభినందనీయమన్నారు.1.5 0 లక్షల ఇంటి కోసం లక్షలాది అర్జీలు వస్తున్నాయన్నారు. ముఖేష్ అంబానీ రూ.6,500 కోట్లతో ఇంటిని నిర్మించిన విష యాన్ని గుర్తు చేశారు. రెండు లక్షల ఇళ్లను ఈ ఏడాది పూర్తిచేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకోందని వాటిని సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో భూమి లేని వారికీ భూమి కొనుగోలు చేసి గృహాలు నిర్మించాల న్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఇళ్లకు వెంటనే నిధులు విడుదల చేసి పూర్తి చేయాలన్నారు. తిరుపతి, నంద్యాల, గుత్తి పట్టణాలలో వంద లాది ఇళు ముళ్లపొదలోనే ఉన్నాయన్నారు. వాటిని నిర్మాణానికి మొదట ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఊరికి చివర చెరువుల దగ్గర నిర్మిస్తున్నారన్నారు. దీంతో వసతులు లేక ఇబ్బందులుపడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి అనంతపురంలో ప్రారంభించిన గృహాలు అద్భుతంగా ఉన్నాయని, అటువంటి గృహాలనే రాష్ట్ర మంతటా నిర్మిం చాలని సూచించారు. రాజీవ్ గృహకల్ప గృహాలు నిరుపయోగంగా ఉన్నాయని వాటిని నివాస యోగ్యంగా మార్చాలన్నారు. జర్నలిస్టుల ఇంటికలను నెరవేర్చాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటికి అనుమతులు ఇచ్చే సమయంలోనే పచ్చ దనం, సోలార్ విద్యుత్ వంటి నిబంధనలతో అనుమతులు మంజూరు చేయాల న్నారు. నూతన టెక్నాలజీతో ఎక్కువ కాలం ఉండేలా గృహాలు నిర్మించాలని ఆయన కోరారు.

ఐఐఐటీ స్థల సేకరణపై సమీక్ష : గంటా



విశాలాంధ్ర అమరావతి: ప్రభుత్వం ప్రకాశం జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న ఐఐఐటీకి సంబంధించి స్థల సేకరణపై మంత్రి గంటా శ్రీనివాస రావు శుక్రవారం సమీక్షించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యేలు కదిరి బాబురావు, పోతుల రామారావు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. స్థల సేకరణ అంశంపై విస్తృత చర్చ జరిగింది. ఎక్కడ పెట్టాలనే అంశంపై ప్రజాప్రతినిధుల అభిప్రాయలను మంత్రి గంటా శ్రీనివాసరావు తెలుసుకు న్నారు. రెండు రోజుల్లోగా స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఐఐఐటీ ఒంగోలు డైరెక్టర్ బసవరాజును మంత్రి గంటా ఆదేశించారు.

అమరుల పోరాట స్ఫూర్తితో హోదా కోసం ఆందోళన

భగత్‌సింగ్ వర్ధంతి సభల్లో ఎస్ఎఫ్, వైఎఫ్ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు జిల్లాపరిషత్/తిరుపతి : భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పోరాటాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, వీరి పోరాట స్ఫూర్తితో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం యువత ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్), అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్. లెనిన్‌బాబు, జి. రంగన్న పిలుపు నిచ్చారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 73వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎఫ్, ఎస్ఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని విప్లవ కిశోరాలకు నివాళులర్పించారు. గుంటూరు కొత్తపేటలోని భగత్‌సింగ్ విగ్రహానికి లెనిన్‌బాబు, సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ, నేటి పాలకులు విద్యా, వైద్య రంగాలను వ్యాపారం చేస్తున్నాయని వీటికి వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో విద్యార్థి, యువకులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కావడంలేదని, యువతకు ఉపాధి కల్పన అంశాలపై చర్చించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్,



గుంటూరులో

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వేమూరి సుబ్బారావు,మద్దినేని కిరణ్‌బాబు, నాయకులు గొట్టిముక్కల దుర్గ, వల్లి, నవీన్, రమణ, బీవీ రెడ్డి, బొడ్డు రాజేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో జరిగిన భగత్‌సింగ్ 87వ వర్ధంతి సభలో రంగన్న మాట్లాడుతూ, భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తితో ప్రత్యేక హోదా కోసం విద్యార్థి యువత ఐక్యంగా ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఎఐఎస్ఎఫ్ యూనివర్శిటీ కమిటీ ఆధ్వర్యంలో బండి చలపతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రంగన్న మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ప్రాణ త్యాగాల స్ఫూర్తితో వేముల రోహిత్, కన్హయ్‌కుమార్ లాంటి విద్యార్థి నేతలు మాట్లాడితే వారి నోరు నొక్కి వారిపై



తిరుపతిలో

దేశద్రోహంకేసులు మోపిన మతోన్మాద, రాజకీయశక్తులు నేడు విశ్వవిద్యాలయాలలో విరుచుకుపడి విద్యా కాషాయీకరణ చేస్తున్నాయని విమర్శించారు. ఎస్.వి.యు రిటైర్డు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర్లు, తెలుగువిభాగ అచార్యులు కె.వి.రమణలు భగత్‌సింగ్ త్యాగనిరతిని కొనియాడారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శశికుమార్, కె.శివారెడ్డి, తెలుగుభాషోద్యమ నాయకులు సాకం నాగరాజు, తిరుపతి చాంబర్స్ ఆఫ్ కామర్స్ నాయకులు మంజునాథ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కె.మోహన్ కుమార్, కె.విజయభాస్కర్, విష్ణు, ఉదయ్, విజయ్, బుజ్జిబాబు, పవిత్ర, మహిళ సమాఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.నదియా తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

క్రీడలు

అందుబాటులోకి ఐపీఎల్ టికెట్లు



హైదరాబాద్: నగరవాసులకు శుభవార్త. ఈ ఏడాది హైదరాబాద్‌లో జరిగే ఐపీ ఎల్ మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న అభిమానులు ఇక వేచి ఉండాల్సిన అవసరం లేదు. సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ ఆన్ లైన్ ద్వారా టికెట్ల అమ్మకాలను శుక్రవారం ప్రారంభించింది. కావాల్సిన వారు sunrisershyderabad.inను ఆశ్రయించాలి. రాజీవ్‌గాంధీ ఇంటర్నే షనల్ క్రికెట్ స్టేడియంలో ఏప్రిల్ 9 నుంచి మే 19 వరకు జరిగే మొత్తం 7 మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్లను ఈ సైట్‌లో అందుబాటులో ఉంచారు. అంతేకాదండోయ్ అభిమానుల కోసం ప్రత్యేక ఆఫర్లు కూడా ప్రకటించారు. 5, 10 శాతం డిస్కౌంట్‌తోపాటు జెర్సీని కూడా సొంతం చేసుకునే అవకాశం కల్పించారు. టికెట్ ధరలను ఆరు కేటగిరీలుగా విభజించారు. రూ.500, రూ.781.25, రూ. 976.56, రూ.1,171.88, రూ.2,734.38, రూ.3,906.25 ధరలతో టికెట్లు అందుబాటులో ఉన్నాయి. నగరంలోని 15 ఔట్‌లెట్ల ద్వారా వీటిని అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో భాగంగా సొంతగడ్డపై హైదరాబాద్ ఏప్రిల్ 9న రాజస్థాన్ రాయల్స్‌ను ఢీకొట్టనుంది.

దీపికతో నటించను : కోహ్లి



బెంగళూరు: బాలీవుడ్ భామ దీపిక పదుకొణెతో నటించనని భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి తేల్చి చెప్పినట్లు సమాచారం. ఇంతకీ కోహ్లి ఏంటి? దీపికతో నటించడం ఏమిటి అనే కదా మీ సందేహం. ప్రస్తుతం భారత్‌లో మెగా ఐపీఎల్ టోర్నీ సందడి మొదలైంది. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీ కోసం ఇప్పటి నుంచి నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు 'గోఐబిబో' రూ.11 కోట్లతో ఒప్పందం కుదుర్చుకుంది. 2017లో బాలీవుడ్ భామ దీపిక పదుకొణెని గోఐబిబో బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించు కుంది. తాజాగా ఆర్‌సీబీతో ఒప్పందం కుదుర్చుకున్న గోఐబిబో విరాట్ కోహ్లి-దీపిక పదుకొణె మీద ఐపీఎల్ కోసం ఓ యాడ్ తీద్దామనుకున్నారు. ఇదే విషయాన్ని కోహ్లికి తెలపగా.. దీనికి అతడు నో చెప్పినట్లు సమాచారం. దీంతో గోఐబిబో ఆర్‌సీబీతో ఒప్పందాన్ని రద్దు చేసుకునే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 'మా యాడ్‌లో నటించనని కోహ్లి నో చెప్పలేదు. ప్రచార కార్యక్రమాల్లో మరో సెలబ్రెటీతో నటించనని మాత్రమే చెప్పాడు' అని గోఐబిబో నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే ఒప్పో మొబైల్స్‌కి కోహ్లి, దీపికలు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. గతంలో ఆర్‌సీబీ జట్టుకు దీపిక పదుకొణె బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. 2007-08 సమయంలో దీపిక, ధోనీ ఆ తర్వాత యువరాజ్ సింగ్‌తో డేటింగ్‌లో ఉన్నట్లు కూడా అప్పట్లో వార్తలు వచ్చాయి. దీపిక కోసమే ధోనీ తన పొడవాటి జట్టును కత్తిరించేసుకున్నాడని కూడా రూమర్లు చక్కర్లు కొట్టాయి.



ధోనీ ప్రాక్టీస్టు షురూ..!

చెన్నై: రెండేళ్ల నిషేధం తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ మళ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) బరిలోకి దిగుతోంది. దీనిలో భాగంగా జట్టు తొలి ప్రాక్టీస్ సెషన్ గురువారం జరిగింది. దీనికి విదేశీ క్రికెటర్లు మినహా మిగతా క్రికెటర్లంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా జట్టు కెప్టెన్ ఎంఎస్ ధోని ప్రాక్టీస్ అదిరింది. ఒకవైపు భారీ షాట్లతో ప్రాక్టీస్ చేసిన ధోని.. మరొకవైపు కూల్‌గా ఆఫ్ డ్రైవ్‌లు కొడుతూ కూడా కనిపించాడు.

స్లెడ్జింగ్ ఇష్టం ఉండదు : రహానె



ముంబై: క్రికెట్ మైదానంలో స్లెడ్జింగ్ చేయడం ఇష్టం ఉండదు అని చెప్పాడు భారత క్రికెటర్ రహానె. తాజాగా మహారాష్ట్ర మోటార్ వెహికల్ డిపార్ట్‌మెంట్(ఎమ్‌వీడీ) రహదారి భద్రత, శబ్ద కాలుష్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఓ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా మార్చి 24 అంటే శనివారం ముంబైలోని వాంఖడే మైదానంలో ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రహానె మాట్లాడుతూ.. 'మైదానంలో స్లెడ్జింగ్ చేయడం, అలాగే డ్రైవింగ్ చేసే సమయంలో అనవసరంగా కారు హారన్ మోగించడం కూడా నాకు ఇష్టం ఉండదు. ముంబై లాంటి మెట్రో నగరాల్లో శబ్ద కాలుష్యం అనేది చాలా పెద్ద సమస్య' అని అన్నాడు రహానె. రోడ్ సేఫ్టీ ఎలెవన్-నో హాంకింగ్ ఎలెవన్ మధ్య అధికారులు ఓ టీ20 మ్యాచ్ నిర్వహిస్తున్నారు. యువరాజ్ సింగ్, కేఎల్ రాహుల్, దినేశ్ కార్తీక్, హర్భజన్ సింగ్, శిఖర్ ధావన్, హార్దిక్ పాండ్య, సురేశ్ రైనా కూడా ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రహానె రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. ఏప్రిల్ 7నుంచి ఐపీఎల్ ప్రారంభంకానుంది.

ఓటమిని మర్చిపోలేకపోతున్న బంగ్లా

ఢాకా: నిదహాస్ ట్రోఫీలో భారత్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ ఓటమిని బంగ్లాదేశ్ ఆటగాళ్లు ఇంకా జీర్ణించు కోలేక పోతున్నారు. చివరి వరకూ గెలుస్తుంది అనుకున్న మ్యాచ్ చివరి బాల్‌కి తలకిం దులవ్వ డాన్ని తట్టుకోలేకపోతు న్నారు. ఇప్ప టికే మ్యాచ్ ఓటమిపై బంగ్లా దేశ్ పేసర్ రూబెల్ హుస్సేన్ పశ్చాతాపం వ్యక్తం చేశాడు. తాను ధారా ళంగా పరుగులి వ్వడంతోనే తమ జట్టు ఓటమి పాలైందని, ఈ విషయంలో అభిమానులు క్షమించాలని విజ్ఞప్తి చేశాడు. తమ జట్టు ఓటమికి తానే కారణమవుతానని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఓటమిని జీర్ణించుకోలేక పోతున్నానని, ఈ ఒక్కసారికి వదిలేయాలని అభిమాను లకు కోరాడు.

తాజాగా చివరి ఓవర్ వేసిన సౌమ్య సర్కార్ స్పందిం చాడు. మ్యాచ్ ఓటమికి తాను కూడా కారణమంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. 'నేను ఇంతకు ముందు కూడా బౌలింగ్ చేశాను... కానీ ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో ఎప్పుడూ బౌలింగ్ చేయలేదు. ఈ మ్యాచ్‌తో ఎలాంటి పరిస్థితుల్లోనైనా కటు దిట్టంగా బాల్స్ వేయగలననే నమ్మ కం వచ్చింది. గతంలో మా జట్టు టీ20 మ్యాచ్‌ల్లో భారీ తేడాతో ఓటమి చవిచూసేది. కానీ ఇప్పుడు 200 పరుగులు లక్ష్మాన్ని కూడా చేయగలుగుతున్నాం. అదే విధంగా భారీ లక్ష్యాలను కూడా సునాయాసంగా ఛేధించగలుగు తున్నాం. కానీ మొన్నటి మ్యాచ్ ఓటమి మరచిపోలేక పోతున్నాను. ఇప్పటికీ ఆ మ్యాచ్ గుర్తొస్తే బాధగా ఉంది. ఆఖరి



ఓవర్‌లో భారత్ విజయానికి అవసరమైన 12 పరుగుల్ని సమర్పించుకోవడం నా కెరీర్‌లో చేదు జ్ఞాపకం. ప్రధా నంగా చివరి బంతికి సిక్సర్ ఇచ్చి మా పరాజయంలో భాగమయ్యా. ఆ రోజు నేను బాగా బౌలింగ్ చేసి ఉంటే 16 కోట్ల మంది పెదవులపై చిరునవ్వును చూసేవాళ్లం' అని సౌమ్య తెలిపాడు. బంగ్లాదేశ్‌తో గత ఆదివారం ఉత్కంఠభరింతగా జరిగిన నిదహాస్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో సౌమ్య వేసిన ఆఖరి బంతితో భారత్ అద్భుత విజయం సాధించిన విషయం తెలిసిందే.

మమతను కలిసిన జహాన్



కోల్‌కతా: టీమిండియా పేసర్ మహమ్మద్ షమీ భార్య హసీన్ జహాన్ శుక్రవారం పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిశారు. సచివాలయంలో వీరిద్దరు దాదాపు 10 నిమిషాలపాటు మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ కేసుపై దృష్టి సారిస్తానని ఈ సందర్భంగా హసీన్‌కు సీఎం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మ్యాచ్ ఫిక్సింగ్ కేసును విచారించిన బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం దర్యాప్తు బృందం షమీకి క్లీన్‌చిట్ ఇచ్చిన నేపథ్యంలో వీరి కలయిక ప్రాధాన్యం సంతరించుకుంది. షమీపై వచ్చిన ఆరోపణలు తప్పని తేలడంతో బీసీసీఐ తిరిగి షమీ కాంట్రాక్ట్‌ను పునరుద్ధరించింది. షమీపై హసీన్ జహాన్ పలు ఆరోపణలు చేశారు. ఆమె ఫిర్యాదుతో షమీపై కోల్‌కతా పోలీసులు గృహహింస, హత్యాయత్నం తదితర కేసులను నమోదు చేశారు. ఇందులో భాగంగా షమీ, హసన్‌లను ఇప్పటికే విచారించారు.

నేటి నుంచి ఎమ్మెల్యేల స్పోర్ట్స్ మీట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 24, 26 తేదీల్లో ఏపీ ఎమ్మెల్యేల స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2018 నిర్వహిస్తున్నామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విజయవాడ ఇందిరాగాంధీ మన్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, దండమూడి రాజగోపాల్ మునిసిపల్ ఇండోర్ స్టేడియంలలో జరుగుతాయని, శని, సోమవారాల్లో జరిగే ఈ పోటీల్లో ముఖ్యమంత్రి జట్టు, స్పీకరు జట్లు తలపడతాయని పేర్కొన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేం దుకుగాను ఇప్పటి వరకూ ఎమ్మెల్యేలు(పురుషులు) 42 మంది, మహిళా ఎమ్మెల్యేలు 12 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. పురుషులకు క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, వాలీబాల్, అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడల్లోనూ, మహిళా ఎమ్మెల్యేలకు బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడల్లో పోటీలు జరుగుతాయని మంత్రి వివరించారు. ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

అందుకే ఒకటో నెంబర్ జెర్సీ




న్యూఢిల్లీ: ఐపీఎల్ కాంట్రాక్టు దక్కించుకున్న తొలి నేపాల్ క్రికెటర్‌గా సందీప్ లమిచానె రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. జనవరిలో నిర్వహించిన వేలంలో అతడిని కనీస ధర రూ.20లక్షలకే ఢిల్లీ డేర్‌డెవిల్స్ సొంతం చేసుకుంది. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ఫ్రాంఛైజీ నిర్వాహకులు గౌతమ్ గంభీర్ తదితర ఆటగాళ్ల ఆధ్వర్యంలో నూతన జెర్సీని ఆవిష్కరించారు. తాజాగా సందీప్ ఢిల్లీ డేర్‌డెవిల్స్ జెర్సీని నేపాల్ స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యుడు కేశవ్ బిస్తా నుంచి అందుకున్నాడు. సాధారణంగా ఆటగాళ్లు అంతర్జాతీయ క్రికెట్లో ఏ నంబర్ జెర్సీ ధరించి ఆడుతున్నారో అదే నంబర్ జెర్సీతో ఐపీఎల్ కూడా ఆడటం మనం చూశాం. ఐతే, సందీప్ మాత్రం మరో నంబర్‌ను తన జెర్సీపై ఎంచుకున్నాడు. నేపాల్ తరపున ఆడే సమయంలో సందీప్ 25వ నంబర్ జెర్సీ ధరిస్తాడు. మరి ఇప్పుడు ఒకటో నంబర్ ఎందుకు ఎంచుకున్నాడా అని అందరిలో సందేహం నెలకొంది. దీనికి సందీప్ వివరణ ఇచ్చాడు. '25వ నంబర్‌ను ఇప్పటికే సీనియర్ ఆటగాళ్లకు కేటాయించారు. వారి నుంచి తీసుకోవడం సరికాదు. అనారోగ్యానికి గురై చనిపోయిన నా మేనల్లుడి జన్మదినం జనవరి 1. అందుకే ఒకటో నంబర్ జెర్సీ ఎంచుకున్నా. అంతేకాదు ఎల్లప్పుడూ నంబర్‌వన్‌గా ఉండాలని కోరుకుంటా. అది కూడా ఓ కారణం' అని సందీప్ వివరించాడు. టోర్నీలో భాగంగా ఢిల్లీ తన తొలి మ్యాచ్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌తో తలపడనుంది. ఏప్రిల్ 8న మొహాలీలో ఈ మ్యాచ్ జరగనుంది.

స్వర్ణదేవాలయంలో గంభీర్



న్యూఢిల్లీ: మరికొద్ది రోజుల్లో ప్రారం భంకానున్న ఐపీఎల్ కోసం ఆటగాళ్లు సిద్ధమవు తున్నారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీ డేర్‌డెవిల్స్ సారథి గౌతమ్ గంభీర్ అమృత్ సర్ లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించాడు. 2011 నుంచి కోల్‌కతా నైట్‌రై డర్స్‌కు ప్రాతినిథ్యం వహిం చిన గంభీర్ ఈ ఏడాది తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు. జనవరిలో జరిగిన వేలంలో కనీస ధర రూ.2కోట్లకు ఢిల్లీ డేర్‌డెవిల్స్ సొంతం చేసుకుంది. కొద్ది రోజుల క్రితం ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు గంభీర్ నాయకత్వం వహిస్తాడని ఆ జట్టు ఫ్రాంఛైజీ నిర్వాహకులు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 7నుంచి ఈ ఏడాది ఐపీఎల్ మెగా టోర్నీ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో గంభీర్ తన కుటుంబసభ్యులతో కలిసి అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించి ఆశీస్సులు అందుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ఇప్పుడు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. టోర్నీలో భాగంగా ఢిల్లీ జట్టు తన తొలి మ్యాచ్‌లో కింగ్స్ ఎలెవన్‌ను ఢీకొట్టనుంది. మొహాలీ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. గంభీర్ నాయకత్వంలోనే కోల్‌కతా రెండుసార్లు విజేతగా నిలిచింది. ఇప్పటి వరకు 148 మ్యాచ్‌లు ఆడిన గంభీర్ 4,132 పరుగులు చేశాడు.



ఇదిగో.. ఎంఐ ఎమోజీలు

ముంబై: మరికొద్ది రోజుల్లో ఐపీఎల్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ నిర్వాహకులు పలువురి ఆటగాళ్ల యానిమేటెడ్ ఎమోజీలను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ 'మన జట్టులో కొత్త ముఖాలను పరిచయం చేయబోతున్నాం. సిద్ధంగా ఉండండి' అని పేర్కొన్నారు. దీంతో కెప్టెన్ రోహిత్ శర్మ ఆశ్చర్యపోయాడు. 'కొత్త ముఖాలా వారెవరు? ముందుగా నాకెందుకు చెప్పలేదు?' అని ప్రశ్నించాడు. దీనికి స్పందించిన ముంబై ఇండియన్స్ 'మేము చెప్పేది ఎమోజీల గురించి' అని బదులిచ్చింది. వెంటనే తన ఎమోజీని చూసుకున్న రోహిత్ సంతోషం వ్యక్తం చేసి మిగతా ఆటగాళ్ల గురించి అడిగాడు. సూపర్ మ్యాన్ అవతారంలో కీరన్ పొలార్డ్, బుమ్రా, హార్దిక్, కృనాల్ పాండ్యకు సంబంధించిన ఎమోజీలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా జుట్టు నుంచి మంటలు వచ్చే హార్దిక్ పాండ్య ఎమోజీ రోహిత్ శర్మతో పాటు నెటిజన్లకు విపరీతంగా నచ్చింది.

వ్యతిరేకిస్తే..జైల్లో పెడుతున్నారు

మోడీ పాలన తీరుపై నారాయణ విమర్శ



విశాలాంధ్ర - సూళ్ళూరుపేట: ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన పరిపాలనను ఎవరైనా వ్యతిరేకిస్తే సహించడంలేదని, వారి పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వాళ్లని జైళ్లలో పెడుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోడీని వ్యతిరేకించడం వల్లే ఆర్జేడీ అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ జైలు పాలయ్యాడని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇస్తే చర్చకు చేపట్టకుండా పార్లమెంట్ ఉభయ సభలను వాయిదా వేయడాన్ని నారాయణ తప్పుపట్టారు. కేంద్రం చర్యను నిరసిస్తూ, చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వివిధ వేషధారణల్లో ప్రభుత్వానికి నిరసన తెలపడాన్ని కొందరు ఎగతాళి చేయడం సరికాదన్నారు. బీహార్, మహారాష్ట్ర, హర్యానా వంటి రాష్ట్రాలకు మోడీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఇస్తున్నదని, పార్లమెంట్ హామీ ఇచ్చిన మన రాష్ట్రానికేమో ప్రత్యేకహోదా కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడిపై వ్యక్తిగత కక్ష ఉంటే జైలులో పెట్టండి కాని, తెలుగుప్రజలను చిన్నచూపు చూడొద్దన్నారు. తెలంగాణలోని టీఆర్ఎస్ రాష్ట్రంలో ఓ పాత్ర, ఢిల్లీలో ఓ పాత్ర పోషిస్తున్నదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏ పని చేపట్టినా పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడుతోందే తప్పితే రైతులు, సామాన్యులకు ఏ మాత్రం ఉపయోగపడే విధంగా లేదన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో తరిస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి రిటైల్‌గా ఉంటే బీజేపీ హయాంలో హోల్‌సేల్ అయిపోయిందని నారాయణ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, నెల్లూరు జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ ప్రభాకర్, దేగా సత్యం, బి.వెంకటేశ్వర్లు, ఓ.క్రిష్ణ, ఏడుమలై, జిల్లా రైతు సంఘం కార్యదర్శి చెంగేని సుధాకర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆనంద్‌బాబు, ఎ.బాలయ్య పాల్గొన్నారు.

డిక్లరేషన్ అందుకున్న సీఎం రమేష్



విశాలాంధ్ర-అమరావతి: రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ రెండోసారి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో శుక్రవారం అసెంబ్లీకి వచ్చి శాసనమండలి కార్యదర్శి సత్యనారాయణ నుంచి డిక్లరేషన్ ఫారాన్ని అందుకు న్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా బీజేపీ అడ్డుకుంటోందనీ, అన్నాడీఎంకే బీజేపీ చెప్పు చేతల్లో నడుస్తుందని విమర్శించారు. స్పీకర్ అవిశ్వాస తీర్మానానికి 50 సభ్యుల మద్దతు ఉందా లేదా చూసే అవకాశం ఉందనీ, కానీ ఆవిధంగా చేయడం లేదని మండిపడ్డారు. మనసు ఉంటే మార్గం ఉంటుందన్నారు. అవిశ్వాసం విషయంలో ప్రభుత్వం పారిపోయిందన్నారు. దిగివచ్చి సమస్య పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామని, నాలుగేళ్ళు టీడీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు కనిపించని అవినీతి ఇప్పుడు కనిపిస్తుందా అని ప్రశ్నించారు. టీడీపీ ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందని, బీజేపీ ఆడుతున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనను రెండోసారి రాజ్యసభకు పంపినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

క్రిమినల్ కేసుల రద్దు ఆపండి

సీపీఐ డిమాండు

న్యూఢిల్లీ: ముజఫర్‌నగర్, షామిలి ప్రాంతాల్లో 2013లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించిన 131 క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేస్తున్న ప్రయత్నాలను సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం ఖండిస్తూ తక్షణం ఆ ప్రయత్నాలను మానుకోవాలని డిమాండు చేసింది. కేసులు నమోదైనవారిలో 13మంది హత్యలలోనూ, 11మంది హత్యాప్రయత్నాలలోనూ పాత్రధారులన్న బలమైన ఆరోపణలు ఉన్నాయి. ఆనాడు జరిగిన మతపరమైన దాడుల్లో 60మంది మైనారిటీలు హత్యకు గురయ్యారు. దాదాపు 40వేలమంది ఆ ప్రాంతాలను వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఇలాంటి దుర్మార్గమైన నేరాలకు పాల్పడిన దోషులను శిక్షించకుండా వదిలివేయరాదు. నేరస్థులను ఎన్‌కౌంటర్‌లలో కాల్చివేయాలని గొప్పగా ప్రకటించిన యోగి ప్రభుత్వం ఉప ఎన్నికలలో ఓటమి చెందినతర్వాత తన అసలురంగును బైటపెట్టుకుంది. ఈ నేరస్థులను స్వేచ్ఛగా వదిలిపెట్టి ఎన్నికలలో తమకు వ్యతిరేకంగా ఓటువేసిన ప్రజలను శిక్షించాలని యోగి ప్రభుత్వం భావిస్తోంది. ఈ చర్యను నిలువరించవలసిందిగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని సీపీఐ కోరింది. ఇలాంటి దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామిక వామపక్ష పార్టీలు, శక్తులు ఐక్యంగా పోరాడాలని పార్టీ విజ్ఞప్తి చేసింది. అణగారిన ప్రజల హక్కుల రక్షణ కల్పిస్తూ 1989లో చేసిన ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలో నిబంధనలను సడలిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సీపీఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో మైనారిటీలు ప్రత్యేకించి ముస్లింలు ఎస్‌సి, ఎస్‌టీలపైన దాడులు జరుగుతున్న సమయంలో కోర్టు చేసిన నిర్ణయం పాలకపార్టీకి మద్దతుగా నిలుస్తుంది. అణగారిన ప్రజల హక్కుల రక్షణకు ఉద్దేశించిన చట్టాన్ని అమలుచేసేందుకు ఈ తీర్పు ఆటంకం కలిగిస్తుంది. అందువల్ల తీర్పుపైన సమీక్షించాలని ప్రభుత్వం కోర్టుకు అప్పీలు చేయవలసిందిగా సీపీఐ డిమాండు చేసింది. అనేక శతాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ ప్రజల హక్కులను ఉల్లంఘిస్తున్నారు. వారి హక్కులను కాపాడవలసిన ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు రాజకీయ పార్టీల లేదా వ్యక్తుల ప్రయోజనాలకు ఉపయోగపడేవిధంగా ఉంది. అందువల్ల కేంద్రం తీర్పుపై సమీక్షకు విజ్ఞప్తి చేయాలి.

అనుకున్న లక్ష్యం సాధించాలి

- పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లండి
- పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-అమరావతి: మన ఎంపీల పోరాటం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరిగిన నిరసనలే అందుకు నిదర్శనం. ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి. అనుకున్న లక్ష్యం సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం ఆయన టెలి కాన్ఫరెన్స్‌లో ఎంపీలు, మంత్రులతో మాట్లా డారు. ఎంపీలంతా ఏకతాటిపై నిలబడాలనీ, ప్రజల మనోభావాలు ప్రతిబింబించాలన్నారు. పదేపదే కేంద్రం చుట్టూ తిరుగుతూ, ఒకటికి పదిసార్లు అడిగినా స్పందించలేదనీ, పైగా మనకు ఇవ్వాల్సినవి కోత పెడుతున్నారనీ ఇతరులకు మాత్రం ధారాళంగా ఇస్తున్నారని సీఎం చెప్పుకొచ్చారు. ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదనీ, ఈశాన్య రాష్ట్రా లకు కేంద్రం రూ.3 వేల కోట్లు విడుదల చేసిం దనీ, ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే నిధులలో కోత విధి స్తోందనీ ఇది సరైన విధానం కాదనీ, ఎంపీలంతా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రాబోయే ఇబ్బందులకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎవరిపైనా కోపం లేదనీ, రెండు జాతీయ పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేశాయన్నదే బాధని ఆయన తెలిపారు. రాష్ట్రానికి న్యాయం చేయాల న్నదే తమ డిమాండనీ, నాలుగేళ్లలో సగటున ఏడాదికి 10.5 శాతం వృద్ధి సాధించామనీ, తెలంగాణలో 8.5 శాతం వృద్ధి వచ్చిందని బాబు తెలిపారు. పోలవరంపై, ఆంధ్రప్రదేశ్‌పై కుట్ర చేస్తున్నారన్నారు. దక్షిణాదిలో నాయకత్వం బలహీనపరచాలని చూస్తున్నారనీ, రాష్ట్రంలో అభి వృద్ధి ఆగకూడదనీ, ఎన్టీఆర్‌ను 1985లో అధి కారం నుంచి దించినప్పుడు 161 మంది ఎమ్మెల్యేలు ఏకతాటిపై నిలిచి అనుకున్న లక్ష్యం సాధించిన విషయం గుర్తుంచుకోవాలని, అదే స్ఫూర్తితో ప్రస్తుతం ఎంపీలు కూడా పోరాడాలని సూచించారు. పార్లమెంటరీ పార్టీ నేత వైఎస్ చౌదరి మాట్లాడుతూ రాజ్యసభలో తన ప్రసం గంలో సగంపైగా ఏ నిబంధన కింద తొలగిం చారో చెప్పాలని డిమాండు చేశానన్నారు. వెల్‌లో అడ్డంగా ఉన్నందున, లెక్కించేందుకు సభ్యులు కనబడడం లేదని స్పీకర్ అంటున్నారంటూ, వారిని సస్పెండ్ చేసి లెక్కించాలని కోరినా స్పందన లేదన్నారు. ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఎంపీలంతా అవిశ్వాసం నోటీసు ఆమోదం పొందడంపైనే తమ దృష్టి కేంద్రీకరించాలన్నారు. రాష్ట్రానికి నిధుల గురించి కేంద్ర మంత్రులతో ఎంపీలు మాట్లాడటాన్ని కూడా వైసీపీ అనుకూల మీడియా దుష్ప్రచారం చేయడాన్ని తప్పుబట్టారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో టీడీపీ లోక్‌సభాపక్ష నేత తోట నరసింహం, ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్, శాసనసభ, శాసనమండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాథరెడ్డి, పయ్యావుల కేశవ్, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

టొటెం ఇన్‌ఫ్రా డైరెక్టర్లు అరెస్టు



హైదరాబాద్: బ్యాంకులకు రూ.313 కోట్ల మేర టోపీ పెట్టిన టొటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు తొట్టెంపూడి సలలిత్, కవితలను సీబీఐ శుక్రవారం అరెస్టు చేసింది. బ్యాంకులను మోసగించారన్న అభియోగాలపై గురువారం కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కంపెనీ తమను రూ.313.84 కోట్ల మేర మోసగించిందని పేర్కొంటూ హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంపెనీ, దాని ఇద్దరు డైరెక్టర్లు, మరికొందరిపై సీబీఐ కేసులు పెట్టింది. ఈ సంస్థ మొత్తం ఎనిమిది బ్యాంకులు, ఆర్థిక సంస్థల సమాఖ్యకు రూ.1394.43 కోట్ల మేర బకాయి పడినట్టు సీబీఐ గురువారం వెల్లడించిన విషయం తెలిసిందే.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.